VELTHURU TELUGU DAILAY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

హైదరాబాద్
శుక్రవారం 08.05.2026

సంపుటి: 07 సంచిక: 335
పేజీలు: 12 వెల: రూ. 5/

Velthuru Newspaper

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA I ANDHRA PRADESH


2

## మహిళా సంఘాలకు ప్రభుత్వం గుడ్ న్యూస్

- రూ.10 లక్షల వడ్డీలేని రుణాలు
- ఎస్‌హెచ్‌జీలకు తెలంగాణ ప్రభుత్వ శుభవార్త
- వడ్డీలేని రుణ పరిమితి రూ.5 లక్షల నుంచి పెంపు
- ఇకపై రూ.10 లక్షల వరకు రుణ సౌకర్యం
- బ్యాంకు రుణాల వడ్డీని ప్రభుత్వమే భరిస్తుంది
- ప్రజాభవన్‌లో వార్షిక రుణ ప్రణాళిక ఆవిష్కరణ
- కార్యక్రమానికి హాజరైన మంత్రి సీతక్క

# కాళ్లు, చేతులు లేకపోయినా చరిత్ర సృష్టించిన వారెందరో ఉన్నారు

- చూపులేకపోయినా కోట్లాది జీవితాల్లో వెలుగులు నింపిన వారున్నారు
- శరీరంతో కాదు...మనసుతో గెలవండి
- అవయవ లోపం బలహీనత కాదు... మరో కోణంలో గెలిచే శక్తిగా భావించండి
- మీ పరిమితిని నిర్ణయించేది మీ శరీరం కాదు... మీ ఆత్మవిశ్వాసం
- దివ్యాంగుల సంక్షేమం, అభ్యున్నతి కోసం మోదీ సర్కార్ ప్రాధాన్యతనిస్తోంది
- యూపీఏ ప్రభుత్వంతో పోలిస్తే దివ్యాంగులకు 3 రెట్ల బడ్జెట్ ను అధికంగా కేటాయిస్తున్నాం.
- భవిష్యత్తులో దివ్యాంగులందరికీ ఉపకరణాలు అందిస్తాం
- దివ్యాంగులకు సేవ చేయడం మహాభాగ్యం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడి
- సిరిసిల్లలో 466 మంది దివ్యాంగులకు రూ.84 లక్షల విలువైన 813 ఉపకరణాలను అందించిన కేంద్ర మంత్రి

కరీంనగర్ వెలుతురు మే 07:

అవయవ లోపం అనేది బలహీనత కాదని, జీవితాన్ని మరో కోణంలో గెలిచే శక్తిగా భావించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సూచించారు. కాళ్లు, చేతులు లేకపోయినా చరిత్ర సృష్టించిన వారెందరో ఉన్నారు. కంటి చూపు లేకపోయినా కోట్లాది మంది జీవితాల్లో వెలుగులు నింపి ఎంతో మంది దివ్యాంగులు స్రుష్టించారని చెప్పారు. దివ్యాంగులకు సేవ చేయడం మహాభాగ్యమని అన్నారు. అందులో భాగంగా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోనే దివ్యాంగుల ..మిగతా 2లో





## మమతకు మరో భారీ షాక్

- 10 మంది టీఎంసీ ఎమ్మెల్యేలు మిస్సింగ్
- పార్టీ ఫిరాయించారా? అసలు ఎక్కడున్నారు?
- ఎన్నికల పరాజయం తర్వాత తృణమూల్‌లో అంతర్గత పరిణామాలపై చర్చ
- పార్టీ భవిష్యత్ కార్యాచరణ కోసం టీఎంసీ కీలక సమావేశం
- 80 మంది ఎమ్మెల్యేలలో 70 మంది మాత్రమే హాజరు
- టీఎంసీలో అసంతృప్తి, చీలిక ఊహాగానాలు జోరందుకున్న పరిస్థితి

2

# మోదీ హైదరాబాద్ పర్యటన షెడ్యూల్ ఖరారు

**ఈనెల 10న నగరంలో ప్రధాని పర్యటన**

- ఈనెల 10న నగరంలో ప్రధాని పర్యటన
- మధ్యాహ్నం బేగంపేటకు చేరుకోనున్న మోదీ
- బెంగళూరు నుంచి ప్రత్యేక విమానంలో రాక
- హెచ్‌ఐసీసీలో అభివృద్ధి కార్యక్రమాలు
- పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- హైటెక్ సిటీలో ఆస్పత్రి ప్రారంభం
- పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభ

11



ఉగ్రమూకలకు బుద్ధి చెప్పాం 11



# మట్టిలో మాణిక్యాలను వెలికితీయాలి

- క్రీడలతో శారీరక ధృడత్వం, పట్టుదల, క్రమశిక్షణ పెరుగుదల
- ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవం సందర్భంగా క్రీడాకారులకు సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు

హైదరాబాద్, మే 7 (వెలుతురు):

క్రీడలను ప్రోత్సహిస్తూ మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం, దేశ భవిష్యత్తు కోసం ప్రజా ప్రభుత్వం క్రీడారంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు. ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవం సందర్భంగా గురువారం రాష్ట్రంలోని క్రీడాకారులు, క్రీడాభిమానులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఆరోగ్యానికి, ఆత్మవిశ్వాసానికి, యువత భవిష్యత్తుకు పునాదిగా నిలిచే అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న ప్రతి క్రీడాకారుడికి అభినందనలు తెలియజేశారు. ఒలింపిక్స్‌లో తెలంగాణ క్రీడాకారులు రాణించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక క్రీడా విధానాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. అలాగే యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ (YIPESU)ని ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు. ఒలింపిక్స్ లక్ష్యంగా ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో గచ్చిబౌలి స్టేడియంను అత్యాధునికంగా అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. ..మిగతా 2లో


11

## విజయ్‌కు మళ్లీ నిరాశేనా?

- తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటుపై ఉత్కంఠ
- గవర్నర్‌తో విజయ్ భేటీ.. ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి
- అసెంబ్లీలో బలనిరూపణ చేసుకుంటామని గవర్నర్‌కు విజయ్ స్పష్టీకరణ
- పూర్తి సంఖ్యాబలంతోనే ముందుకు రావాలని గవర్నర్ ఆర్లేకర్ సూచన
- తమ వద్ద అవసరమైన మద్దతు ఉందని విజయ్ వాదన



11

## ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు

- భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం
- గృహ విప్లవం, రెవెన్యూ సంస్కరణలతో తెలంగాణలో నవశకానికి శ్రీకారం
- అదనపు ఎమ్మార్వోల నియామకం
- ఏ చిన్న పొరపాటు జరిగిన ఉపేక్షించేది లేదు
- ఉమ్మడి నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లాల సమీక్షలో




## పదేళ్లలో గ్లోబల్ సిటీగా హైదరాబాద్

11

- భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పన
- అంతర్జాతీయ పెట్టుబడులను భారీగా ఆకర్షించేలా అభివృద్ధి ప్రణాళికలు
- 'నాస్కామ్ జీసీసీ సమ్మిట్ 2026'లో మంత్రి శ్రీధర్ బాబు

## భౌతిక దాడులకు రాజకీయాల్లో స్థానం లేదు: మంత్రి పొన్నం ప్రభాకర్

- వ్యక్తిగత విమర్శలే ఇటువంటి ఘటనలకు కారణం
- నాయకులు హుందాగా వ్యవహరించాలని సూచన
- ప్రజా ప్రతినిధుల ఇళ్లపై దాడులు సరికాదన్న మంత్రి
- చౌకబారు ప్రచారాలకు దూరంగా ఉండాలన్న వ్యాఖ్య
- కార్యకర్తలను అదుపులో పెట్టుకోవాలని నేతలకు సూచన

వెలుతురు, హైద్రాబాద్ మే 07:

ప్రజాస్వామ్యంలో భౌతిక దాడులకు ఎలాంటి స్థానం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు సర్వసాధారణమే అయినప్పటికీ నాయకులు హుందాతనంతో వ్యవహరించాలని సూచించారు. వ్యక్తిగత విమర్శలకు తావు ఇవ్వకూడదని పేర్కొన్నారు.కొంత మంది నాయకులు వ్యక్తిగత విమర్శలకు దిగడం వల్లే ఇటువంటి పరిస్థితులు తలెత్తుతున్నాయని మంత్రి అభిప్రాయపడ్డారు. ప్రజలు వేసిన ఓట్లకు గౌరవం ఇచ్చే విధంగా నాయకుల ప్రవర్తన ఉండాలని, ప్రజా ప్రతినిధులు ప్రజాస్వామ్య బద్ధంగా వ్యవహరించాలని కోరారు. ..మిగతా 11లో



## రైతులకు ఎంతో మేలు చేశాం

- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు
- బీఆర్ఎస్ చేయలేనిది రెండేళ్లలో చేశాం
- బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై తుమ్మల విమర్శలు
- రెండేళ్లలోనే రుణమాఫీ పూర్తి చేశామన్న వ్యాఖ్య


2

## ఢిల్లీకి నజరానా.. రైతులకు జరిమానా..!

- వడ్ల కొనుగోళ్లలో ప్రభుత్వ వైఫల్యం.. రైతులను గాలికొదిలేశారు..!
- చౌటుప్పల్ మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శించిన హరీశ్ రావు
- తరుగు, జాప్యాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన ఆగ్రహం


11

## భూసేకరణలో వివక్ష.. గిరిజనుల భూములే టార్గెట్..!

- ఫార్మా సిటీ పేరుతో రైతుల భూములు లాక్కోవద్దు
- ఫ్యూచర్ సిటీపై ప్రభుత్వాలు నిజాలు చెప్పడం లేదు
- ఫార్మాసిటీ రైతులకు న్యాయం జరిగే వరకు పోరటం
- బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన తప్పలకు క్షమాపణ చెబుతున్నా
- మంచి మాటకు వినే ప్రభుత్వాలు లేవు.. పోరాటమే శరణ్యం
- ప్రభుత్వం పై మండిపడ్డ కవిత


2

## బూతులు తిడితే ఊరుకుంటమా?

- కౌశిక్ రెడ్డి దాడిపై పాయల్ శంకర్ స్పందన
- భౌతిక దాడులను బీజేపీ ఎప్పుడూ ప్రోత్సహించదు: పాయల్ శంకర్
- కార్యకర్తల సహనాన్ని చేతగానితనంగా భావిస్తే ఫలితాలు ఇలానే ఉంటాయని వ్యాఖ్య
- బూతులు, వ్యక్తిత్వ హననంతో కార్యకర్తల్లో ఆగ్రహం పెరుగుతోందని విమర్శ
- మహిళా గవర్నర్‌ను గతంలో కౌశిక్ రెడ్డి కించపర్చారని ఆరోపణ
- అధికారులపై కూడా నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపాటు
- ఓటర్లను, ప్రజలను బ్లాక్‌మెయిల్ చేసే రాజకీయాలు చేస్తున్నారని విమర్శ
- కాందిశీకుల భూముల అంశంపై కేటీఆర్ ఆధారాలు చూపాలని డిమాండ్


11

## మట్టిలో మాణిక్యాలను వెలికితీయాలి

**(మొదటి పేజీ తరువాయి)**
అథ్లెటిక్స్ ప్రతి మనిషిలో దాగి ఉన్న శక్తి, సామర్థ్యాలను వెలికితీసే శక్తివంతమైన క్రీడ అని సీఎం అభిప్రాయపడ్డారు. ఈ క్రీడలు శరీరాన్ని దృఢంగా, మనసును స్థిరంగా తీర్చిదిద్దడంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల పెంపొందిస్తాయని అన్నారు. అందువల్ల అథ్లెటిక్స్‌ను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవం సందర్భంగా ఆరోగ్యంతో పాటు ఆత్మవిశ్వాసం, విజయానికి దారితీసే ప్రయాణాన్ని ప్రారంభిద్దామని ఆకాంక్షించిన సీఎం, రాష్ట్రంలోని క్రీడాకారులు మరియు క్రీడాభిమానులకు మరోసారి శుభాభినందనలు తెలిపారు.

## మమతకు మరో భారీ షాక్

పశ్చిమ బెంగాల్ వెలుతురు మే 07:

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో తాజా పరిణామాలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఎన్నికల్లో ఎదురుదెబ్బ తగిలిన నేపథ్యంలో అధికారాన్ని కోల్పోయిన తృణమూల్ కాంగ్రెస్‌లో అంతర్గత పరిస్థితులపై ఆసక్తికర చర్చ సాగుతోంది. ఈ క్రమంలో సీఎం పదవికి రాజీనామా చేయబోనని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమత బెనర్జీ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాలను మరింత వేడెక్కించాయి. ఎన్నికల ఫలితాల అనంతరం పార్టీ పరిస్థితిపై సమీక్షించేందుకు, భవిష్యత్ వ్యూహంపై చర్చించేందుకు మమతా బెనర్జీ పార్టీ ఎమ్మెల్యేలతో కీలక సమావేశం నిర్వహించారు. పరాజయం తర్వాత పార్టీ శ్రేణుల్లో నెలకొన్న నిరుత్సాహాన్ని తొలగించడం, కార్యకర్తలకు ధైర్యం చెప్పడం ఈ సమావేశం ప్రధాన ఉద్దేశంగా భావిస్తున్నారు. అయితే ఈ సమావేశానికి పలువురు ఎమ్మెల్యేలు గైర్హాజరవడం రాజకీయ వర్గాల్లో కొత్త చర్చకు దారితీసింది. సమాచారం ప్రకారం తృణమూల్ కాంగ్రెస్ నుంచి మొత్తం 80 మంది ఎమ్మెల్యేలు విజయం సాధించగా, సమావేశానికి కేవలం 70 మంది మాత్రమే హాజరైనట్లు తెలుస్తోంది. దాదాపు తొమ్మిది నుంచి పది మంది ఎమ్మెల్యేలు సమావేశానికి రాకపోవడం పార్టీలో అసంతృప్తి సంకేతమా అనే అనుమానాలకు తావిచ్చింది. ఎన్నికల పరాజయం తర్వాత పార్టీలో అంతర్గత విభేదాలు బయటపడుతున్నాయా అనే చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది. ముఖ్యంగా మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలు మరింత చర్చనీయాంశమయ్యాయి. ఎన్నికల్లో ఓటమి ఎదురైనా తాను సీఎం పదవికి రాజీనామా చేసే ప్రసక్తే లేదని ఆమె స్పష్టం చేసినట్లు సమాచారం. ఈ వ్యాఖ్యలతో పార్టీ భవిష్యత్ నాయకత్వంపై కూడా చర్చ మొదలైంది. ప్రతిపక్షాలు అయితే ఈ పరిణామాలను టీఎంసీలో పెరుగుతున్న అసంతృప్తికి సంకేతంగా అభివర్ణిస్తున్నాయి. అయితే టీఎంసీ నాయకత్వం మాత్రం ఈ ఊహాగానాలను ఖండించింది. సమావేశానికి హాజరుకాలేని ఎమ్మెల్యేలు ముందుగానే సమాచారం ఇచ్చారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. వ్యక్తిగత, ప్రాంతీయ కార్యక్రమాల కారణంగానే కొందరు హాజరుకాలేదని పేర్కొన్నాయి. దీనిని పార్టీ అంతర్గత విభేదాలుగా చిత్రీకరించడం సరైంది కాదని టీఎంసీ స్పష్టం చేసింది. ఎన్నికల పరాజయం తర్వాత పార్టీని తిరిగి బలోపేతం చేయడంపై మమతా బెనర్జీ దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. పార్టీ శ్రేణుల్లో ధైర్యం నింపడం, ప్రజల్లో మళ్లీ విశ్వాసం పెంచడం, బీజేపీ ప్రభుత్వంపై పోరాటాన్ని మరింత ఉధృతం చేయడం వంటి అంశాలపై సమావేశంలో చర్చ జరిగినట్లు సమాచారం. రాష్ట్రంలో అధికారాన్ని కోల్పోవడం టీఎంసీకి పెద్ద ఎదురుదెబ్బగా భావిస్తున్నారు. దీర్ఘకాలంగా బెంగాల్ రాజకీయాల్లో ఆధిపత్యం చెలాయించిన పార్టీ ఇప్పుడు ప్రతిపక్ష పాత్రలోకి వెళ్లాల్సిన పరిస్థితి రావడంతో నాయకత్వంపై ఒత్తిడి పెరిగినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేల గైర్హాజరు రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. ఇక ప్రతిపక్ష పార్టీలు మాత్రం టీఎంసీలో చీలికలు ప్రారంభమయ్యాయని ఆరోపిస్తున్నాయి. ఎన్నికల ఫలితాల తర్వాత పార్టీ నేతల్లో అసంతృప్తి పెరిగిందని, భవిష్యత్‌లో మరిన్ని రాజకీయ మార్పులు చోటుచేసుకునే అవకాశముందని వ్యాఖ్యానిస్తున్నాయి. అయితే టీఎంసీ మాత్రం పార్టీ ఏకతాటిపై ఉందని, మమతా బెనర్జీ నాయకత్వంలో మరింత బలంగా ముందుకు వెళ్తామని చెబుతోంది. మొత్తంగా చూస్తే పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల అనంతర రాజకీయాలు రోజురోజుకూ ఆసక్తికరంగా మారుతున్నాయి. మమతా బెనర్జీ వ్యాఖ్యలు, ఎమ్మెల్యేల గైర్హాజరు, పార్టీ అంతర్గత చర్చలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీసే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాబోయే రోజుల్లో టీఎంసీ తీసుకునే నిర్ణయాలు బెంగాల్ రాజకీయాల దిశను ప్రభావితం చేసే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## రైతులకు ఎంతో మేలు చేశాం

హైదరాబాద్ వెలుతురు మే 07:

రాష్ట్రంలో రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో పూర్తి చేయలేని పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లలోనే అమలు చేసి చూపించిందని పేర్కొన్నారు. రైతుల కోసం తీసుకున్న నిర్ణయాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపునిస్తున్నాయని తెలిపారు. హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి రైతు మేళాలో మంత్రి తుమ్మల ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడిన ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు సంక్షేమానికి అత్యున్నత ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల చొప్పున రుణమాఫీ చేశామని మంత్రి వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే ఈ ప్రక్రియను పూర్తి చేయడం రైతుల పట్ల తమ నిబద్ధతకు నిదర్శనమన్నారు. రైతుల ఖాతాల్లో ఇప్పటికే రూ.21 వేల కోట్లను నేరుగా జమ చేశామని తెలిపారు. రైతులపై అప్పుల భారం తగ్గించేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వంపై మంత్రి తీవ్ర విమర్శలు చేశారు. గత ప్రభుత్వం రూ.లక్ష రుణమాఫీ చేస్తామని ప్రకటించినప్పటికీ పదేళ్ల పాలనలో పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. రుణమాఫీ ప్రక్రియను ఐదేళ్లపాటు సాగదీయడంతో రైతులకు పెద్దగా ప్రయోజనం కలగలేదని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన మొత్తం వడ్డీలకు కూడా సరిపోని పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతుబంధు పథకం పేరుతో కేవలం ఒకే పథకాన్ని ప్రచారం చేసుకుని మిగతా రైతు సంక్షేమ కార్యక్రమాలను నిర్లక్ష్యం చేశారని తుమ్మల ఆరోపించారు. సాగునీరు, పంటల మద్దతు ధరలు, వ్యవసాయ మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అంశాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆశించిన స్థాయిలో పని చేయలేదన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో గత ప్రభుత్వం విఫలమైందని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నాయకత్వం ప్రదర్శించిన అహంకార వైఖరిని ప్రజలు ఇప్పటికీ మర్చిపోలేదని మంత్రి అన్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని విమర్శించారు. అందుకే గత ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారని పేర్కొన్నారు. మళ్లీ బీఆర్ఎస్‌కు అధికారం అప్పగించేందుకు రైతులు సిద్ధంగా లేరని తుమ్మల స్పష్టం చేశారు. ప్రస్తుతం తెలంగాణ రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతోందని మంత్రి పేర్కొన్నారు. రైతుల అప్పుల భారం తగ్గిన రాష్ట్రాల్లో తెలంగాణ ముందంజలో ఉందన్నారు. రైతులకు తక్కువ వడ్డీ రుణాలు, ఉచిత విద్యుత్, సాగునీటి ప్రాజెక్టులు, మార్కెటింగ్ సదుపాయాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. రైతు మేళాల ద్వారా ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నామని తుమ్మల వెల్లడించారు. కొత్త సాంకేతికత, నాణ్యమైన విత్తనాలు, పంటల వైవిధ్యీకరణపై రైతులకు సూచనలు అందిస్తున్నామన్నారు. రైతు ఆదాయం పెంచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. వ్యవసాయ రంగం బలోపేతం అయితేనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుందని మంత్రి అన్నారు. రైతు కుటుంబాలు ఆర్థికంగా ఎదిగితే గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, ప్రతి రైతు కుటుంబానికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రైతులకు సంబంధించిన పలు స్టాళ్లు, వ్యవసాయ సాంకేతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# డ్రగ్స్ నియంత్రణే మా లక్ష్యం

- **తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్**
- **డ్రగ్స్ మహమ్మారి కుటుంబాలను నాశనం చేస్తోందన్న డీజీపీ**
- **మాదకద్రవ్యాల నిర్మూలనకు ఈగల్ ఫోర్స్ కృషి**
- **ఇతర రాష్ట్రాలు, దేశాల్లోనూ ఆపరేషన్లు నిర్వహణ**
- **డ్రగ్స్ సరఫరా లింకుల ఛేదనలో కీలక విజయాలు**
- **సిబ్బంది కొరత మధ్యనూ మెరుగైన పనితీరు**
- **నార్కోటిక్స్ విభాగాన్ని అభినందించిన డీజీపీ**
- **జిల్లాల పోలీసు యంత్రాంగం మరింత అప్రమత్తం కావాలి**
- **డ్రగ్స్ కట్టడిపై సమన్వయంతో చర్యల సూచన**
- **కాలేజీ యాజమాన్యాల బాధ్యత పెరగాలన్న వ్యాఖ్య**
- **యువతను మాదకద్రవ్యాల బారినుంచి కాపాడాలన్న పిలుపు**

హైదరాబాద్ వెలుతురు మే 07:



రాష్ట్రంలో డ్రగ్స్ నియంత్రణను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య అంశంగా తీసుకుందని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలన కోసం పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారిస్తోందని, ఈ దిశగా ఈగల్ ఫోర్స్, నార్కోటిక్స్ విభాగం సమర్థంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. "డ్రగ్స్ మహమ్మారి వల్ల ఎన్నో కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయి. యువత భవిష్యత్తు ప్రమాదంలో పడుతోంది. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని డ్రగ్స్ నివారణకు ఈగల్ ఫోర్స్ విస్తృతంగా కృషి చేస్తోంది" అని డీజీపీ అన్నారు. మన ఈగల్ ఫోర్స్ రాష్ట్ర పరిమితులను దాటి ఇతర రాష్ట్రాలు, విదేశాల్లో కూడా ఆపరేషన్లు నిర్వహించిందని తెలిపారు. డ్రగ్స్ సరఫరా ముఠాలకు సంబంధించిన పలు కీలక లింకులను ఛేదించామని చెప్పారు. మాదకద్రవ్యాల రవాణా, పంపిణీ వ్యవస్థపై కట్టుదిట్టమైన నిఘా కొనసాగుతోందన్నారు. సిబ్బంది కొరత ఉన్నప్పటికీ నార్కోటిక్స్ విభాగం మంచి పనితీరు కనబరిచిందని డీజీపీ అభినందించారు. డ్రగ్స్ నియంత్రణ బాధ్యత కేవలం ప్రత్యేక విభాగాలకే పరిమితం కాకుండా జిల్లాల పోలీసు యంత్రాంగం కూడా మరింత అప్రమత్తంగా పని చేయాలని సూచించారు. కాలేజీలు, విద్యాసంస్థలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల్లో అవగాహన పెంచడం, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడం వంటి చర్యల్లో కాలేజీ యాజమాన్యాలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

## కాళ్లు, చేతులు లేకపోయినా చరిత్ర సృష్టించిన వారెందరో ఉన్నారు

**(మొదటి పేజీ తరువాయి)**
కోసం రూ.100 కోట్లకుపైగా వెచ్చించి ఉపకరణాలు అందించామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. దివ్యాంగుల అభ్యున్నతికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తోందన్నారు. గత యూపీఏ ప్రభుత్వంతో పోలిస్తే అత్యధిక నిధులు కేటాయిస్తోందన్నారు. గురువారం రోజున సిరిసిల్ల పట్టణంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్) ఆర్థిక సహకారంతో ఈరోజు సరిసిల్ల పట్టణంలో 466 మంది దివ్యాంగులకు రూ.84 లక్షల విలువైన 813 ఉపకరణాలను కేంద్ర మంత్రి బండి సంజయ్ అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్ర మంత్రితోపాటు జిల్లా కలెక్టర్ గరీమా అగర్వాల్, ఐవోసీఎల్ సీజీఎం వినీత్ కౌర్, జడ్పీ సీఈవో, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ డీఆర్డీవో పద్మయ్య, అలీం కో టీం ప్రతినిధి చందన్, దివ్యాంగుల యూనియన్ నాయకుడు రాజేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ ఏమన్నారంటే...ADIP (Assistance to Disabled Persons), ALIMCO పథకాల కింద సిరిసిల్ల జిల్లాలో ఈరోజు 84 లక్షల కేంద్ర నిధులతో 466 మంది దివ్యాంగులకు 813 పరికరాలను కొనుగోలు చేసి దివ్యాంగులకు అందజేయడం సంతోషంగా ఉంది. గతంలో కరీంనగర్ లో, వేములవాడలో కూడా ప్రత్యేక శిబిరాలు నిర్వహించి పెద్ద ఎత్తున పరికరాలను పంపిణీ చేసిన విషయం మీ అందరికీ తెలిసిందే. త్వరలోనే దివ్యాంగులందరికీ ఉపకరణాలు అందిస్తాం.

ఇవి మాత్రమే కాకుండా మహిళలు, పిల్లలు, వృద్ధుల కోసం కేంద్రం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోంది పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తోంది. అంగన్ వాడీ కేంద్రాల్లో బాలామృతం, గుడ్డు సహా పిల్లలకు అందించే పోషకాహారం కేంద్ర నిధులతో అందిస్తున్నారు. గర్భిణీ మహిళలకు పౌష్టికాహారం, గుడ్లు, పాలుసహా అన్నింటికీ కేంద్రమే నిధులిస్తూ గర్భిణీ మహిళలు, పిల్లలు పౌష్టికాహార లోపంతో బాధపడకుండా ఆరోగ్యవంతంగా జీవనం కొనసాగేలా చేస్తోంది. వృద్ధులకు, దివ్యాంగ ఆశ్రమాలకు కేంద్రం పెద్ద ఎత్తున నిధులను విడుదల చేస్తూ వారి జీవనానికి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటోంది. నా పార్లమెంట్ పరిధిలో ఇప్పటి వరకు గర్భిణీ మహిళలు, పిల్లలు, వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమం కోసం దాదాపు 100 కోట్లను



కేంద్రం ఖర్చు చేసింది. కేంద్రం చేస్తున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రతి ఒక్కరినీ కోరుతున్నా.. అన్ని అవయవాలున్న వాళ్లే అనేక ఇబ్బందులు పడుతున్నారు... ఇక దివ్యాంగుల పరిస్థితి చెప్పనక్కర్లేదు. అందుకే వారు ఇబ్బందులను అధిగమించేలా చేసేందుకు మోదీ ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోంది. అందులో భాగంగా 466 మంది దివ్యాంగులకు 813 పరికరాలను ఈరోజు ఉపకరణాలు అందిస్తున్నాం. రానివాళ్లు బాధపడాల్సిన పనిలేదు. ఎంతమంది దరఖాస్తు చేసుకుంటే అంతమందికి అతి త్వరలో ఉప కరణాలు అందిస్తాం.

గత 12 ఏళ్లుగా దివ్యాంగుల సంక్షేమానికి మోదీ ప్రభుత్వం ADIP, ALIMCO, Accessible India, కేంద్ర సామాజిక సాధికారత శాఖ ద్వారా వేలాది కోట్లను దివ్యాంగుల కోసం ఖర్చు చేస్తోంది. ఈ ఒక్క ఏడాదే రూ.1600 కోట్లు కేటాయించింది. గత యూపీఏ ప్రభుత్వంతో పోలిస్తే 3 రెట్ల బడ్జెట్ ను అధికంగా కేటాయిస్తున్నారు. దివ్యాంగులకు ఉపకరణాలను అందజేయడంతోపాటు విద్య, ఉపాధి, డిజిటల్ ఐడీ, యాక్సెసిబుల్ మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. వారి హక్కులను కాపాడటంలో ముందున్నాం. దివ్యాంగ సోదరులకు నేను చెప్పేదొక్కటే... మనిషి శరీరంతో కాదు...

మనసుతో గెలుస్తాడు. చేతులు లేకపోయినా చరిత్ర సృష్టించిన వారెందరో ఉన్నారు...

కాళ్లు పనిచేయకపోయినా ప్రపంచాన్ని జయించినవారు ఉన్నారు. కళ్లలో వెలుగు లేకపోయినా కోట్ల మందికి దారి చూపినవారు ఉన్నారు.

అవయవ లోపం అనేది బలహీనత కాదు. అది జీవితాన్ని మరో కోణంలో గెలిచే శక్తిగా భావించండి. సమాజం కొన్నిసార్లు మిమ్మల్ని "పరిమితులు ఉన్నవారు"గా చూడొచ్చు. కానీ "మీ పరిమితిని నిర్ణయించేది మీ శరీరం కాదు... మీ ఆత్మవిశ్వాసం."

జీవితంలో మీకు ఎన్నో ఇబ్బందులు ఎదురైనా ఇంతవరకు వచ్చారు అంటే... మీరు సాధారణ మనుషులు కాదు. ప్రతి ఉదయం మీరు చేసే పోరాటం. చాలామందికి జీవిత పాఠం. మీ చిరునవ్వు వెనుక బాధ ఉండొచ్చు. కానీ ఆ బాధను జయించే ధైర్యం కూడా మీలోనే ఉంది. మీరు ఉద్యోగాలు చేయగలరు. వ్యాపారాలు నిర్మించగలరు... కళల్లో, క్రీడల్లో, విద్యలో, టెక్నాలజీలో అద్భుతాలు చేయగలరు.

గుర్తుంచుకోండి... ఓటమి శరీరంలో కాదు... మనసులో మొదలవుతుంది. మీరు మీపై నమ్మకం పెంచుకున్న రోజునుంచి జీవితం మారిపోతుంది. కాబట్టి ఒక్కటి గుర్తుంచుకోండి "మీరు ఎవరికీ తక్కువ కాదు. మీ జీవితానికి మీరే హీరో. మీ అడుగులు నెమ్మదిగా ఉండొచ్చు. కానీ మీ గమ్యం గొప్పది కావాలి. మీరు నిలబడితే ఇంకో దివ్యాంగుడికి ధైర్యం వస్తుంది. "అవయవ లోపం విజయానికి అడ్డంకి కానే కాదు... ఆత్మవిశ్వాసం ఉంటే అసాధ్యాన్ని కూడా సుసాధ్యం చేయవచ్చని నిరూపించిన వీరులు వీరంతా... వారి స్ఫూర్తితో ముందుకు సాగండి. దేవుడు మీ జీవితంలో ఒక తలుపు మూసివేసి ఉండొచ్చు... కానీ మీలో అసాధారణమైన శక్తి అనే మరో తలుపు తప్పకుండా తెరిచాడు. ఆ శక్తిని నమ్మండి. ముందుకు సాగండి. ప్రపంచం మీ విజయాన్ని చూసే గర్వించే రోజులు ఎంతో దూరంలో లేవు.

## మహిళా సంఘాలకు ప్రభుత్వం గుడ్ న్యూస్

హైదరాబాద్ వెలుతురు మే 07:

మహిళా స్వయం సహాయక బృందాల (ఎస్‌హెచ్‌జీ) సాధికారత కోసం తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మహిళా సంఘాలకు అందిస్తున్న వడ్డీలేని రుణాల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ప్రకటించారు. మహిళా సంఘాలు తీసుకునే రూ.10 లక్షల వరకు బ్యాంకు రుణాలపై వడ్డీ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. మహిళా స్వయం సహాయక బృందాలకు సంబంధించిన బ్యాంకు వార్షిక రుణ ప్రణాళికను గురువారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ దాన కిషోర్, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్, బ్యాంకర్లు, స్త్రీ నిధి డిప్యూటీ ఎండీ శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2025 26 ఆర్థిక సంవత్సరంలో మహిళా స్వయం సహాయక బృందాల సభ్యులకు రూ.25,228.89 కోట్ల బ్యాంకు రుణాలు అందించినట్లు తెలిపారు. మహిళా సంఘాల రుణాలపై వడ్డీ చెల్లింపుల కోసం ప్రభుత్వం రూ.2,500 కోట్లు వ్యయం చేయనున్నట్లు వెల్లడించారు. 'మహిళా ఉన్నతితెలంగాణ ప్రగతి' అనే నినాదంతో ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. మహిళలు పేదరికం నుంచి బయటపడినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. మహిళా సంఘాల ఆర్థిక స్వావలంబనకు బ్యాంకుల సహకారం కీలకమని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ మహిళలకు ఉపాధి, వ్యాపార అవకాశాలు పెంచే దిశగా ప్రభుత్వం మరిన్ని ప్రోత్సాహక కార్యక్రమాలు చేపడుతోందన్నారు.



## భూసేకరణలో వివక్ష.. గిరిజనుల భూములే టార్గెట్..!

హైదరాబాద్, మే 7 (వెలుతురు): భూసేకరణలో వివక్ష కొనసాగుతోందని, పెద్ద భూస్వాముల భూములను వదిలేసి గిరిజనుల భూములను మాత్రం సేకరిస్తున్నారని టీ ఆర్ ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. ఆరోపించారు. కురిమెట్లలో గిరిజనుల 350 ఎకరాలు తీసుకున్నారని, ఆ గిరిజనుల పోరాటానికి తెలంగాణ రక్షణ సేన పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు, ఉద్యమకారులకు నష్టం జరిగిందని అంగీకరిస్తూ, ఆ ప్రభుత్వంలో తాను భాగస్వామిగా ఉన్నందుకు క్షమాపణ చెబుతున్నట్లు కవిత పేర్కొన్నారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన "ఫార్మా సిటీలో ఏం జరుగుతోంది" రౌండ్ టేబుల్ సమావేశంలో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధినేత కల్వకుంట్ల కవిత పాల్గొని ఆందోళనకారులకు మద్దతు ప్రకటించారు. ఫార్మా సిటీ పేరుతో రైతుల భూములను బలవంతంగా సేకరించడం సరికాదని, ఆ భూములను రైతులకు తిరిగి ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. ఫార్మాసిటీ రైతులకు న్యాయం జరిగే వరకు తెలంగాణ రక్షణ సేన ముందుండి పోరాటం చేస్తుందని కవిత స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వాలు ప్రజలకు నిజాలు



చెప్పే పరిస్థితిలో లేవని విమర్శించారు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో రైతులు పండించే పంటలను భవిష్యత్తులో కొనుగోలు చేసే పరిస్థితి లేదని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారని, అయితే దీనిపై ప్రభుత్వం ప్రజలకు స్పష్టత ఇవ్వలేదని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడుతుండగా, కొందరు రైతులు ధాన్యం కుప్పలపైనే ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పంట కొనుగోళ్లపై ప్రభుత్వం ముగ్గురు మంత్రులతో కమిటీ వేసిందని, అది ఈ ఏడాది మాత్రమే కొనుగోళ్లు కొనసాగించాలని సూచించిందని తెలిపారు. అంటే భవిష్యత్తులో కొనుగోళ్లపై ప్రభుత్వం వెనక్కి తగ్గే సంకేతాలు ఇస్తోందని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశంలో కూడా ప్రభుత్వం ముందుగా జీవోలు ఇచ్చి, తర్వాత ప్రజలకు తెలియజేస్తోందని విమర్శించారు. ప్రస్తుతం రాజకీయాల్లో ఎవరు ఏ వైఖరిలో ఉన్నారో అర్థం కాని పరిస్థితి ఉందని, కానీ ప్రజా సమస్యలపై అందరూ ఒకే వేదికపైకి వస్తున్నారని చెప్పారు. వెలుగుమట్ల ఘటనలో బాధితులకు న్యాయం జరిగే వరకు తాము అక్కడే కూర్చొని పోరాటం చేశామని, ఆ తర్వాతే ముగ్గురు మంత్రులు వచ్చి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. "మంచి మాటకు వినే ప్రభుత్వాలు లేవు. జిద్దుగా పోరాడితేనే స్పందిస్తున్నాయి" అని వ్యాఖ్యానించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫార్మా సిటీ కోసం 13,500 ఎకరాలు సేకరించామని చెప్పిందని, అందులో భారీగా అసైన్డ్ భూములు ఉన్నాయని తెలిపారు. రైతులు తమ పట్టా భూములు ఇవ్వమని చెప్పినా బలవంతపు భూసేకరణకు ప్రయత్నించారని ఆరోపించారు. కోర్టు స్టే ఉన్నప్పటికీ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేశారని అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే విధంగా వ్యవహరిస్తోందని కవిత విమర్శించారు. ఫార్మాసిటీ పేరును మార్చి ఇప్పుడు "ఫ్యూచర్ సిటీ" పేరుతో 30 వేల ఎకరాలు సేకరించాలని చూస్తోందని ఆరోపించారు. కానీ ఆ భూములతో ఏం చేస్తారు, ఎంత కాలుష్యం వస్తుంది, స్థానికులకు ఎన్ని ఉద్యోగాలు ఇస్తారు అన్న విషయాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదని అన్నారు. ఫ్యూచర్ సిటీలో డేటా సెంటర్లు ఏర్పాటు చేస్తామని చెబుతున్నారని, వాటివల్ల భారీ శబ్ద కాలుష్యం, పర్యావరణ నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. రైతుల భూములు తీసుకుని వారికి కేవలం రూ.8 లక్షలు ఇస్తే వారి భవిష్యత్తు ఏమవుతుందని ప్రశ్నించారు. ఫ్యూచర్ సిటీలో బుల్లెట్ ట్రైన్ వస్తుందని ప్రభుత్వం చెబుతోందని, కానీ దేశంలో ఇప్పటివరకు ఎక్కడా బుల్లెట్ ట్రైన్ రాలేదని విమర్శించారు. "ప్రజలకు అబద్ధాలు చెప్పే ప్రభుత్వాలను ఎదుర్కొనేందుకు పోరాటమే శరణ్యం" అని పేర్కొంటూ, రైతులకు న్యాయం జరిగే వరకు తాము ముందుండి పోరాటం కొనసాగిస్తామని కవిత స్పష్టం చేశారు.



# తెలంగాణ ప్రజా మెట్రో రైలు..

తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పాలనలో ఏ నిర్ణయం తీసుకున్న సంచలనమే. ఇప్పటివరకు ప్రైవేటు సంస్థ ఎల్ అండ్ టి ఆధీనంలో ఉన్న హైదరాబాద్ మెట్రో రైలు తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా స్వాధీనం చేసుకోవడం ఒక చరిత్ర.

భాగ్యనగర వాసుల చిరకాల స్వప్నం ప్రభుత్వ సంకల్పం వందశాతం ప్రభుత్వపరంగా మారింది. ముఖ్యమంత్రి దార్శనికతతో ప్రజా మెట్రో గా అవతరించిందని చెప్పక తప్పదు. భవిష్యత్తు మెట్రో రెండో దశ విస్తరణ వేగం పెరిగి టికెట్ల ధరలపై నియంత్రణ, మెరుగైన సేవలతో పాటు పట్టణ రవాణా వ్యవస్థను బలోపేతం చేయడం ప్రయాణికులను ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కోకుండా మెట్రో విస్తరించాలనే సంకల్పంతో వడివడిగా ముందుకు సాగుతుంది.

నిన్నటి వరకు ప్రైవేట్ భాగస్వామ్యంతో నడిచిన మెట్రో నేడు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం తన చేతుల్లోకి తీసుకుంది. సుమారు 14.61 కోట్ల షేర్లను కొనుగోలు చేసి ఎల్ అండ్ టి ఆధిపత్యానికి ముగింపు పలికింది. 13.583 వేలకోట్ల భారీ రుణ భారాన్ని సైతం ప్రభుత్వమే భరిస్తుంది. సంస్థను లాభాల బాటలోకి మళ్లించేందుకు సిద్ధమయ్యింది. ఇది కొనుగోలు కాదు అభివృద్ధికి పచ్చ జెండా. మెట్రో రెండోదశ విస్తరణలో ఉన్న అడ్డంకులు తొలగించి 162.5 కిలోమీటర్ల మేర మెట్రోను పట్టా లెక్కించేందుకు ప్రజా ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. కేంద్రం షరతులను అధిగమించి ప్రజల ప్రయోజనాలే పరమావధిగా భావించి ఈ చారిత్రక నిర్ణయం తీసుకుంది. ఎయిర్ పోర్టు నుండి పాతబస్తీ వరకు నగరం నలుమూల మెట్రో విస్తరణ చేయడాన్ని కాంగ్రెస్ భుజాన వేసుకుందని చెప్పాలి. మాట ఇస్తే తప్పని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రేపటి హైదరాబాదును గ్లోబల్ పట్టణంగా సగౌరవంగా తలెత్తుకునే విధంగా చేయడానికి చేస్తున్న కృషిలో భాగమే ఇది. ఇది మన ముఖ్యమంత్రి మార్క్ కాదు మార్పు.

**మెట్రో చరిత్రను ఒకసారి తెలుసుకుందాం.**

హైదరాబాదు మెట్రో రైలు ప్రాజెక్టు నగరంలో ప్రయాణం వేగవంతం, సౌకర్యవంతం చేసే రైలు సేవలనందిస్తోంది. మెట్రోరైల్ మొదటి దశ 2017 నవంబరులో నాగోల్ అమీర్‌పేట్ మియాపూర్ మార్గంతో ప్రారంభించబడింది. తరువాత, ఎల్ బి నగర్ అమీర్‌పేట్ మార్గాన్ని 2018 అక్టోబరులో ప్రారంభించారు. అమీర్ పేట హైటెక్ సిటీ మార్గాన్ని 2019 మార్చిన ప్రారంభించారు. మెట్రోరైలు లైన్ల సంఖ్య 3 (ఫేస్ I)
స్టేషన్ల సంఖ్య 66 (ఫేస్ I).
జేబీఎస్ ఎంజీబీఎస్ మార్గం 2020 ఫిబ్రవరి 7 నుండి అందుబాటులోకి వచ్చింది. ఈ మార్గం ప్రారంభంతో మెట్రో మొదటి దశలో 72 కి.మీ. లకు గాను 69 కి.మీ. మార్గం అందుబాటులోకి వచ్చినట్లయింది. హైదరాబాద్ మెట్రో దేశంలో రెండవ పెద్ద మెట్రోగా గుర్తింపుపొందింది. మెట్రో రైలు ప్రారంభించిన తొలిరోజే 2 లక్షల మంది ప్రయాణించారు. 2022 నవంబరు 29 నాటికి ఐదేండ్ల కాలంలో మెట్రోలో 31 కోట్ల మంది ప్రయాణించగా, మెట్రోలో ప్రతి రోజు 4.40 లక్షల మంది ప్రయాణం చేస్తున్నారు.
హైదరాబాద్ మెట్రో రైల్ ఇప్పుడు మియాపూర్ నుంచి ఎల్.బి.నగర్ మీదుగా అమీర్ పేట, ఎంజీబీఎస్ మీదుగా రెడ్ లైన్ తన సర్వీసులను నిర్వహిస్తోంది. అలాగే నాగోల్ నుంచి రాయదుర్గ్ మీదుగా సికింద్రాబాద్, అమీర్ పేట్ మీదుగా బ్లూ లైన్ అమీర్ పేట రెడ్ లైన్, బ్లూ లైన్ కు ఇంటర్ చేంజ్ స్టేషన్, జేబీఎస్ఎం నుండి జేబీఎస్ మార్గం గ్రీన్ లైన్ కు తన సర్వీసులను నిర్వహిస్తోంది.
హైదరాబాద్ మెట్రో రైలు అన్ని టెర్మినల్ స్టేషన్ల నుండి వారపు రోజులు, వారాంతాల్లో 06:30 గంటల నుండి 22:00 గంటల వరకు నడుస్తుంది. ఇవి తాత్కాలిక సమయాలు కార్యాచరణ అవసరాలకు అనుగుణంగా మార్చబడతాయి. ప్రధాని నరేంద్ర మోదీ 2017లో హైదరాబాద్ మెట్రోలో ప్రయాణించారు. మెట్రో ప్రారంభమైన నాటి నుండి నేటి వరకు సుమారు 86 కోట్ల మంది ప్రయాణించారని లెక్కలు.

**మెట్రో విస్తరణ కోసం సర్కారు ప్రయత్నం**

హైదరాబాద్ మెట్రో ఫేజ్ IIకు ఆమోదం తెలపాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, కేంద్ర పట్టణ వ్యవహారాలశాఖా మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ కి విజ్ఞప్తి చేశారు. ఏడు కారిడార్లతో కూడిన మెట్రో ఫేజ్ II సమగ్ర ప్రణాళికను రూపొందించి డీపీఆర్‌ను ఇప్పటికే సమర్పించామని తెలిపారు. ముఖ్యమంత్రి ఢిల్లీలో కేంద్ర మంత్రి ఖట్టర్ తో ఇటీవల సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మెట్రో ఫేజ్ II, మెట్రో ఫేజ్ III పై చర్చించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో ప్రయాణికుల సౌకర్యార్థం మెట్రోను మరింతగా విస్తరించాల్సిన అవసరం ఉందని చెప్పారు.
హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్ II, ఫేజ్ III విస్తరణ సజావుగా సాగాలనే ఉద్దేశ్యంతోనే మెట్రో ఫేజ్Iను L&T MRHL ను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని వివరించారు. ప్రస్తుతం ఫేజ్ I ప్రభుత్వం పరిధిలో ఉండడంతో ఫేజ్II, ఫేజ్III విస్తరణ సులభమవుతుందని చెప్పారు. మెట్రో రైలు నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫేజ్ IIలో ఏడు కారిడార్లతో మొత్తం 122.9 కిలోమీటర్ల మేర విస్తరణకు, ₹ 38,595 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన సమగ్ర డీపీఆర్‌ను ఇప్పటికే సమర్పించిన విషయాన్ని గుర్తుచేశారు.
హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్ II ప్రాజెక్ట్‌ను భారత ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా చేపట్టేందుకు త్వరగా ఆమోదం తెలపాలని కేంద్ర మంత్రి గారిని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగర భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఆర్జీఐ ఎయిర్‌పోర్ట్ భారత్ ఫ్యూచర్ సిటీ కారిడార్‌ను మెట్రో ఫేజ్ III గా చేపట్టాలని కోరారు. మెట్రో ఫేజ్ III కి సంబంధించిన డీపీఆర్‌ను కూడా ఇప్పటికే సమర్పించామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ అనుమతులు వస్తే తొందరలోనే పనులు ప్రారంభించడానికి ప్రభుత్వం సిద్ధంగా వుంది.



ముచ్చర్ల దినకర్ రచయిత
9440704535

## నిజాయితీ, సేవాభావంతో పనిచేయండి





- **భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలవాలని**
- **ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపు**

హైదరాబాద్ వెలుతురు మే 07:

ఎంతో మంది మధ్య పోటీపడి, నిబద్ధతతో కష్టపడి సాధించిన గ్రూప్1 డిప్యూటీ కలెక్టర్ల ఉద్యోగాన్ని ప్రజాసేవకు అంకితం చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, పౌర సంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లకు సూచించారు.
వ్యక్తిగతంగానే కాకుండా ప్రభుత్వానికి కూడా మంచి పేరు తీసుకురావాలని, ముఖ్యంగా సమాజంలోని "పూరెస్ట్ ఆఫ్ ది పూర్" కు మేలు జరిగేలా నిర్ణయాలు తీసుకుంటూ ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలవాలని ఉద్బోధించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన 44 మంది గ్రూప్1 ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లు గురువారం మంత్రిగారిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ... అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ, ప్రజల సమస్యలకు వెంటనే స్పందించాల్సిన కీలక బాధ్యత రెవెన్యూ శాఖ అధికారులపై ఉంటుందని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లను ఛాలెంజ్‌గా స్వీకరించి ముందుకు సాగితే కలిగే సంతృప్తి అమూల్యమని అన్నారు.
ఆదర్శవంతమైన సేవలతో భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలవాలని యువ అధికారులకు మంత్రి పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో శాసన మండలి ఛైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ నగర రూపురేఖలు మార్చే దిశగా భారీ అడుగు





- **'అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (UCF)' కింద సమగ్ర అభివృద్ధి ప్రతిపాదనలకు ఆమోదం**
- **రూ: 1,150 కోట్ల అభివృద్ధి ప్రణాళికలతో కరీంనగర్‌ను రాష్ట్రంలోనే మోడల్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం**
- **మేయర్ కొలగాని శ్రీనివాస్**

కరీంనగర్ వెలుతురు మే 07:

కరీంనగర్ నగరాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అత్యాధునిక నగరంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (Urban Challenge Fund UCF) కింద రూ.1,150 కోట్ల విలువైన సమగ్ర అభివృద్ధి ప్రతిపాదనలను సిద్ధం చేసినట్లు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు.
ఈ ప్రతిపాదనలపై చర్చించి ప్రభుత్వానికి పంపించేందుకు నగరపాలక సంస్థ కార్యాలయంలో అత్యవసర సర్వసభ్య సమావేశం నిర్వహించగా, సభలో సభ్యులందరూ ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించినట్లు పేర్కొన్నారు.

**ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ...**

"కరీంనగర్ నగరం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో భవిష్యత్ తరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించడం అత్యవసరం. ట్రాఫిక్ సమస్యలు, డ్రైనేజీ, తాగునీరు, రోడ్లు, సుందరీకరణ, స్మార్ట్ సిటీ తరహా అభివృద్ధి వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రతిపాదనలు రూపొందించాం. కరీంనగర్‌ను తెలంగాణలోనే ఆదర్శ నగరంగా నిలపడం మా లక్ష్యం" అని తెలిపారు.

**ప్రధాన ప్రతిపాదనలు ఇవే...**

- నగరంలోని ప్రధాన రహదారుల విస్తరణ మరియు ఆధునీకరణ
- ఆధునిక డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం
- ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి జంక్షన్ అభివృద్ధి పనులు
- అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ మరియు స్టార్మ్ వాటర్ లైన్లు
- స్మార్ట్ వీధి దీపాలు, గ్రీన్ కారిడార్లు
- చెరువుల అభివృద్ధి, నగర సుందరీకరణ
- పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు, ప్రజా వినియోగ వసతులు
- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సమగ్ర పట్టణ ప్రణాళిక

**ప్రజల సహకారంతోనే అభివృద్ధి సాధ్యం**

పార్టీలకతీతంగా నగర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ప్రతిపాదనలకు మద్దతు తెలిపిన కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు మరియు అధికారులకు మేయర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పారదర్శకంగా అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు.

**కేంద్ర ప్రభుత్వ పథకాలను పూర్తిస్థాయిలో వినియోగిస్తాం**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా పట్టణాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత లభిస్తోందని..కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో ఆ అవకాశాలను కరీంనగర్‌కు తీసుకురావడమే తమ లక్ష్యమని మేయర్ పేర్కొన్నారు. నగరానికి అవసరమైన ప్రతి రూపాయి నిధిని సాధించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. త్వరలోనే ప్రభుత్వ అనుమతులు ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించి, అనుమతులు పొందిన వెంటనే యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని మేయర్ స్పష్టం చేశారు.
ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, ఇంజనీరింగ్ మరియు టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

# భారత్, బంగ్లాదేశ్ కీలక సమస్య పరిష్కారం

- **పశ్చిమ బెంగాల్‌లో రాజకీయ మార్పులతో కొత్త సమీకరణాలు**
- **తీస్తా నీటి ఒప్పందంపై మళ్లీ చర్చల అవకాశం**
- **బంగ్లాదేశ్ వర్గాల్లో సానుకూల ఆశలు వ్యక్తం**
- **బీఎన్‌పీ నుంచి మమతా బెనర్జీపై విమర్శలు**
- **బీజేపీకి బంగ్లాదేశ్ ప్రతిపక్షం అభినందనలు**
- **భారత్–బంగ్లాదేశ్ సంబంధాల బలోపేతంపై వ్యాఖ్యలు**
- **తీస్తా నది వివాదం దీర్ఘకాల సమస్యగా కొనసాగుతోంది**
- **వ్యవసాయం, జీవనాధారాలపై నీటి కొరత ప్రభావం**
- **1996 ఒప్పందం ఉన్నా తీస్తా సమస్య అపరిష్కృతం**
- **కేంద్రం–రాష్ట్రం సమన్వయంతో పరిష్కార ఆశలు**

పశ్చిమ బెంగాల్ వెలుతురు మే 07:



పశ్చిమ బెంగాల్‌లో రాజకీయ మార్పుల నేపథ్యంలో భారత్-బంగ్లాదేశ్ మధ్య దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తీస్తా నది నీటి పంపిణీ ఒప్పందం మరోసారి చర్చల్లోకి వచ్చింది. తాజా పరిణామాలు ఈ సమస్య పరిష్కారానికి కొత్త ఆశలు కలిగిస్తున్నాయి.
పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో బీజేపీ అధికారాన్ని చేజిక్కించుకోవడం రాష్ట్ర రాజకీయ సమీకరణాలనే కాకుండా భారత్ -బంగ్లాదేశ్ సంబంధాల్లోనూ కొత్త చర్చలకు దారితీసింది. ముఖ్యంగా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తీస్తా నది నీటి పంపిణీ ఒప్పందంపై ఇప్పుడు మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. ఈ పరిణామం రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలకు కొత్తదిశ చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.
పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడటంతో, కేంద్రంతో సమన్వయం సులభమవుతుందని బంగ్లాదేశ్ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రంలో గత ప్రభుత్వాల వ్యతిరేకత కారణంగా నిలిచిపోయిన తీస్తా ఒప్పందం ఇప్పుడు ముందుకు కదిలే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ పరిణామాన్ని బంగ్లాదేశ్ రాజకీయ వర్గాలు కూడా సానుకూలంగా స్వాగతిస్తున్నాయి.
ఈ నేపథ్యంలో అధికార బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) స్పందిస్తూ, తీస్తా జలాల ఒప్పందాన్ని అడ్డుకుంటున్నందుకు గత ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై విమర్శలు గుప్పించింది. అదే సమయంలో బెంగాల్‌లో బీజేపీ విజయాన్ని అభినందిస్తూ, ఈ మార్పు భారత్-బంగ్లాదేశ్ సంబంధాలను బలోపేతం చేయడానికి సహాయపడుతుందని వ్యాఖ్యానించింది.
బీఎన్‌పీ సమాచార కార్యదర్శి అజీజుల్ బరీ హెలాల్ మాట్లాడుతూ, బీజేపీ పాలనలో తీస్తా సమస్యకు పరిష్కారం లభించే అవకాశాలు పెరిగాయని అభిప్రాయపడ్డారు. సువేందు అధికారి నాయకత్వంలో రాష్ట్రంలో కొత్త పాలనా దిశ కనిపిస్తుందని, ఇది రెండు దేశాల మధ్య సంబంధాలను మరింత సానుకూలంగా మార్చవచ్చని ఆయన పేర్కొన్నారు.
తీస్తా నది వివాదం భారత్-బంగ్లాదేశ్ మధ్య దీర్ఘకాల సమస్యగా కొనసాగుతోంది. ముఖ్యంగా నీటి పంపిణీపై స్పష్టమైన ఒప్పందం లేకపోవడం వల్ల బంగ్లాదేశ్‌లోని ఉత్తర ప్రాంతాల్లో వ్యవసాయం, జీవనోపాధులు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి. వర్షాకాలం, ఎండాకాలాల్లో నీటి లభ్యతలో భారీ తేడాలు ఉండటంతో సమస్య మరింత క్లిష్టమవుతోంది.
గతంలో 1996లో భారత్-బంగ్లాదేశ్ మధ్య గంగా జల ఒప్పందం కుదిరినప్పటికీ, తీస్తా నది విషయంలో మాత్రం స్పష్టమైన ఒప్పందం సాధ్యం కాలేదు. 2011లో ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ బంగ్లాదేశ్ పర్యటన సందర్భంగా తీస్తా నీటిలో బంగ్లాదేశ్‌కు 37.5 శాతం, భారత్‌కు 42.5 శాతం వాటా ఇవ్వాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. అయితే పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఆ ఒప్పందం అమలు కాలేదు.
ఇక 1983లోనే ఒక తాత్కాలిక నీటి పంపిణీ ఫార్ములా అమలులోకి వచ్చినప్పటికీ అది పూర్తి స్థాయిలో కార్యరూపం దాల్చలేదు. అప్పట్లో బంగ్లాదేశ్‌కు 36 శాతం, భారత్‌కు 39 శాతం వాటా కేటాయించగా, మిగిలిన 25 శాతం గురించి స్పష్టత ఇవ్వలేదు. ఈ అస్పష్టతే తర్వాతి వివాదాలకు కారణమైంది.
వాతావరణ మార్పుల ప్రభావం పెరగడంతో తీస్తా నదిలో నీటి లభ్యత మరింత తగ్గిందని బంగ్లాదేశ్ వాదిస్తోంది. దీనివల్ల వ్యవసాయ ఉత్పత్తి తగ్గిపోవడంతో పాటు గ్రామీణ జీవనాధారాలు దెబ్బతింటున్నాయని అక్కడి నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో న్యాయమైన నీటి పంపిణీ కోసం బంగ్లాదేశ్ నిరంతరం ఒత్తిడి తెస్తోంది.
2015లో ప్రధాని నరేంద్ర మోదీ బంగ్లాదేశ్ పర్యటన సమయంలో కూడా తీస్తా సమస్యపై పరిష్కారం దిశగా ముందడుగు పడుతుందని ఆశలు రేగాయి. అయితే రాష్ట్ర స్థాయి వ్యతిరేకత, రాజకీయ కారణాల వల్ల ఆ ప్రయత్నాలు కూడా ఫలించలేదు. దీంతో సమస్య ఇప్పటికీ పరిష్కారానికి నోచుకోలేదు.
ప్రస్తుతం పశ్చిమ బెంగాల్‌లో కొత్త రాజకీయ పరిస్థితులు నెలకొనడంతో తీస్తా ఒప్పందంపై మళ్లీ చర్చలు ప్రారంభమయ్యే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కేంద్రం-రాష్ట్రం మధ్య సమన్వయం కుదిరితే, దీర్ఘకాలంగా నిలిచిపోయిన ఈ దౌత్య సమస్యకు పరిష్కారం దొరకవచ్చని అంచనా.
మొత్తం మీద తీస్తా నీటి వివాదం ఇప్పుడు మళ్లీ అంతర్జాతీయ దృష్టిని ఆకర్షిస్తోంది. పశ్చిమ బెంగాల్ రాజకీయ మార్పులు, బంగ్లాదేశ్ ఆశలు, కేంద్రం దౌత్య ప్రయత్నాలు కలిపి ఈ సమస్యను కొత్తదశకు తీసుకెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## ఉత్తమ పర్యావరణ అవార్డులను ప్రకటించిన టీజీపీసీబీ




హైదరాబాద్, మే 7 (వెలుతురు):

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (TGPCB) 2026 సంవత్సరానికి రాష్ట్ర స్థాయి ఉత్తమ పర్యావరణ పనితీరు అవార్డులను ప్రకటించింది. పర్యావరణ పరిరక్షణ, స్థిరమైన అభివృద్ధి కోసం విశేష కృషి చేసిన సంస్థలు, స్వయం సహాయక సంఘాలు, విద్యాసంస్థలు, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలను ఈ అవార్డుల ద్వారా సత్కరించనున్నట్లు బోర్డు వెల్లడించింది. కాలుష్య నియంత్రణ చర్యలు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలన, ఘన మరియు ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణలో విశేష ఫలితాలు సాధించిన వారికి ఈ అవార్డులు ప్రదానం చేయనున్నట్లు తెలిపింది. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ సనత్‌నగర్‌లోని టీజీపీసీబీ ఆడిటోరియంలో అవార్డు ప్రదానోత్సవం నిర్వహించనున్నారు.
పర్యావరణాన్ని కాపాడడంలో పాఠశాలలు, కళాశాలలు, పట్టణ స్వయం సహాయక సంఘాలు, గ్రామీణ స్వయం సహాయక సంఘాలు, గ్రామ పంచాయతీలు, పరిశ్రమలు, ప్రైవేట్ ఆసుపత్రులు, ప్రభుత్వ ఆసుపత్రులు, మున్సిపాలిటీలు వంటి విభాగాల్లో అవార్డులు అందజేయనున్నారు. ప్రతి విభాగంలో మొదటి, రెండో, మూడో బహుమతులను ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. టీజీపీసీబీ నేరుగా పర్యవేక్షించని రంగాల్లో ఆయా శాఖల ద్వారా ఎంపిక ప్రక్రియ నిర్వహించబడుతుందని వెల్లడించారు. పర్యావరణ బాధ్యతను పెంపొందించడం, సహజ వనరుల సంరక్షణలో ఆదర్శంగా నిలిచే సంస్థలు, వ్యక్తులను ప్రోత్సహించడం ఈ అవార్డుల ముఖ్య ఉద్దేశమని టీజీపీసీబీ సభ్య కార్యదర్శి తెలిపారు.

## సువేందు అధికారి పీఏ హత్యపై.. బెంగాల్ లో సిట్ ఏర్పాటు..!

కొలకతా, మే 7 (వెలుతురు):



నూతన ప్రభుత్వం కొలువుదీరడానికి ముందు పశ్చిమ బెంగాల్‌లో హింసాత్మక ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. బీజేపీ సీనియర్ నేత సువేందు అధికారి వ్యక్తిగత సహాయకుడు చంద్రనాథ్ రథ్ బుధవారం రాత్రి దారుణ హత్యకు గురైన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కేసును అత్యంత ప్రాముఖ్యతతో తీసుకున్న పోలీసులు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేశారు. ఇన్‌స్పెక్టర్ జనరల్ స్థాయి అధికారి నేతృత్వంలో సిట్ పని చేయనుంది. వివిధ జిల్లాల పోలీసులు, ప్రత్యేక బృందాలు ఈ దర్యాప్తులో భాగమయ్యాయి. కేసును అన్ని కోణాల్లో పరిశీలించి కుట్ర వెనుక ఉన్నవారిని త్వరలోనే పట్టుకుంటామని అధికారులు తెలిపారు. ఇప్పటికే పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. హిస్టరీ షీట్ ఉన్న ముగ్గురు నిందితులను ప్రత్యేకంగా ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. అయితే కాల్పులకు పాల్పడిన ప్రధాన నిందితులు ఇంకా పరారీలోనే ఉన్నారు. నార్త్ 24 పరగణాస్ జిల్లాలో బుధవారం రాత్రి సుమారు 10:30 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కొలకతా నుంచి తన స్కార్పియో కారులో వెళ్తున్న చంద్రనాథ్ రథ్‌పై డోరియా రహదారిలో దాడి జరిగింది. ఓ కారు అతని వాహనాన్ని అకస్మాత్తుగా ఓవర్‌టేక్ చేయగా, బైక్‌పై వచ్చిన దుండగులు ఎడమ వైపు నుంచి చేరుకుని నేరుగా కాల్పులు జరిపారు. ఈ ఘటనపై బీజేపీ కార్యకర్తలు గురువారం రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టారు. హత్యపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలో భద్రతా పరిస్థితులపై కూడా ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ఈ ఘటనతో పశ్చిమ బెంగాల్ రాజకీయ వాతావరణం మరింత ఉద్రిక్తంగా మారింది. పోలీసులు కేసు దర్యాప్తును వేగవంతం చేసి త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడించే అవకాశం ఉంది.

# ప్రజాదరణను పాలనగా మార్చగలరా విజయ్?



తమిళనాడు రాజకీయ చరిత్రలో ఎన్నో సంచలన మలుపులు వచ్చినప్పటికీ, ఈసారి ఏర్పడిన పరిస్థితి మాత్రం ప్రత్యేకమైనది. ఒక సినీనటుడు రాజకీయ నాయకుడిగా మారడం తమిళ రాజకీయాల్లో కొత్త విషయం కాదు. కానీ ప్రజల ఊహలను, ఆవేశాలను, అసంతృప్తులను, మార్పు కోరికను ఒకేసారి తన చుట్టూ సమీకరించుకుని అధికారానికి అంచుల వరకూ చేరుకోవడం మాత్రం సాధారణ విషయం కాదు. ఇప్పుడు అదే దశలో నిలబడ్డారు విజయ్. ఎన్నికల ఫలితాలు తమిళ రాజకీయ సమీకరణాలను పూర్తిగా మార్చేశాయి. దశాబ్దాలుగా రాష్ట్ర రాజకీయాలను నియంత్రించిన రెండు ప్రధాన శక్తుల మధ్య ప్రజలు మూడో ప్రత్యామ్నాయాన్ని వెతుకుతున్నారనే సంకేతం ఈ ఫలితాల్లో స్పష్టంగా కనిపించింది. అయితే ప్రజల ఆశలతో అధికార ద్వారం తెరవడం ఒక విషయం అయితే, ఆ ఆశలను పాలనగా మార్చడం మరో పూర్తిగా భిన్నమైన విషయం.

ప్రస్తుతం తమిళనాడులో ఏర్పడిన రాజకీయ పరిస్థితి ఒక అస్థిర సమీకరణంలా కనిపిస్తోంది. అధికారానికి దగ్గరగా వచ్చిన టీవీకేకు ఇంకా అవసరమైన మెజారిటీ లేకపోవడం, మద్దతు కోసం ఇతర పార్టీలతో చర్చలు జరపాల్సిన పరిస్థితి, బయట నుంచి మద్దతు ఇవ్వడానికి సిద్ధమయ్యే పార్టీల రాజకీయ లెక్కలు——ఇవి అన్నీ కలిపి భవిష్యత్తులో ప్రభుత్వం ఎంత స్థిరంగా పనిచేస్తుందన్న ప్రశ్నను ముందుకు తెస్తున్నాయి. ప్రజలు ఓటు వేసింది మార్పు కోసం. కానీ ఆ మార్పు సంకీర్ణ రాజకీయాల బలహీనతల్లో చిక్కుకుపోతే, అదే ప్రజల్లో నిరాశకు కారణమయ్యే అవకాశం ఉంది.

తమిళనాడు రాజకీయాల్లో ఇప్పటివరకు డీఎంకే, అన్నాడీఎంకే వంటి పార్టీలు కేవలం ఎన్నికల యంత్రాలుగా మాత్రమే కాకుండా, బలమైన సామాజిక వర్గాల ఆధారిత రాజకీయ నిర్మాణాలుగా ఎదిగాయి. వాటి వద్ద పరిపాలనా అనుభవం ఉంది, అధికార వ్యవస్థలపై పట్టుంది, గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు రాజకీయ నిర్మాణం ఉంది. టీవీకే మాత్రం భావోద్వేగాల అలపై వేగంగా ఎదిగిన కొత్త శక్తి. ఇలాంటి పరిస్థితిలో ప్రజల అంచనాలు చాలా వేగంగా పెరుగుతాయి. కానీ ప్రభుత్వ యంత్రాంగం అంత వేగంగా మారదు. ఇక్కడే విజయ్ ముందున్న అసలు పరీక్ష ప్రారంభమవుతుంది.

ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలు ప్రజల్లో అపారమైన ఆకర్షణ కలిగించాయి. మహిళలకు ఆర్థిక సాయం, నిరుద్యోగ భృతి, ఉచిత గ్యాస్ సిలిండర్లు, రైతులకు రుణమాఫీ, ఉచిత విద్యుత్, భారీ స్థాయిలో ఉద్యోగాల కల్పన——ఇవి అన్నీ వినడానికి ప్రజలకు ఆశ కలిగించే హామీలే. సామాజిక అసమానతలు పెరుగుతున్న సమయంలో, మధ్యతరగతి జీవన వ్యయం అధికమవుతున్న సమయంలో, యువతలో నిరుద్యోగ భయం పెరుగుతున్న సమయంలో ఇలాంటి హామీలు సహజంగానే ప్రజలను ఆకర్షిస్తాయి. కానీ ప్రజాస్వామ్యంలో ఒక ముఖ్యమైన ప్రశ్న ఎప్పుడూ ఉంటుంది——ప్రభుత్వం ఇచ్చే ప్రతి హామీకి డబ్బు ఎక్కడి నుంచి వస్తుంది?

ఇదే ప్రశ్న ఇప్పుడు తమిళనాడు రాజకీయాల్లో అత్యంత కీలకంగా మారింది. ఇప్పటికే తమిళనాడు దేశంలో సంక్షేమ ఖర్చులు ఎక్కువగా చేసే రాష్ట్రాల్లో ఒకటి. విద్య, ఆరోగ్యం, సామాజిక సంక్షేమ రంగాల్లో తమిళనాడు ముందంజలో ఉంది. కానీ అదే సమయంలో రాష్ట్ర అప్పులు కూడా గణనీయంగా పెరిగాయి. ఆదాయం పెరుగుతున్నా, వ్యయాలు ఇంకా వేగంగా పెరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితిలో మరిన్ని భారీ సంక్షేమ పథకాలను ప్రవేశపెడితే, ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థపై మరింత ఒత్తిడి పడే అవకాశం ఉంది.

సంక్షేమం అనే పదం భారత రాజకీయాల్లో ఒక నైతిక శక్తిలా మారిపోయింది. ప్రజలకు కనీస జీవన భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యతే. పేదరికం, నిరుద్యోగం, సామాజిక వెనుకబాటుతనం వంటి సమస్యలు ఉన్న దేశంలో సంక్షేమ పథకాలు అవసరమే. కానీ సంక్షేమం ఒక స్థాయికి మించి రాజకీయ పోటీ సాధనంగా మారినప్పుడు సమస్యలు మొదలవుతాయి. ఉచితాల రాజకీయాలు తాత్కాలిక ఉపశమనం ఇవ్వొచ్చు, కానీ ఉత్పాదక ఆర్థిక వ్యవస్థను నిర్మించలేవు. ప్రజలకు ఆదాయం వచ్చే మార్గాలు సృష్టించకుండా కేవలం సబ్సిడీలతో జీవన ప్రమాణాలను నిలబెట్టడం దీర్ఘకాలంలో సాధ్యం కాదు.

విజయ్ ముందున్న ప్రధాన సవాలు ఇదే——ప్రజల ఆశలను నిరాకరించకుండా, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను కూల్చకుండా ఎలా ముందుకు తీసుకెళ్తారు? ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని వెంటనే అమలు చేయడం రాజకీయంగా ఆకర్షణీయంగా కనిపించవచ్చు. కానీ అలా చేస్తే బడ్జెట్ లోటు పెరిగే ప్రమాదం ఉంది. అప్పులు పెరిగితే అభివృద్ధి ప్రాజెక్టులపై ప్రభావం పడుతుంది. పెట్టుబడిదారుల్లో అనిశ్చితి పెరుగుతుంది. దీని ప్రభావం చివరికి ఉద్యోగాలపై పడుతుంది. అంటే తక్షణ రాజకీయ లాభం కోసం తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తులో ఆర్థిక సంక్షోభానికి దారితీయవచ్చు.

ప్రస్తుతం భారతదేశంలోని అనేక రాష్ట్రాలు ఇదే సమస్యను ఎదుర్కొంటున్నాయి. ఎన్నికల సమయంలో ప్రకటించిన భారీ సంక్షేమ పథకాలను అమలు చేయడంలో ప్రభుత్వాలు ఇబ్బందులు పడుతున్నాయి. కొన్నిచోట్ల హామీలను దశలవారీగా అమలు చేస్తున్నారు. మరికొన్నిచోట్ల అమలులో ఆలస్యం జరుగుతోంది. ఇంకొన్ని రాష్ట్రాల్లో ఆర్థిక పరిస్థితి కారణంగా పథకాల పరిమాణం తగ్గించాల్సి వచ్చింది. ప్రజల్లో పెరిగిన ఆశలు, ప్రభుత్వాల ఆర్థిక సామర్థ్యం మధ్య ఏర్పడుతున్న అంతరం రాజకీయ విశ్వసనీయతను దెబ్బతీస్తోంది.

విజయ్ ఈ పరిస్థితిని ముందుగానే అర్థం చేసుకోవాలి. ప్రజాదరణతో అధికారంలోకి రావడం సాధ్యమే. కానీ విశ్వసనీయతతో కొనసాగడం కోసం వాస్తవిక రాజకీయాలు అవసరం. ప్రజలకు నచ్చే మాటలు చెప్పడం ఒక దశ. ఆ మాటల్ని ఆర్థికంగా సాధ్యమైన విధానాలుగా మార్చడం మరో దశ. ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించగలిగితేనే ఆయన రాజకీయంగా నిలదొక్కుకోగలరు.

ఉద్యోగాల అంశం ప్రత్యేకంగా పరిశీలించాల్సినది. యువతలో నిరుద్యోగం ఇప్పుడు దేశవ్యాప్తంగా పెద్ద సమస్యగా మారింది. ప్రభుత్వ ఉద్యోగాల హామీ ప్రజల్లో భారీ ఆశలను కలిగిస్తుంది. కానీ ప్రభుత్వ ఉద్యోగాల సంఖ్యకు పరిమితి ఉంటుంది. ఒక ప్రభుత్వం లక్షల సంఖ్యలో ఉద్యోగాలు ఇవ్వాలంటే భారీ స్థాయిలో జీతభత్యాల భారం పెరుగుతుంది. దీర్ఘకాలంలో ఇది ఆర్థిక ఒత్తిడిని పెంచుతుంది. అందుకే ప్రభుత్వ ఉద్యోగాల కంటే ఉత్పాదక రంగాల్లో ఉపాధి అవకాశాలు సృష్టించడం ముఖ్యమవుతుంది.

తమిళనాడు పరిశ్రమల పరంగా బలమైన రాష్ట్రం. ఆటోమొబైల్, టెక్స్టైల్, ఎలక్ట్రానిక్స్, ఐటీ రంగాల్లో రాష్ట్రానికి మంచి స్థానం ఉంది. విజయ్ ప్రభుత్వం నిజంగా యువతకు భవిష్యత్తు ఇవ్వాలనుకుంటే, కొత్త పరిశ్రమలను ఆకర్షించాలి. స్టార్టప్‌లకు ప్రోత్సాహం ఇవ్వాలి. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఆర్థిక మద్దతు కల్పించాలి. విద్యా వ్యవస్థను మార్కెట్ అవసరాలకు అనుగుణంగా మార్చాలి. కేవలం ప్రభుత్వ ఉద్యోగాల ప్రకటనలు యువతలో తాత్కాలిక ఆశను కలిగించవచ్చు. కానీ స్థిరమైన ఉపాధి మాత్రం ప్రైవేట్ రంగ అభివృద్ధి ద్వారానే సాధ్యమవుతుంది.

వ్యవసాయ రంగం విషయంలో కూడా ఇదే వాస్తవం వర్తిస్తుంది. రైతులకు రుణమాఫీ రాజకీయంగా ఆకర్షణీయమైన నిర్ణయం. అప్పుల బాధలో ఉన్న రైతులకు ఇది తాత్కాలిక ఉపశమనం ఇవ్వొచ్చు. కానీ ప్రతి ఎన్నికల సమయంలో రుణమాఫీ ప్రకటించడం వ్యవసాయ రంగానికి దీర్ఘకాలిక పరిష్కారం కాదు. రైతులకు మార్కెట్ భద్రత, నీటి వనరులు, నిల్వ సదుపాయాలు, సరైన ధరలు, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉండాలి. వ్యవసాయం లాభదాయకంగా మారితేనే రైతుల సమస్యలు నిజంగా తగ్గుతాయి.

ఇక్కడ మరో ముఖ్యమైన అంశం ఉంది. తమిళనాడు ఓటర్లు రాజకీయంగా చాలా చైతన్యవంతులు. వారు కేవలం భావోద్వేగాలతో ఓటు వేయరు. పరిపాలనా సామర్థ్యాన్ని కూడా అంచనా వేస్తారు. అందుకే తమిళ రాజకీయాల్లో దీర్ఘకాలంగా నిలబడిన నాయకులు కేవలం ప్రజాదరణ వల్ల కాకుండా, పరిపాలనా నైపుణ్యం వల్ల కూడా గుర్తింపు పొందారు. విజయ్‌కు ప్రజాదరణ ఉంది. కానీ ఇప్పుడు ఆయనను ప్రజలు నాయకుడిగా కాకుండా పాలకుడిగా చూడబోతున్నారు.

సినిమా ప్రపంచంలో కథను రచయితలు రాస్తారు. పాత్రను దర్శకుడు నిర్మిస్తాడు. హీరో భావోద్వేగాలను ప్రదర్శిస్తాడు. కానీ రాజకీయాల్లో ప్రతి నిర్ణయానికి వాస్తవ ప్రభావం ఉంటుంది. ఒక ప్రకటన మార్కెట్‌ను ప్రభావితం చేయవచ్చు. ఒక ఆర్థిక నిర్ణయం లక్షల మంది జీవితాలను మార్చవచ్చు. ఒక తప్పు వ్యాఖ్య పెట్టుబడులను తగ్గించవచ్చు. అంటే రాజకీయాల్లో నటన కాదు, నిర్ణయాలే నాయకత్వాన్ని నిర్వచిస్తాయి.

విజయ్ ముందున్న మరో పెద్ద సవాలు పరిపాలనా బృందం నిర్మాణం. కొత్త పార్టీలు అధికారంలోకి వచ్చినప్పుడు సాధారణంగా ఎదురయ్యే సమస్య ఇదే. అనుభవం ఉన్న అధికారులను ఎలా ఉపయోగించాలి? రాజకీయంగా విశ్వసనీయమైన నాయకత్వాన్ని ఎలా పెంచాలి? పార్టీ కార్యకర్తల ఆశలను ఎలా సమతుల్యం చేయాలి? సంకీర్ణ పార్టీల ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలి? ఇవన్నీ ఒక ప్రభుత్వ స్థిరత్వాన్ని నిర్ణయించే అంశాలు.

ప్రస్తుతం సంకీర్ణ రాజకీయ పరిస్థితి మరింత క్లిష్టంగా కనిపిస్తోంది. బయట నుంచి మద్దతు ఇచ్చే పార్టీలు ఎప్పుడైనా ఒత్తిడి రాజకీయాలు చేయవచ్చు. మంత్రి పదవులు, విధాన నిర్ణయాలు, ప్రాంతీయ ప్రయోజనాలు——ఇవి అన్నీ ప్రభుత్వాన్ని ప్రభావితం చేయవచ్చు. తమిళనాడులో ఇప్పటివరకు బలమైన ఏకపక్ష ప్రభుత్వాల అనుభవం ఎక్కువ. ఇప్పుడు ఒక అస్థిర సంకీర్ణ పరిస్థితి ఏర్పడితే, పరిపాలనా నిర్ణయాల్లో ఆలస్యం జరగవచ్చు.

ఇక ప్రజల అంచనాల విషయానికి వస్తే, అవి అసాధారణ స్థాయిలో ఉన్నాయి. ఎందుకంటే విజయ్‌ను చాలామంది సంప్రదాయ రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా చూశారు. అవినీతి, కుటుంబ రాజకీయాలు, పాత రాజకీయ శైలిపై విసుగు చెందిన వర్గాలు ఆయన వైపు ఆకర్షితమయ్యాయి. ఇలాంటి పరిస్థితిలో ప్రజలు సాధారణ ప్రభుత్వాన్ని కాదు, “మార్పు”ని ఆశిస్తారు. కానీ మార్పు అనే పదం రాజకీయంగా చాలా ప్రమాదకరమైనది కూడా. ఎందుకంటే అది వేగంగా ఫలితాలు ఇవ్వాలని ప్రజలు కోరుకుంటారు. ఫలితాలు ఆలస్యమైతే నిరాశ కూడా అంతే వేగంగా పెరుగుతుంది.

విజయ్ నిజంగా రాజకీయంగా నిలబడాలంటే ప్రజలకు ఒక ముఖ్యమైన నిజాన్ని చెప్పాలి——ప్రతి సమస్యకు తక్షణ పరిష్కారం ఉండదు. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం సమయం పడుతుంది. ఉద్యోగాల సృష్టి క్రమబద్ధమైన ప్రక్రియ. సంక్షేమ పథకాలకు స్థిరమైన ఆదాయ వనరులు అవసరం. ప్రజలకు వాస్తవ పరిస్థితులను నిజాయితీగా వివరించే నాయకత్వం దీర్ఘకాలంలో ఎక్కువ విశ్వాసాన్ని సంపాదిస్తుంది.

ఇక్కడ మీడియా పాత్ర కూడా కీలకం అవుతుంది. సినీ స్టార్ రాజకీయాల్లోకి వచ్చినప్పుడు మీడియా మొదట అతిశయోక్తి ఆశలను నిర్మిస్తుంది. అదే మీడియా తర్వాత తీవ్ర విమర్శలు కూడా చేస్తుంది. విజయ్ ప్రభుత్వం ప్రతి నిర్ణయాన్ని ప్రజా అంచనాల కంటితో పరిశీలించాల్సి ఉంటుంది. సోషల్ మీడియా యుగంలో చిన్న తప్పిదం కూడా పెద్ద రాజకీయ నష్టానికి దారితీయవచ్చు.

ఇక జాతీయ రాజకీయాల కోణంలో చూస్తే, తమిళనాడు ఎప్పటినుంచో ప్రత్యేక రాజకీయ స్వభావం కలిగిన రాష్ట్రం. భాషా గౌరవం, ప్రాంతీయ స్వాభిమాన రాజకీయాలు, సామాజిక న్యాయ ఉద్యమాలు——ఇవి తమిళ రాజకీయాల ప్రధాన ఆధారాలు. విజయ్ ఈ భావజాలాల మధ్య తన స్థానాన్ని స్పష్టంగా నిర్వచించుకోవాలి. కేవలం ప్రజాదరణతో రాష్ట్ర రాజకీయాల్లో స్థిరమైన స్థానం సంపాదించడం కష్టం. ఒక స్పష్టమైన సిద్ధాంత దిశ కూడా అవసరం.

అంతిమంగా చూస్తే, విజయ్ ఎదుట ఉన్న పరిస్థితి ఒక అవకాశమూ, ఒక ప్రమాదమూ రెండూ. ప్రజలు ఆయనకు ఆశ ఇచ్చారు. కానీ అదే ప్రజలు ఇప్పుడు ఫలితాలను కూడా కోరుకుంటారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి మాట ఇప్పుడు పరిపాలనా పరీక్షకు లోనవుతుంది. సంక్షేమం మరియు అభివృద్ధి మధ్య సమతుల్యత, ప్రజాదరణ మరియు ఆర్థిక వాస్తవాల మధ్య సమతుల్యత, రాజకీయ ఆశలు మరియు పరిపాలనా సామర్థ్యం మధ్య సమతుల్యత——ఈ మూడు స్థాయిల్లో విజయ్ విజయం సాధించాల్సి ఉంటుంది.


అధికారంలోకి రావడం ఒక రాజకీయ ఘట్టం మాత్రమే. కానీ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం ఒక నిరంతర ప్రక్రియ. తమిళనాడు ప్రజలు మార్పును కోరుకున్నారు. ఇప్పుడు ఆ మార్పు భావోద్వేగ నినాదంగా మిగిలిపోతుందా? లేక స్థిరమైన పరిపాలనా నమూనాగా మారుతుందా? అన్నది విజయ్ తీసుకునే నిర్ణయాలపై ఆధారపడి ఉంది.

ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని ఒక ప్రజాదరణ తరంగంగా కాకుండా, ఒక బాధ్యతగా చూడగలిగితేనే ఆయన విజయవంతమైన నాయకుడిగా నిలుస్తారు. లేకపోతే తమిళ రాజకీయ చరిత్రలో మరో తాత్కాలిక సంచలనంగా మాత్రమే మిగిలిపోతారు.



మన్నారం నాగరాజు.
సామాజిక రాజకీయ విశ్లేషకులు.

# నిగ్గదీసి అడుగు.. ఈ సిగ్గులేని లోకాన్ని!




ఈ దేశంలో సిగ్గు అనే మాటకు అర్థం మారిపోయింది. పాత నిఘంటువులలో సిగ్గు అంటే మనసున్న మనిషికి తప్పు చేసినప్పుడు కలిగే హృదయ వేదన అని ఉంటుంది. అది ఒక ఆత్మశోధన, ఒక అంతర్మథనం. కానీ నేటి రాజకీయ మైదానంలో, సామాజిక వేదికలపై, తళతళలాడే పత్రికా కార్యాలయాల లాబీలలో తిరిగే కొందరు మహానుభావులకు ఆ పదానికి పరిచయమే లేదు. వారి దృష్టిలో సిగ్గు అనేది ఒక బలహీనత, ఒక అడ్డంకి.సిగ్గు లేనివాళ్ళకు సిగ్గు పెట్టడం అనేది ఈ రోజుల్లో ఒక గొప్ప కళ. ఆ కళను ప్రతి సామాన్యుడు నేర్చుకోవాల్సిన అత్యంత కీలకమైన సమయం ఆసన్నమైంది. ఈ వ్యాసం కేవలం ఒక విమర్శ కాదు ఇది ఒక నిశితమైన అద్దం. ఆ అద్దంలో మన సమాజం తన అసలైన, వికృతమైన ముఖాన్ని చూసుకోవాలని, మనసున్న పౌరులు తమ గొంతు పెంచాలని, వ్యవస్థలోని లోపాలను నిగ్గదీసి అడగటానికి సిద్ధపడాలని ఇచ్చే ఒక నిర్భయమైన పిలుపు.ఒక్కసారి మీ చుట్టూ ఉన్న పరిసరాలను గమనించండి. ఒక పక్క ఆకాశాన్ని అంటే మేడలు, మరోపక్క ఆకలితో అలమటించే ముఖాలు. తహసీల్దార్ కార్యాలయం ముందు ఒక పేద రైతు తన భూమి పత్రాల కోసం, ఒక చిన్న సంతకం కోసం వారాల తరబడి ఎండలో వేచి ఉంటాడు. అతని కళ్ళలో ఆశ, చేతుల్లో చెమట పట్టిన దరఖాస్తు కాగితం. అదే సమయంలో, రిజిస్ట్రేషన్ కార్యాలయంలోకి ఏ అపాయింట్‌మెంట్ లేని ఒక అన్నయ్య లేదా ఒక ప్రభావశీలి దర్జాగా లోపలికి వెళ్ళిపోతాడు.

రైతు వేచి ఉంటాడు అలసిపోతాడు చివరకు భారమైన గుండెతో ఇంటికి వెళ్ళిపోతాడు. ఎందుకు? ఎందుకంటే అతనికి పైస్థాయిలో పరిచయాలు లేవు, ఈ దృశ్యం తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, దేశవ్యాప్తంగా ప్రతి గల్లీలోనూ నిత్యకృత్యమైపోయింది. ఈ వ్యవస్థను నడిపించే కీలుబొమ్మలకు రవ్వంత సిగ్గు ఉన్నా, ఆ రైతు కళ్ళలో కన్నీళ్ళు చూసినప్పుడు వారి హృదయం కరిగిపోయేది. కానీ సిగ్గులేనివారికి ఆ కన్నీళ్ళు నీటి చుక్కల్లాగే కనిపిస్తాయి, వారికి కేవలం అధికార దర్పం, ధన దాహం మాత్రమే కనిపిస్తాయి. ఎన్నికల నగారా మోగగానే, బురద కుంటల్లో నడిచి, అర్ధరాత్రి వాగులు దాటి వచ్చి ఓట్లు అడిగే నేతలు గెలిచిన తర్వాత ఏమవుతారు? ఆ నియోజకవర్గపు సరిహద్దులు కూడా వారికి గుర్తుండవు. ఏ చేతులతోనైతే ఓట్లు అడిగారో, అవే చేతులతో ప్రజల గొంతు నొక్కుతారు. గ్రామాల్లో బోర్లలో నీళ్ళు లేవని మొరపెట్టుకున్నా, రోడ్లన్నీ మృత్యుపాశాల్లా మారినా, ఆస్పత్రుల్లో మందులు లేక పసిపిల్లలు ప్రాణాలు వదులుతున్నా వారి సమాధానం ఒక్కటే.పై వారితో మాట్లాడతాను, ఫైలు మూమెంట్ లో ఉంది. ఇది సిగ్గులేనితనం కాదా? జనానికి ఈ వ్యవస్థను ప్రశ్నించే ధైర్యం రావాలి. మీడియాకు వెన్నెముక నిటారుగా ఉండాలి. ఒక్కసారి గుండెల మీద చేయి వేసుకుని ఆలోచించండి మీ ప్రతినిధి ఐదేళ్ళ కాలంలో మీ ఊరికి ఎన్నిసార్లు వచ్చాడు? మీ పిల్లల చదువు గురించి, మీ ఆరోగ్యం గురించి అసెంబ్లీలో ఎన్నిసార్లు గొంతు విప్పాడు? ఈ లెక్కలు అడిగితే వారి నాలుకలు తడబడతాయి. పని చేయని వాడు మళ్ళీ ఓట్లు అడగటానికి వస్తున్నాడంటే, అది వాడు ఎంతటి నిర్లజ్జగా ఉన్నాడో తెలియజేస్తుంది.ఒకప్పుడు పత్రికలు అంటే అధికారానికి భయం పుట్టించే ఆయుధాలు. జర్నలిజం అనే వృత్తి నిజానికి ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా నిలబడేది. కానీ నేడు ఆ స్తంభానికి చెదలు పట్టింది. చాలాచోట్ల మీడియా సంస్థలు పెద్ద పెద్ద రాజకీయ నాయకుల చేతుల్లో కీలుబొమ్మలుగా మారిపోయాయి. ఏ ఛానల్ చూసినా ప్రజా సమస్యల కంటే, ఒక పార్టీని పొగడటం లేదా మరో పార్టీని తిట్టడం అనే పనిలోనే నిమగ్నమై ఉన్నాయి.

వార్తల కంటే ప్రకటనలే వార్తలుగా మారుతున్నాయి. వేలాది కోట్ల ప్రకటన నిధులతో పత్రికల నోళ్ళు మూయించడం, ప్రభుత్వ వైఫల్యాలు బయటకు రాకుండా తొక్కిపెట్టడం వంటివి ప్రజాస్వామ్యాన్ని గొంతు కోసి చంపడమే. ఈ అక్షర దోపిడీని నిగ్గదీసి అడగడం ప్రతి పౌరుడి హక్కు మాత్రమే కాదు, అది ప్రాథమిక బాధ్యత కూడా. కలం కమర్షియల్ అయిపోతే, సామాన్యుడి గొంతు మూగబోతుంది.రాజకీయ నాయకులకు కులం, మతం అనేవి కేవలం ఎన్నికల సీజన్ లో వచ్చే పండగలు లాంటివి. ఎన్నికలు రాగానే మీ కులం గొప్పదని, మీ మతం ప్రమాదంలో ఉందని కట్టుకథలు చెబుతారు. మిగతా నాలుగేళ్ళు వారు మీ కులాన్ని పట్టించుకోరు, మీ కష్టాన్ని గుర్తించరు. కానీ మీ అవసరాన్ని మాత్రం సరిగ్గా ఎన్నికల ముందు గుర్తు చేసుకుంటారు.ఈ కపటత్వాన్ని ఎదుర్కొనే చైతన్యం మనలో పెరగాలి. నువ్వు మా కులానికి చెందిన వాడివి కదా, నాకే ఓటు వెయ్యి అని అడిగే నాయకుడిని, ఈ ఐదేళ్ళలో మా కులంలోని పేదవాడికి నువ్వు చేసిన మేలేంటి? అని అడిగే నిక్కచ్చి తనం మనలో రావాలి. మన పూర్వీకులు ఒక గొప్ప మాట చెప్పారు.పొట్ట కూటికి అమ్ముడుపోయిన మనసు, పోరాటాన్ని మర్చిపోతుంది. నేటి సమాజంలో ఆ పొట్టకూటి రాజకీయాన్ని దాటుకుని, ఆత్మగౌరవంతో ప్రశ్నించడమే అసలైన సవాల్.నేటి డిజిటల్ యుగంలో సోషల్ మీడియా ఒక అద్భుతమైన అస్త్రం. ఎక్కడో ఒక మారుమూల గ్రామంలో జరిగే అన్యాయం క్షణాల్లో ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశం అవుతుంది. ఒక చిన్న వీడియో వైరల్ అయితే ప్రభుత్వ యంత్రాంగం కదిలి రాక తప్పని పరిస్థితి. ఇది ఒక గొప్ప పరిణామం.అయితే, ఈ అస్త్రాన్ని వాడేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. నేడు ఫేక్ న్యూస్ అనేది ఒక పెద్ద వ్యాధిలా మారింది. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం, వ్యక్తిగత దూషణలకు దిగడం కూడా సిగ్గులేని పనే. ఒకరిని విమర్శించే ముందు మన దగ్గర తగిన ఆధారాలు ఉండాలి. నిజాన్ని నిరూపించకుండా చేసే ఆరోపణలు, వ్యవస్థను మరింత భ్రష్టు పట్టిస్తాయి. కాబట్టి, నిజాన్ని నిజంగా, సాక్ష్యంతో, నిర్భయంగా అడగాలి.నిగ్గదీసి అడగడం అంటే కేవలం రోడ్ల మీదకు వచ్చి గొడవ చేయడం కాదు. అది ఒక క్రమశిక్షణతో కూడిన నిరసన.ముందుగా మన హక్కులు ఏమిటో మనకు తెలియాలి. ఒక రేషన్ కార్డు పొందడం మీ హక్కు, RTI (సమాచార హక్కు చట్టం) ద్వారా ప్రశ్నించడం మీ అధికారం. ఎక్కడ అన్యాయం జరిగినా మౌనంగా భరించవద్దు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయండి. ఆ ఫిర్యాదు కాగితం బుట్టదాఖలైనా, మళ్ళీ మళ్ళీ అడగండి.ఒక్క గొంతును నొక్కడం సులభం, కానీ వంద గొంతుకలు కలిస్తే అది ఒక గర్జన అవుతుంది. మీ పక్కవాడికి జరిగిన అన్యాయం మీది కాదు అనుకోవద్దు. ఈ రోజు అతనిది, రేపు మీది కావచ్చు. మార్పు అనేది రాత్రికి రాత్రే రాదు. అది ఒక నిరంతర ప్రక్రియ. మనం అడిగే ప్రతి ప్రశ్న ఒక కొత్త చైతన్యానికి పునాది వేస్తుంది.సిగ్గులేని జనాన్ని, వ్యవస్థను నిగ్గదీసి అడగడం అనేది కేవలం ఒక తిరుగుబాటు కాదు అది ఒక పౌర ధర్మం. ఈ వ్యాసం చదువుతున్న మీలో ఒక్కరైనా, రేపు మీ వీధిలో జరిగే అన్యాయాన్ని ప్రశ్నిస్తే, ఈ అక్షరాలకు సార్థకత లభిస్తుంది.గుర్తుంచుకోండి ప్రశ్నించడం ఆగిపోతే, అన్యాయం రాజ్యమేలుతుంది. గొంతు మూతపడితే, దోపిడీకి అడ్డు అదుపు ఉండదు. ఈ నేల మీది, ఈ ప్రజాస్వామ్యం మీది. అధికారం మీ కాళ్ళ దగ్గర ఉండాలి కానీ, మీ తల మీద కాదు. నిగ్గదీసి అడగండి. నిజాన్ని నిర్భయంగా చాటండి. ఒక బాధ్యతాయుతమైన కలం నుండి నిజాన్ని చెప్పే నోరు మూతబడినప్పుడు అబద్ధం సింహాసనాన్ని అధిష్ఠిస్తుంది. ఆ అబద్ధపు రాజ్యాన్ని కూల్చాలంటే, నిజం చెప్పే గొంతుకలు మేల్కోవాలి.



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

# రాష్ట్ర వడ్డెర సహకార సంస్థ చైర్ పర్సన్ నియామకం



కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) మే 07:

తెలంగాణ రాష్ట్ర వడ్డెర కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్ పర్సన్ గా సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు, P C C సభ్యులు, అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం, జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి గుంజ రేణుక నారాయణ నియమితులయ్యారు. ఈమేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావు అమెను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ గుంజ రేణుక మాట్లాడుతూ... తన సేవలను గుర్తించి ఎంతో నమ్మకంతో అప్పజెప్పిన ఈ పదవీ బాధ్యతలు మరింత బాధ్యతను పెంచాయని పార్టీ పటిష్టతకు, సంఘ అభ్యున్నతికి తన వంతు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జానారెడ్డికి, PCC అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, సంఘం వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు M.నారాయణస్వామి, జాతీయ ప్రధాన కార్యదర్శి గుంజ శ్రీనివాస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు G V నారాయణ, రాష్ట్ర అధ్యక్షులు మంజల రమేష్, రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులు వంటిపులి శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంజ నరసింహ, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు కుంచపు రమా, రాష్ట్ర కార్మిక విభాగం అధ్యక్షులు సాతాల గోపాల్, రాష్ట్ర కార్మిక విభాగం ప్రధాన కార్యదర్శి ఇడిగోటి నాగేష్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు రాపెన్ గిరిబాబు, ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షులు వేముల సుధాకర్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు ఇరగదిండ్ల వెంకటేష్, ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు రాయల రమణయ్య, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు గుర్రం కుమారస్వామి కుల బంధువులందరి తరపున రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

## కుత్బుల్లాపూర్ సమస్యలపై సీఎం సలహాదారుకు విన్నపం



కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) మే 07:

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఉన్న పలు సమస్యల పరిష్కారం మరియు అభివృద్ధి కొరకు గురువారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారు, రాజ్యసభ సభ్యులు వేంనరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అందజేశారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించే విధంగా అభివృద్ధి మరియు సంక్షేమం చేపట్టాలని కోరారు. ఈకార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు గడ్డం రాజేందర్ రెడ్డి, సిద్దనోళ్ల సంజీవ రెడ్డి పాల్గొన్నారు.

# భీమ్ రాజ్ సేన మహిళా నాయకత్వాన్ని బలోపేతం చేస్తోంది – కుమే పార్వతి మహిళా అధ్యక్షురాలిగా నియమితులయ్యారు



కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) మే 07

మహిళా సాధికారత, సామాజిక అభివృద్ధి దిశగా ఒక కీలక అడుగు వేస్తూ, భీమ్ రాజ్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీ కాంబ్లే రాజేష్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారం,126వ డివిజన్‌కు కుమే పార్వతిని మహిళా అధ్యక్షురాలిగా అధికారికంగా నియమించారు. గాజులరామారంలోని ఎన్టీఆర్ నగర్ నివాసి అయిన కుమే పార్వతి, సామాజిక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనడం, ప్రజా సంక్షేమం పట్ల నిబద్ధత, సమాజంలో మహిళల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి అంకితభావం చూపినందుకు గుర్తింపు పొందారు.ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీ కాంబ్లే రాజేష్ మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో బలమైన మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహించడానికి భీమ్ రాజ్ సేన కట్టుబడి ఉందని, ప్రజలకు సేవ చేయడంలో మరియు నియోజకవర్గం అంతటా మహిళా సాధికారత కల్పించడంలో కుమే పార్వతి కీలక పాత్ర పోషిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు,సామాజిక కార్యకర్తలు,యువజన సభ్యులు మరియు స్థానిక నివాసితులు ఈ నియామకాన్ని స్వాగతించి, ఆమె విజయవంతమైన నాయకత్వ ప్రస్థానానికి తమ హృదయపూర్వక అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ నియామకం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో భీమ్ రాజ్ సేన సంస్థాగత కార్యకలాపాలను మరింత బలోపేతం చేస్తుందని, అలాగే సామాజిక మరియు ప్రజా సేవా కార్యక్రమాలలో మహిళల భాగస్వామ్యాన్ని మరింతగా ప్రోత్సహిస్తుందని ఆశిస్తున్నాము.

# ఐఅండ్ పీఆర్ కమీషనర్ కు టీడబ్ల్యూజేఎఫ్ మీడియా డైరీ



హైదరాబాద్, మే 07:

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య గురువారం రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ ముకుందరెడ్డిని కలిసి ఫెడరేషన్ మీడియా డైరీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన పలు జర్నలిస్టుల సమస్యపై కమీషనర్ తో చర్చించారు. ప్రధానంగా కొత్త అక్రెడిటేషన్ కార్డుల పంపిణీ విషయం అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం లో ఫెడరేషన్ రాష్ట్ర కోకన్వీనర్ తన్నీరు శ్రీనివాస్, సీనియర్ నాయకుడు పద్మనాభ రావు తదితరులు పాల్గొన్నారు.

### ఆరుట్లలో కామినేని హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో

## ఉచిత వైద్య శిబిరం



- వైద్య పరీక్షలు చేయించుకున్న ఆరుట్ల గ్రామసర్పంచ్ మానిపాటి శోభా కుమార్

మంచాల వెలుతురు మే 07:

మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో పంచాయతీ కార్యాలయంలో హైదరాబాద్ ఎల్ బి నగర్ కామినేని హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు శిబిరానికి ముఖ్య అతి థిగా ఆరుట్ల గ్రామసర్పంచ్ మానిపాటి శోభ కుమార్ హాజరుఅయి ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారం భించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు ఈసందర్భంగా సర్పంచ్ మానిపాటి శోభకుమార్ మాట్లా డుతూ ఆరుట్ల గ్రామప్రజలు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం వేసుకొని వైద్య పరీక్షలు చే యించు కోవాలి అన్నారు వైద్య పరీక్షలు చేయించుకున్న గ్రామస్తులకు కామినేని హాస్పిటల్ వారు ఉచితంగా మందులు పంపిణీ చేశారు కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి చిలుకల వెం కటేష్ గ్రామస్తులు వెదిరె వెంకట రమణారెడ్డి వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ లొంగరీ యాద గి రి కామినేని హాస్పిటల్ డాక్టర్ జి గోపాల్ డి శ్రీధర్ అశ్విని ప్రీతి హాస్పిటల్ సిబ్బంది తదితరులు పా ల్గొన్నారు

# బస్తీల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించండి : కాంగ్రెస్




కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) మే 07:

బస్తీల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కొంపల్లి మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు. ఇటీవల నూతనంగా నియమితులైన కొంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ లావణ్య గురువారం కొంపల్లి మాజీ సర్పంచ్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జెమ్మి దేవేందర్ ఆధ్వర్యంలో కొంపల్లి డివిజన్, దూలపల్లి డివిజన్, సాయిబాబా నగర్ డివిజన్, సుభాష్ నగర్ డివిజన్‌లలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పూలగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈసందర్భంగా నాలుగు డివిజన్‌లలోని ప్రజా సమస్యలను డిప్యూటీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రాలు సమర్పించారు. ప్రజలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ లేబర్ సెల్ అధ్యక్షుడు కావలి గోపాల్ ముదిరాజ్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా లేబర్ సెల్ ప్రధాన కార్యదర్శి ఉప్పేందర్ రెడ్డి, కొంపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ కావూరి నవీన్ ముదిరాజ్ , కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఖదీర్ పాషా, ఎర్రోళ్ల కృష్ణ, దప్పు నరేందర్, జెమ్మి భాస్కర్, శశిధర్, యూఎంసీ కాలనీ అధ్యక్షుడు అంజనేయులు, భాస్కర్, బాలూ, ప్రవీణ్, బైరీ భాస్కర్ గౌడ్, చంద్రశేఖర్, శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల అధ్యక్షులు పాల్గొన్నారు.

# మన ఓటు, మన హక్కు.....

**ఓటరు జాబితాలో ప్రతీ ఒక్క ఓటర్ ఉండేలా నాయకుడు, బిఎల్ఏలు పనిచేయాలి**

**: బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద.**




కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి)మే 07:

బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 132 జీడిమెట్ల డివిజన్ లోని ఎం.ఎన్. రెడ్డి నగర్ కమ్యూనిటీ హాల్ లో Special intensive Revision (SIR) పై నిర్వహించిన అవగాహన సదస్సు కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిధిగా హాజరై Special intensive Revision (SIR) కార్యక్రమ నిర్వాహణ, ప్రాముఖ్యత, పాటించవలసిన నియమ, నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నాయకులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారదర్శక, కచ్చితమైన ఓటరు జాబితా రూపొందేలా ప్రతీ నాయకుడు, బిఎల్ఏలు పనిచేయాలని అన్నారు. 2002 జనాభా ప్రాతిపదికన ఎన్నికల సంఘం అద్వర్యంలో నిర్వహిస్తున్న ఈ SIR కార్యక్రమంలో నిజమైన ఓటర్లను గుర్తించడంతో పాటు, డూప్లికేట్ ఓట్లు, పర్మినెంట్ మైగ్రేటెడ్ ఓట్లు, అసలు మనుషులు లేని పేర్లతో ఉన్న ఓట్లను గుర్తించడం, కుటుంబ సభ్యుల ఓట్లను మ్యాపింగ్ చేయడం, కొత్త ఓటర్లను చేర్చడం, ఇంకా ఏమైనా చేర్పులు, మార్పులు ఉంటే వాటిని సరిదిద్దేలా నాయకులు, బిఎల్ఏల, సంక్షేమ సంఘాల నాయకులు, సీనియర్ సిటిజన్స్, యువత ఒక బాధ్యతగా తీసుకొని ప్రజలను చైతన్య పరుస్తూ అధికారులను సమన్వయ పరుచుకుంటూ సర్ కార్యక్రమాన్ని సద్వినియోగ పరుచుకోవాలనేలా పనిచేయాలన్నారు. అనంతరం రానున్న రోజుల్లో బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ గారి ఆధ్వర్యంలో పార్టీ బలోపేతంకై చేపట్టనున్న సభ్యత్వ నమోదు కార్యక్రమం, నూతన కమిటీల నియామకంతో పాటు పార్టీ బలోపేతానికి మరింత ప్రజల్లోకి ఎలా దూసుకువెళ్లాలనే చేపట్టవలసిన కార్యాచరణను వివరించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ కు చెందిన నాయకులు, మహిళా నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

# జనగణనలో ప్రజల భాగస్వామ్యం కావాలి

- రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి
- మే 10 వరకు స్వీయ నమోదు ప్రక్రియకు అవకాశం
- మే 11 నుంచి జూన్ 9 వరకు ఇండ్ల గణన నిర్వహణ
- ఫిబ్రవరి 9 నుంచి 28 వరకు జనాభా, కుల గణన
- స్వీయ నమోదు ద్వారా తప్పిదాలకు అడ్డుకట్ట
- ప్రతి కుటుంబం సరైన వివరాలు నమోదు చేయాలి
- ఉదయం 6 నుంచి రాత్రి 12 వరకు నమోదు సౌకర్యం
- నమోదు అనంతరం ప్రత్యేక గుర్తింపు సంఖ్య జారీ
- యువత, విద్యార్థులు అవగాహన కల్పించాలని పిలుపు
- డిజిటల్ విధానంలో తొలిసారి జనగణన ప్రక్రియ
- ప్రభుత్వ సంక్షేమ పథకాల రూపకల్పనకు ఈ సమాచారం ఆధారం



వెలుతురు, రంగారెడ్డి మే 07:

భారత ప్రభుత్వం చేపడుతున్న జనగణన 2027 కార్యక్రమంలో భాగంగా ప్రారంభమైన ఇండ్ల జాబితా, ఇండ్ల గణన స్వీయ నమోదు ప్రక్రియలో జిల్లా ప్రజలు, అధికారులు బాధ్యతగా పాల్గొనాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి కోరారు. గురువారం ఆమె తన కార్యాలయంలో స్వయంగా గణన ప్రక్రియలో పాల్గొని వివరాలను నమోదు చేశారు.

జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, విద్యావంతులు, ప్రజలు తప్పనిసరిగా స్వీయ నమోదు చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం మే 10 వరకు ప్రత్యేక అంతర్జాల వేదిక అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకోవచ్చని చెప్పారు.

భారత ప్రభుత్వం జనగణన ప్రక్రియను రెండు దశల్లో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తొలి దశలో మే 11 నుంచి జూన్ 9 వరకు ఇండ్ల గణన చేపడతారని తెలిపారు. రెండో దశలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 9 నుంచి 28 వరకు జనాభా గణన, కుల గణన నిర్వహిస్తారని చెప్పారు.

ఇందులో భాగంగానే ఏప్రిల్ 26 నుంచి స్వీయ గణన ప్రారంభమైందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఇందులో పాల్గొని సరైన వివరాలు నమోదు చేయాలని కోరారు. మే 11 నుంచి జూన్ 9 వరకు ఇంటికి వచ్చే గణన అధికారులకు పూర్తి సమాచారం అందించాలని సూచించారు. ప్రజల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు.

స్వీయ నమోదు ప్రక్రియ ద్వారా సమయం ఆదా అవుతుందని, తప్పులు జరిగే అవకాశాలు తగ్గుతాయని తెలిపారు. నమోదు పూర్తయ్యాక ప్రత్యేక గుర్తింపు సంఖ్య వస్తుందని, దానిని భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. గణనాధికారి ఇంటికి వచ్చినప్పుడు ఆ సంఖ్య చూపిస్తే ప్రక్రియ వేగంగా పూర్తవుతుందని వివరించారు.

రాష్ట్రంలో ఇండ్ల గణన ప్రారంభానికి 15 రోజుల ముందుగానే స్వీయ నమోదు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ ప్రక్రియలో పౌరులు కుటుంబ, ఇండ్ల వివరాలకు సంబంధించిన 33 ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. యువత, విద్యార్థులు గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పనకు ఈ గణాంకాలు కీలకమని తెలిపారు. తొలిసారిగా డిజిటల్ విధానంలో జనగణన నిర్వహించడం ప్రత్యేకత అని పేర్కొన్నారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు ఎప్పుడైనా వివరాలు నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు.

స్వీయ నమోదు ప్రక్రియలో భాగంగా ముందుగా అధికారిక జనగణన అంతర్జాల వేదికను తెరవాలి. అనంతరం భాషను ఎంచుకుని, చరవాణి సంఖ్య ద్వారా నిర్ధారణ ప్రక్రియ పూర్తి చేయాలి. రాష్ట్రం, జిల్లా, గ్రామం లేదా వార్డు వివరాలు నమోదు చేసి, ఇంటి స్థానాన్ని గుర్తించాలి. తరువాత కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేసి సమర్పించాలి. వివరాలు పూర్తయిన వెంటనే ప్రత్యేక గుర్తింపు సంఖ్య అందుతుందని తెలిపారు.

ఇళ్ల వివరాలు, కుటుంబ సభ్యుల సంఖ్య, త్రాగునీరు, మరుగుదొడ్డి, విద్యుత్, వంట సౌకర్యాలు, సమాచార పరికరాలు, వాహనాల వంటి అంశాలపై ప్రశ్నలు అడుగుతారని చెప్పారు. స్వీయ నమోదు చేసినప్పటికీ గణనాధికారి ఇంటికి వచ్చి వివరాలను పరిశీలిస్తారని తెలిపారు. అప్పటికి ప్రత్యేక గుర్తింపు సంఖ్య చూపిస్తే సరిపోతుందని పేర్కొన్నారు.

## 17 రాష్ట్ర కార్పొరేషన్లకు చైర్మన్లు, వైస్ చైర్మన్ ల నియామకం

- నిధులే లేని కార్పొరేషన్ లకు నియామకాల వల్ల ప్రయోజనం ఏమిటి.?
- ఎంవి రమణ, రాష్ట్ర కన్వీనర్

హైదరాబాద్ వెలుతురు మే 07:

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం ప్రవేశపెట్టే బడ్జెట్లో ఈ కార్పొరేషన్ లకు అతి తక్కువ నిధులు కేటాయిస్తున్నారు. అవి కూడా విడుదల చేసి ఖర్చు చేయడం లేదు. రూపాయి కూడా ఖర్చు చేయని కార్పొరేషన్లకు చైర్మన్ ల నియామకం వల్ల అదనపు ఖర్చు తప్ప ఒరిగేదేమీ లేదు.

ఈ కొత్త చైర్మన్లు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి బడ్జెట్ లో కేటాయించిన నిధులను రాబట్టడానికి ప్రయత్నం చేయండి. వృత్తిదారుల సంక్షేమానికి పాటుపడండి. వృత్తిలో ఆధునీకరణ తీసుకురావడం, ఉపాధి మెరుగుపరచడం కోసం రాష్ట్రంలో వృత్తుల ప్రాతిపదికన 11 కార్పొరేషన్ లు ఫెడరేషన్ లు కల్లుగీత, రజక, నాయి బ్రాహ్మణ, వడ్డెర ,మేదర ,విశ్వబ్రాహ్మణ ,కుమ్మరి, ఉప్పర, కృష్ణబలిజ ,వాల్మీకి బోయ ,బట్రాజ మరియు సంచార జాతుల వారికి ఎంబీసీ కార్పొరేషన్ లు ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా కుల ప్రాతిపదికన మరొక 9 కార్పొరేషన్లు పెరిక, ముదిరాజ్, యాదవ, మున్నూరు కాపు, పద్మశాలి ,మేర ,గంగపుత్ర, లింగాయత్ ,ఈ బీసీ ఏర్పాటు చేసింది.

మరియు కమ్మ ,వెలమ, బ్రాహ్మణ కార్పొరేషన్ లు కూడా ఏర్పాటు చేశారు.

వృత్తిదారుల కార్పొరేషన్లు, ఫెడరేషన్ లు నిధులు లేక నిర్వీర్యం అవుతున్నాయి. కేటాయించిన కొద్ది మంది ఆఫీస్ సిబ్బంది కి ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం 202627 బడ్జెట్ లో కేటాయించిన నిధులు వెంటనే విడుదల చేసి ఖర్చు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాము.



## చెన్నరెడ్డి గూడ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన గ్యార లలిత



- దశదిన కర్మ కార్యక్రమానికి ఆర్థిక సహాయం చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు
- -గ్యార లలిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుంది
- సహకార బ్యాంక్ డైరెక్టర్ జెనిగే వెంకటేష్ యాదవ్, మాజీ మండల అధ్యక్షుడు ముచ్చర్ల వెంకటేష్ యాదవ్

మంచాల వెలుతురు మే 07:

మంచాల మండలం చెన్నరెడ్డి గూడ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గ్యార పెంటయ్య సతీమణి లలిత కాంగ్రెస్ పార్టీ నాయకులు లలిత భర్త పెం టయ్య ఓదార్చిదశదిన కర్మ కార్యక్ర మానికి 24000వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు సందర్భంగా మంచాల సహకార సంఘం డైరెక్టర్ జెనిగే వెంకటేష్ యాదవ్ కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ముచ్చర్ల వెంకటేష్ యాదవ్ కలిసి మాట్లాడుతూ లలిత కుటుంబానికి కాంగ్రెస్ పా ర్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుంది అని అన్నారు కార్యక్రమంలో చెన్నారెడ్డి గూడా గ్రామశాఖ అధ్య క్షుడు పగడాల శ్రీశైలం కార్యదర్శి గ్యార రాజు మాజీ సర్పంచ్ ఆంబోతు కిషన్ నాయక్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కావలి బిక్షపతి గ్రామపంచాయతీ 10వ వార్డు సభ్యుడు మంచర్ల క్రాంతి కు మార్ నిట్టు పరమేష్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు

## వి.యం. హెూం లో +2(ఇంటర్మీడియట్) తరగతులు ప్రారంభించాలి

- ముఖ్యమంత్రికి బాలల హక్కుల సంక్షేమ సంఘం విజ్ఞప్తి

హైదరాబాద్ వెలుతురు మే 07:

సరూర్ నగర్ మండలంలో కొత్తపేట లో ఉన్న విక్టోరియా మెమోరియల్ హోం (వి.యం. హెూం) లో అనేక ఏళ్లుగా తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలు పదవతరగతి వరకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చదువుతున్నారు. ఐతే పదవతరగతి పూర్తి అయిన తర్వాత ఇక్కడ ఇంటర్మీడియట్ తరగతులు చదవడానికి జూనియర్ కళాశాల లేదు. అందువల్ల పదవ తరగతి తర్వాత వీరిని హెూం నుంచి బయటకు పంపడంతో ఈ అనాథ పిల్లలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పై చదువులు చదవడానికి వసతి గానీ, ఆర్థిక స్థోమత గానీ వీరిని చూడడానికి నా అన్న వాళ్ళు ఎవరూ లేని పరిస్థితుల్లో బయట ఉండి తమ చదువులు కొనసాగించలేక పోతున్నారు. కావున ఇక్కడ +2 తరగతులు ప్రారంభించాలని బాలల హక్కుల సంక్షేమ సంఘం (బిహెచ్ఎస్ఎస్) ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారికి విజ్ఞప్తి చేస్తుంది. తెలంగాణ విద్యామిషన్ కూడా హైస్కూలులో +2 తరగతులు (ఇంటర్మీడియట్ తరగతులు) ప్రారంభించాలని సిఫార్సు చేయడము జరిగింది.





వి.యం. హెూంలో ఇంటర్ కళాశాల (+2 తరగతులు) లేకపోవడం వలన పదవ తరగతి తర్వాత చదువులు మధ్యలో ఆపేసి బాల కార్మికులుగా మారడం జరుగుతుంది. వీరి ఆలనాపాలనా చూసే వారు లేకపోవడంతో వీరు రోడ్డున పడే పరిస్థితులు ఏర్పడచున్నవి. ఈ పిల్లలు ఇక్కడ పదవ తరగతి చదివిన తర్వాత పై చదువులు చదవడానికి అవకాశం లేకుండా ఉంది. పదవ తరగతి తర్వాత వీరికి వసతి కూడా ఉండదు.

కావున పదవ తరగతి చదివిన తర్వాత పై చదువులు చదవడానికి విఎంహోం లోనే హాస్టల్ తో కూడిన ఇంటర్మీడియాట్ మరియు డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని బాలల హక్కుల సంక్షేమ సంఘం కోరుతున్నది. సువిశాలమైన మైదానము కలిగిన చారిత్రక ప్రదేశం ఇది. ఇలాంటి వి.యం. హెూం భూములను ఎప్పటి నుండో బడా బాబులు హస్తగతం చేసుకోవడానికి గతంలో పలు విధాలుగా ప్రయత్నాలు చేయడం జరిగింది. ఇంటర్, డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాలలు ప్రారంభించుటకు ఇక్కడ అన్ని రకాలుగా అనుకూలంగా ఉన్నది. భవనాలు నిర్మించుటకు కూడా సరిపోను స్థలము ఉన్నది.

ఈ విక్టోరియా మెమోరియల్ హోమ్ లో చదువుచున్న ఈ అనాథ పిల్లలు పదవ తరగతి తర్వాత బాల కార్మికులుగా మారకుండా తమ పై చదువులు కొనసాగించుటకు ఇంటర్, డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాలలు ఏర్పాటు చేసి, వృత్తి విద్యా కోర్సులు కూడా ప్రారంభించేలా చూడాలని ముఖ్యమంత్రి గారిని బాలల హక్కుల సంక్షేమ సంఘం కోరుతున్నదని రాష్ట్ర అధ్యక్షులు డా గుండు కిష్టయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంజమూరి రఘునందన్, నాయకులు సూర్యపల్లి ఉమాదేవి, ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## ఎస్సైని మర్యాదపూర్వకంగా కలిసిన సగరపు



చివ్వెంల, వెలుతురు మే 7:

చివ్వెంల మండలం ఎస్సై మహేశ్వర్ ను గురువారం హైకోర్టు అడ్వకేట్, టి పిసిసి నాయకులు, డాక్టర్ సగరపు ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలో శాంతిభద్రతలు కాపాడేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. మండలంలోని మోదీపురం గ్రామంలో అది ఒక్కరు రోడ్డు భద్రత తో పాటు చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.



## జాబ్ మేళా కు ఏర్పాట్లు పూర్తి

- నిరుద్యోగులు సకాలంలో చేరుకొని తమ ప్రతిభను కనబర్చి ఉద్యోగాలు పొందండి
- కీర్తి రెడ్డి కుంభం ఫౌండేషన్ అధినేత

భువనగిరి మే 7 (వెలుతురు న్యూస్ ):

గురువారం రోజున భువనగిరి పట్టణం లోని స్థానిక న్యూ డైమెన్షన్ పాఠశాల లో కుంభం,ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే 1M to 1బి జాబ్ మేళా విజయవంతం చెయ్యాలని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారు మరియు కుంభం ఫౌండేషన్ చైర్మన్ కుంభం కీర్తి రెడ్డి గారు పిలుపు ఇచ్చారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతు యువత ఈ జాబ్ మేళా ను సద్వినియోగం చేసుకకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమం లో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల పట్టణ అధ్యక్షులు,కూర వెంకటేష్ యాత్ ఐకాన్ ఇల్యాస్ మొహమ్మద్ మంగ ప్రవీణ్ వాసు కిరన్ సన్నీ తదితరులు పాల్గొన్నారు..

# కొండపైన దుకాణాలకు టెండర్లు నిర్వహించాలి

- **యాదగిరిగుట్ట దేవస్థానం ఈవోకు వినతిపత్రం అందజేసిన యాదాద్రి పరిరక్షణ కమిటీ**

యాదగిరిగుట్ట , మే 7 వెలుతురు న్యూస్





కొండపైన దుకాణాలకు తక్షణమే టెండర్లు నిర్వహించి స్థానిక నిరుద్యోగులకు అవకాశం కల్పించాలని కోరుతూ యాదాద్రి పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కొండపైన ఈవో భవాని శంకర్ కు గురువారం ఆ కమిటీ నేతలు వినతి పత్రం అందజేశారు.. ఈ సందర్భంగా పరిరక్షణ కమిటీ నేతలు సుడుగు జీవన్ రెడ్డి, కాటబత్తిని ఆంజనేయులు , దేవ పూజ అశోక్ లు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా కొత్త టెండర్లు లేకుండా రాజకీయ పలుకుబడితో కొత్తవారికి అవకాశం లేకుండా తక్కువ కిరాయిలతో దుకాణాలు నిర్వహిస్తున్నారు అని ఆరోపించారు. ఎన్నో ఏళ్లుగా రెన్యువల్ కాకుండా వీళ్ళ పలుకుబడితో అడ్డుకుంటున్నారు అని విమర్శించారు ... స్థానిక నిరుద్యోగులు తక్కువ జీతాలకు దూర ప్రాంతానికి వెళ్లి పని చేయాల్సి వస్తుంది.. వీరి వల్ల దేవస్థానానికి నష్టమే కాకుండా భక్తులను కూడా దోపిడికి గురి చేస్తూ స్థానిక నిరుద్యోగులకు ఉపాధి అవకాశం లేకుండా చేస్తున్నారు అని అన్నారు . ఈ షాపులను మే 31 లోపు వేలం వేయకుంటే జూన్ 1 నుండి స్థానిక నిరుద్యోగులు అందరూ కొండపైకి వెళ్లి కొబ్బరికాయలు పూలు, పండ్లు, వస్త్రాలు అమ్ముకుంటాం అని ప్రకటించారు. ఈఓ వినతిపత్రం సమర్పించిన వారిలో సుడుగు జీవన్ రెడ్డి, కాటబత్తిని ఆంజనేయులు, దేవ పూజ అశోక్, గుండు నరసింహా , మిరియాల కృష్ణ,సతీష్‌బట్టు, వంగపల్లి అరుణ్, బండి అనిల్, మందోజు నరేష్, కర్రె ప్రవీణ్ , గుండు కుమార్,ఆ రెకుమార్, కొనే ప్రశాంత్, గోపగాని ప్రసాద్, కర్రె శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల రక్తం తాగుతున్న మిల్లర్లు..

- **ఈ పాపం నాయకులదే?**

**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 07:**




మండల వ్యాప్తంగా 24 గ్రామ పంచాయతీలో 31 సెంటర్లలో మొత్తం బస్తాలు సుమారు 11 లక్షల 84000 నేటి వరకు రెండు లక్షల 46వేల 876 బస్తాలు రవాణా చేయడం జరిగింది. 578 రైతులు ఎంట్రీ చేసుకోవడం జరిగినది 185 మంది రైతుల వివరాలు ట్యాబ్ లో ఎంట్రీ చేయవలసి ఉన్నది. 743 కుప్పాల సంఖ్య తేమశాతం చూడడం జరిగినది. ప్రస్తుతం మార్కెట్లో తూకం వేసి వెళ్లడానికి సిద్ధంగా ఉన్న బస్తాల సంఖ్య 31 వేల 31 కావలసిన లారీల సంఖ్య 45.మండల వ్యాప్తంగా ఎక్స్ట్రాతూకం ద్వారా 5920 క్వింటాళ్ల ధాన్యం అదనంగా జోకడం జరుగుతుంది. సుమారుగా ఒక కోటి 40 లక్షల 89 వేల 600 రూపాయలు మిల్లర్లకు ఎక్స్ట్రా తూకం ద్వారా లాభం వస్తుంది. బస్తకు అదనంగా 500 గ్రాములు తూకం చూపడం ద్వారా మిల్లర్లకు ఒక కోటి 40 లక్షల 89 వేల 600 రూపాయల లాభం వస్తుంది. మొత్తం రెండు కోట్ల 81 లక్షల 79,200 ఎక్స్ట్రా తూకం ద్వారా రైతుల చెమటను రక్తం తాగుతున్నారు. సింగిల్ విండో కార్యాలయం ద్వారా నాలుగు లక్షల 95 వేల బస్తాలను కొనుగోలు చేస్తే ఎక్స్ట్రా తూకం ద్వారా 2475 క్వింటాళ్ల ధాన్యం రూపంలో మిల్లర్లకు వెళుతుంది. సింగిల్ విండో కార్యాలయం ద్వారా మిల్లర్ల యొక్క లాభం 58 లక్షల 90,500 ఐకెపి సెంటర్ ద్వారా 5 లక్షల 62 వేల బస్తాలను కొనుగోలు చేయడం జరుగుతున్నది. ఎక్స్ట్రా తూకం ద్వారా 2 810 క్వింటాళ్ల ధాన్యం అదనంగా వెళుతుంది. సుమారుగా 66 లక్షల 87,800 మిల్లర్లకు లాభం రూపంలో వస్తుంది. ఎస్ పి ఓ అధికారుల ద్వారా 37వేల బస్తాలు కొనుగోలు చేయడం జరుగుతున్నది. ఎక్స్ట్రా రూపం ద్వారా 370 క్వింటాళ్ల ధాన్యానికి ఎక్స్ట్రా తూకం ద్వారా ఎనిమిది లక్షల నాలుగు లక్షల నలభై వేల 300 రూపాయలు అదనంగా పొందడం జరుగుతున్నది. ఎన్ డి సి ఎం ఎస్ అధికారుల ద్వారా 90 వేల బస్తాలు కొనుగోలు చేయడం జరుగుతున్నది. ఎక్స్ట్రా తూకం ద్వారా 450 క్వింటాళ్ల ధాన్యం అదనంగా పొందడం జరుగుతుంది. సుమారుగా 10 లక్షల 71 వేల రూపాయలు అదనంగా మిల్లర్లు లాభం పొందడం జరుగుతుంది. మొత్తం రామన్నపేట మండల వ్యాప్తంగా 11 లక్షల 84 వేల బస్తాలకు ఎక్స్ట్రా తూకం ద్వారా 5920 క్వింటాళ్ల ధాన్యం మిల్లర్లు అదనంగా లాభం పొందుతున్నారు. సుమారుగా ఒక కోటి 40 లక్షల 89 వేల 600 రూపాయలు రైతుల నుంచి ఎక్స్ట్రా ధాన్యం రూపంలో తీసుకుంటున్నారు. వాస్తవానికి 40 కిలోల 500 గ్రాములు ధాన్యం తూకం చేయాలి కానీ 41 కిలోలు 500 గ్రాములు తూకం వేయడం ద్వారా సుమారు రెండు కోట్ల 81 లక్షల 79,200 మిల్లర్లకు ఎక్స్ట్రా రూపంలో ధాన్యం ద్వారా వెళుతున్నది. అధికారుల లాభాలు.వాస్తవానికి 40 కిలోలు మాత్రమే తూకం వేయాలి. బస్తా వెయిట్ 450 గ్రాములు కలుపుకొని 40 కిలోల 500 గ్రాములు తూకం ద్వారా అన్ని సెంటర్లు లాభాల్లో ఉంటాయి కానీ 41 కిలోలు తూకం వేయడం ద్వారా ప్యాక్స్ అధికారం లాభాలు.

49, 5000 బస్తాలకు 2475 క్వింటాళ్ల ధాన్యం అదనంగా రావడం జరుగుతున్నది. అనగా వారి యొక్క ఆదాయం 29 లక్షల 45,250,ఐకెపి అధికారుల లాభం మొత్తం బస్తాలు 5 లక్షల 62000 ఎక్స్ట్రా తూకం 28 32 క్వింటాళ్ల ద్వారా 28 లక్షల 32,200. ఎస్ పి ఓ అధికారుల లాభం వారి యొక్క బస్తాల వివరాలు 37,000 ఎక్స్ట్రా తూకం 370 క్వింటాల ద్వారా వారి యొక్క లాభం 4,40300 ఎన్ డి సి ఎం ఎస్ అధికారుల ద్వారా 90 వేల బస్తాల ఎక్స్ట్రా తూకం ద్వారా 450 క్వింటాళ్ల ధాన్యానికి వారి యొక్క లాభం పదిలక్షల 71000 మొత్తంగా సింగిల్ విండో ద్వారా 58 లక్షల 90000 రూపాయలు ఎక్స్ట్రా తూకం ద్వారా ఆదాయం ఐకెపి ద్వారా 66 లక్షల 87,800 లాభం ఎస్ పి ఓ ద్వారా నాలుగు లక్షల 40,300 రూపాయల లాభం ఎన్డీసీఎంఎస్ ద్వారా పది లక్షల 71 వేల రూపాయల లాభం మొత్తం ఒక కోటి 40 లక్షల 89600 ఎక్స్ట్రా రూపంలో రైతుల నుంచి ఎక్స్ట్రా ధాన్యం వసూలు చేయడం జరుగుతున్నది. ఈ పాప ముమ్మాటికి మిల్లర్లాది! నాయకులది మాత్రమే!

ప్రతిరోజు మండల వ్యాప్తంగా 45 లారీలు అవసరం ఉన్నాయి. కావలసిన లారీలు 1200 నుంచి 1300 ప్రతి లారీకి 900 బస్తాలు నుంచి వెయ్యి బస్తాలు వేస్తే పది రోజుల్లో మండల వ్యాప్తంగా ఉన్న వడ్ల కొనుగోలు జరుగుతుంది.

# కాంగ్రేస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి.

- **ప్రజా పాలనలో పరిష్కారం కానీ ప్రజా సమస్యలు.**
- **సిపిఎం కేంద్ర కమిటి సభ్యులు ఎస్. వీరయ్య**

**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 07:**




రాష్ట్ర ప్రజలకు కాంగ్రేస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని సిపిఎం కేంద్ర కమిటి సభ్యులు ఎస్. వీరయ్య డిమాండ్ చేశారు. రామన్నపేట పార్టీ కార్యాలయంలో కూరెళ్ళ నరసింహా చారి అధ్యక్షతన జరిగిన మండల కమిటి సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరయ్యి మాట్లాడుతూ ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి ప్రజల ఓట్లతో గద్దెనెక్కిన రేవంత్ ప్రభుత్వం అధికారం చేతపట్టి మూడు సంవత్సరాలు కావస్తున్నా అనేక ప్రజా సమస్యలు ఎక్కడికి అక్కడే పేరుకు పోయాయని అన్నారు. ప్రజా పాలన అంటూ గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రేస్ ప్రభుత్వం గ్రామాల్లో ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందని అన్నారు. ఉపాధి కూలీలు,రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు, విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు అన్నీ వర్గాల ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని అన్నారు.పాలకులు నేల విడిచి సాము చేస్తే తగిన గుణ పాఠం చెబుతారని అన్నారు. ఆరు గ్యారంటీలు పూర్తిగా అమలు కాలేదని మహిళలకు 2500రూ. ఉపాధి కూలీలకు 1200రూ. ఇస్తామని వాటి ఊసు ఎత్తడం లేదని ఆసరా పింఛన్ కోసం అనేక మంది ఎదురు చూస్తున్నారని, రెండో దఫా ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన పేదలందరికీ అమలు యాలని,అన్నారు.విద్యార్థులకు ఫీజు రియంబెర్స్ మెంట్ , స్కాలర్షిప్ లు విడుదల చేయకపోవడంతో పేద విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఫాసిస్టు ప్రభుత్వం అవాలంబించే ప్రజా వ్యతిరేక విధానాలను రాష్ట్ర శాసన సభలో వ్యతిరేక తీర్మానాలతో ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కార్మిక హక్కుల్ని కాలరాసే లేబర్ కోడ్ లను రాష్ట్రంలో అమలు చేయకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటి సభ్యులు కొండమడుగు నర్సింహా, జిల్లా సీనియర్ నాయకులు మేక అశోక్ రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, జిల్లా కమిటి సభ్యులు బల్గురు అంజయ్య, మండల కార్యదర్శి వర్గ సభ్యులు కూరెళ్ళ నరసింహా చారి, కందుల హనుమతు, జంపాల అండాలు, మండల కమిటి సభ్యులు గన్నెబోయిన విజయభాస్కర్, బావండ్లపల్లి బాలరాజు, నాగటి ఉపేందర్, వేముల సైదులు, ఎండీ రషీద్, గొరిగే సోములు, తోలుపునూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సౌరశక్తితో వ్యవసాయ, గృహ అవసరాలు తీర్చుకోవాలి

- **సబ్సిడీతో సోలార్ పథకాలను వినియోగించుకోవాలి : ఎంపీడీఓ ఎం.ఏ. సలీం**

గుండాల, మే 7 (వెలుతురు):




ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గుండాల మండలంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో సోలార్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పంచాయతీ అధికారి ఎం.ఏ. సలీం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ ద్వారా అందిస్తున్న సోలార్ పథకాలను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి కుసుం కాంపోనెంట్ మోడల్ సోలార్ విలేజ్ కార్యక్రమం కింద అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం అందజేయ పడుతుందని తెలిపారు. వ్యవసాయ అవసరాలతో పాటు గృహ అవసరాల కోసం కూడా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ ఖర్చులను తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో కూడా సౌరశక్తి కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ అంబాల నరసింహ, మరపడిగ సర్పంచ్ కుమార్, పాచిల్ల సర్పంచ్ మహేష్, పుస్తకం సర్పంచ్ అనిల్, ఉపసర్పంచ్ ఆవుల సాయి ప్రసాద్, రమేష్, మండల పరిషత్ సూపరింటెండెంట్ మల్లయ్య, మండల వ్యవసాయ అధికారి సూరజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మధుసూదన్‌కు జాజుల లింగంగౌడ్ నివాళి

మిర్యాలగూడ వెలుతురు మే 07:



సీనియర్ జర్నలిస్టు డిప్యూటీ సీఎం సిపిఆర్ఓ మారబోయిన మధుసూదన్ దశదిన కార్యక్రమం పట్టణంలోని టిఎన్ఆర్ గార్డెన్స్ లో జరిగిన కార్యక్రమంలో బిసి జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ పాల్గొని నివాళులర్పించారు.వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి దేవుడు ధైర్యాన్ని ఇవ్వాలని కోరారు. బీసీ జేఏసీ అధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లు.

# బీసీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించండి



- **ఈనెల 10న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హైదరాబాద్ పర్యటన సందర్భంగా బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ బహిరంగ లేఖ**

మిర్యాలగూడ వెలుతురు మే 07:

ఈనెల 10న ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటన సందర్భంగా బీసీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ బహిరంగ లేఖను విడుదల చేసి అనంతరం బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల మాట్లాడుతూ... జనగణనలో బీసీ కులగుణన చేయాలి దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం జనాభా లెక్కలు సేకరిస్తున్న సందర్భంగా అందులో ఎస్సీ ఎస్టీల వివరాలు సేకరిస్తున్నారు కానీ బీసీల వివరాలు సేకరించడం లేదు వెంటనే జనగణనలో బీసీలను చేర్చాలి చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలు అసెంబ్లీ మరియు పార్లమెంట్ లో 20 శాతం కూడా దాటడం లేదని జనరల్ స్థానాలని అగ్రకులాలకి రిజర్వ్ అయ్యాయని బీసీలు చట్టసభలలోకి అడుగుపెట్టడం లేదని విచారం వ్యక్తం చేశారు.బీసీలు ఎమ్మెల్యేలుగా ఎంపీలుగా కావాలంటే కచ్చితంగా చట్టసభల్లో రిజర్వేషన్లు ఉండాల్సిందేనని అన్నారు బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించండి సీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి కేంద్రంలో బర్రెలకు గొర్రెలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖలు ఉంటాయి గాని బీసీలకు మంత్రి శాఖ లేకపోవడం బాధాకరం వెంటనే బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి. ఎస్సీ,ఎస్టీల మాదిరిగా బీసీలకు కూడా అట్రాసిటీ చట్టం వర్తింపజేయాలి గ్రామాలలో చిన్నచిన్న కులాలను కులవృత్తి చేసుకునే వారిని కులాల పేరుతో అవమానకరంగా పిలుస్తూ దాడులు చేస్తున్నారని బీసీలకు కూడా అట్రాసిటీ చట్టం ఉండాల్సిందేనని అన్నారు.బీసీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి ప్రధాని నరేంద్ర మోడీ గారుఅభినవ పూలేగా చరిత్రలో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ పట్టణ అధ్యక్షులు బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్ , బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యర్రబెల్లి దుర్గయ్య రజక,బీసీ యువజన సంఘం పట్టణ కార్యదర్శి దోనేటి శేఖర్, బీసీ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉరిబండి శ్రీనివాస్ యాదవ్, బీసీ యువజన సంఘం పట్టణ సెక్రటరీ బంటు సైదులు.

# ఘనంగా బిఆర్ఎస్ రాష్ట్ర నేత గొంగిడి మహేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు



- **పూలమాలలు శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపిన నాయకులు కార్యకర్తలు అభిమానులు**
- **గొంగిడి మహేందర్ రెడ్డి చేతుల మీదుగా కేక్ కట్ చేసి కార్యకర్తలు అభిమానులకు సీట్ల పంపిణీ**

యాదగిరిగుట్ట, మే 7 వెలుతురు న్యూస్

బిఆర్ఎస్ రాష్ట్ర నేత ఉమ్మడి నల్గొండ జిల్లా డిసిసిబి మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా గురువారం యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామంలో ఘనంగా ఆయన పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ యాదగిరిగుట్ట మండల అధ్యక్షులు కర్రె వెంకటయ్య మైలార్ గూడెం సర్పంచ్ మారెడ్డి కొండల్ రెడ్డి, రామాజీపేట సర్పంచ్ గడ్డం దేవేందర్, మాజీ సర్పంచ్ మొగిలిపాక రమేష్, తదితరులు గొంగిడి మహేందర్రెడ్డిని శాలువాలు పూలమాలతో ఘనంగా సత్కరించి ఆయన చేత కేకును కట్ చేయించారు. ఈ సందర్భంగా గొంగిడి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ తనపై పెద్ద ఎత్తున ప్రేమాభిమానాలు చూపిస్తున్న ఆలేరు ప్రజలు, బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు అభిమానులకు ఎల్లవేళలా రుణపడి ఉంటానని అన్నారు. తాను ప్రజా సేవలో నిరంతరం గడుపుతున్నానని అన్నారు. తన జీవితాన్ని మొత్తం ప్రజాసేవకే అంకితం చేస్తున్నానని అన్నారు. తాను, తన సతీమణి మాజీ ప్రభుత్వ విప్ , ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత రెడ్డి తామిద్దరం పూర్తిగా ఆలేరు ప్రజల సేవకే అంకితం అయ్యామని అన్నారు. ఇకముందు కూడా తమ జీవితాన్ని పూర్తిగా ఆలేరు ప్రజల సేవ కోసమే అంకితం చేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుండి తరలివచ్చిన బిఆర్ ఎస్ నాయకులు కార్యకర్తలు గొంగిడి అభిమానులు శాలువాలు పూలమాలతో గొంగిడి మహేందర్ రెడ్డిని ఘనంగా సత్కరించారు అనంతరం ఆయన చేతుల మీదుగా కేకును కట్ చేసి నాయకులు కార్యకర్తలు అభిమానులు ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన నాయకులు కార్యకర్తలు గొంగిడి మహేందర్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు . తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ఆలేరు ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని గొంగిడి మహేందర్ రెడ్డి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య , మైలార్ గూడెం సర్పంచ్ మారెడ్డి కొండల్ రెడ్డి, రామాజీపేట సర్పంచ్ గడ్డం దేవేందర్, మాజీ సర్పంచ్ మొగిలిపాక రమేష్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జై శ్రీరామ్ నినాదం వింటే భయమెందుకు....?

- **మంత్రి కొండా సురేఖ రాజీనామా చేయాలి.**
- **బీజేపీ నాయకులు సుగుర్తి జగదీశ్వరాచారి.**

కరీంనగర్ వెలుతురు మే 07:



జై శ్రీరామ్ అనే నినాదం వింటే మంత్రి సురేఖకు భయమెందుకైతందని కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల సీనియర్ బీజేపీ నాయకులు, మండల మాజీ అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ నుద్దేశించి విమర్శించారు. వరంగల్ లో జరిగిన ఒక సమావేశం లో మంత్రి సురేఖ మాట్లాడుతూ బీజేపీ కార్యకర్తలను విమర్శించే క్రమంలో జై శ్రీరామ్ అంటే డబ్బులు రాలుతాయా,కొత్త పథకాలేమైనా వస్తాయా అంటూ వెటకారం గా మాట్లాడటం ఆమె అహంకారానికి నిదర్శనమని పేర్కొన్నారు. జై శ్రీరామ్ అనే పదం అంటే, భయమెందుకైతందని ప్రశ్నించారు.కోట్లాది మంది రామ భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడటం హిందూ మతం పై ఆమెకున్నటువంటి అక్కసు ను వెళ్ళగక్కుతుందని అన్నారు. హిందూ మత సాంప్రదాయలకు అనుగుణంగా ఉండే దేవాదాయ ధర్మాదాయ శాఖ లో ఉంటూ దైవరూపమైన రాముణ్ణి విమర్శించడం, పేరును వ్యంగంగా ప్రకటించడం కోట్లాది మంది హిందువులను అగౌరవపరచడమే నని అన్నారు. వెంటనే క్షమాపణ లు చెప్పాలని లేదంటే రామాయణం లో ఆడ రాక్షసి సూర్పణకు ఎలాంటి గతి పట్టిందే అలాంటి గతి కొండా సురేఖ కు పట్టుతుందని పేర్కొన్నారు. దేవాదాయ శాఖ కు రాజీనామా చేసి మైనారిటీ శాఖ కు మంత్రి గా వెళ్లాలని సూచించారు. హిందూ మతం పై గానీ భక్తులను గానీ విమర్శించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేసిన కొత్త చట్టం హేట్ స్పీచ్ ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.ఆమెను దేవాలయాలకు రాకుండా రామ భక్తులు అడ్డుకునే రోజు దగ్గర్లోనే ఉందని అన్నారు.

# రైతులను గోస పెడుతున్న రాష్ట్ర ప్రభుత్వం



- **వెంటనే కొనుగోళ్ళు వేగవంతం చేయాలని బిజెపి డిమాండ్**

కరీంనగర్ వెలుతురు మే 07:

ధాన్యం కొనుగోలు చేయకుండా రైతులను ఈ రాష్ట్ర ప్రభుత్వం గోసపెడుతుందని బిజెపి మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్ అన్నారు. గురువారం బిజెపి కిషన్ మోర్చా మండల అధ్యక్షుడు రేమిడి రాజిరెడ్డి ఆధ్వర్యంలో కేశవపట్నం మార్కెట్ యార్డ్ ను సందర్శించిన బిజెపి నాయకులు కొనుగోలు కేంద్రంలో ధాన్యం పోసిన రైతుల సమస్యలు నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలు ఆర్భాటంగా ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు కొనుగోళ్ళు జరిగేందుకు మాత్రం తగు ఏర్పాట్లు చేయలేదని ఎద్దేవా చేశారు. ధాన్యం రాశులు కుప్పలుగా పేరుకుపోతుప్పటికీ తూకం వేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, ఒకవైపు వర్షాల భయంతో రైతులు ఆందోళన చెందుతుండగా పది రోజులు దాటినా కూడా ధాన్యం తూకం వేయడం లేదని, కొనుగోలు కేంద్రాలలో హమాలీ, రవాణా, టార్పాలిన్ వంటి సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, తరుగు పేరుతో 42 కిలోల పైనే తూకం వేస్తున్నారని, గ్రేడ్ ఏ ధాన్యాన్ని కూడా కామన్ కింద దిగుమతి చేసుకుంటు రైతులకు తీవ్ర నష్టం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇంత జరుగుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు నిద్రావస్థలో ఉన్నారని, రాష్ట్ర ప్రభుత్వం మరియు ఉన్నత అధికారులు తక్షణమే స్పందించి ఎలాంటి తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని, కొనుగోలు కేంద్రాలలో సమస్యలు లేకుండా చూడాలని లేనిపక్షంలో బిజెపి ఆధ్వర్యంలో తీవ్ర ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గద్దపాక ఉప సర్పంచ్ జంగ జైపాల్, నాయకులు దొంగల రాములు, కొయ్యడ అశోక్, రాసమల్ల శ్రీనివాస్, కనకం సాగర్, నిమ్మశెట్టి సంపత్, మాందాడి జగ్గారెడ్డి, చెర్ల శ్రీనివాస్, బిజికి సారయ్య, గొల్లిపెల్లి వెంకటేషం, గిద్దెమారి నర్సయ్య, కుర్రె అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశంలో మున్సిపల్ చైర్మన్ ఎం. అశోక్

- **కార్యక్రమంలో పాల్గొన్న వైస్ చైర్మన్ ఎండీ.హన్నాన్ జావీద్...**
- **కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎండీ. శంషార్ అలీ....**

జహీరాబాద్ వెలుతురు మే 07:



సంగారెడ్డి జిల్లా కోహిర్ పట్టణంలోని 5వ వార్డులో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి కోహిర్ మున్సిపల్ చైర్మన్ ఎం. అశోక్ ముఖ్య అతిథిగా హాజరై గృహప్రవేశ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఎం. అశోక్ మాట్లాడుతూ, పేద ప్రజలకు సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన నిరాశ్రయ కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనం అందించేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అర్హులైన ప్రతి కుటుంబానికి దశలవారీగా ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా సామాన్య ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని పేర్కొన్నారు. ఇల్లు అనేది ప్రతి కుటుంబానికి ఒక భద్రత, ఆత్మవిశ్వాసం కలిగించే అంశమని, అందుకే ప్రభుత్వం గృహ నిర్మాణ కార్యక్రమాలను వేగవంతం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ. హన్నాన్ జావీద్, కోహిర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండీ. శంషార్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# పీఎం కుసుం పథకం ఎవరిది..? పీఎం ఫోటో పెట్టరా...?

- **అధికారుల , ప్రభుత్వ తీరుపై మండిపడ్డ మాజీ ఎంపీటీసీ రంగు భాస్కరాచారి సమావేశం బహిష్కరణ...**

కరీంనగర్ వెలుతురు మే 07:




ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక రైతు వారము ప్రోగ్రాంలో భాగంగా గురువారం రోజున గంగిపల్లి గ్రామంలో ధన లక్ష్మి దాన్య విత్తన రైతు పరస్పర సహకార పరిమిత సంఘం వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో స్థానిక మాజీ ఎంపిటిసి రంగు భాస్కరాచారి అధికారుల తీరుపై మండిపడ్డారు. వ్యవసాయ క్షేత్రాలు., సౌర విద్యుత్ కేంద్రాలు (పీఎం కుసుం పథకం) అంశంపై సమావేశం చేపట్టినప్పుడు , ఆ పథకాన్ని ప్రవేశపెట్టింది ఎవరు..? ఆ పథకం ద్వారా నిధులు అందిస్తుంది ఎవరు..? అనే విషయంపై అధికారులకు అవగాహన లేదా? అని రంగు భాస్కరాచారి ప్రశ్నించారు. పూర్తిస్థాయి కేంద్ర ప్రభుత్వ నిధులతో పీఎం కుసుం పథకం అమలవుతుందని, అలాంటప్పుడు కనీసం దేశ ప్రధాని ఫోటో పెట్టక పోవడం అధికారులకు తగదన్నారు. పీఎం కుసుం పథకం ద్వారా పూర్తిస్థాయి కేంద్ర ప్రభుత్వ నిధులతో రైతులకు సోలార్ పంపు సెట్లు సబ్సిడీతో అందిస్తుందని ఆయన తెలిపారు. అలాంటి గొప్పనైన పథకం అమలు చేయడానికి , విధివిధానాలు తెలియజేయడానికి సమావేశం ఏర్పాటు చేసినప్పుడు , ఆ పథకాన్ని ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం, పీఎం నరేంద్ర గురించి చెప్పకపోవడం, ప్రోగ్రాం బ్యానర్లో పీఎం ఫోటో పెట్టకపోవడం భావ్యం కాదన్నారు. అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి తొత్తులుగా మారారని రంగు భాస్కరాచారి ఘాటు వ్యాఖ్యలు చేసి, సమావేశాన్ని బహిష్కరించి వెళ్లిపోయారు.

# రైతు వారోత్సవాల్లో యాంత్రికరణ, సోలార్ పంపుసెట్లపై అవగాహన

- **రంజోలు రైతు వేదికలో వ్యవసాయ శాఖ కార్యక్రమం...**
- **సబ్సిడీ పరికరాలు, డ్రోన్ల వినియోగంపై రైతులకు సూచనలు...**

జహీరాబాద్ వెలుతురు, మే 07:





సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పరిధిలోని రంజోలు రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పొలం యాంత్రికరణ, ఆధునిక వ్యవసాయ పరికరాల వినియోగం, సోలార్ విద్యుత్ పంపుసెట్లు, భూసార పరిరక్షణ వంటి అంశాలపై విస్తృత అవగాహన కార్యక్రమం చేపట్టారు. వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు హాజరై కార్యక్రమాన్ని ఆసక్తిగా వీక్షించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సహాయ వ్యవసాయ సంచాలకులు బిక్షపతి మాట్లాడుతూ వ్యవసాయాన్ని సులభతరంగా, తక్కువ ఖర్చుతో, అధిక లాభదాయకంగా మార్చేందుకు ఆధునిక యంత్రాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రభుత్వం గత సంవత్సరం నుంచి వ్యవసాయ పరికరాలను సబ్సిడీపై రైతులకు అందజేస్తోందని, ఈ ఏడాది కూడా ఆ పథకం కొనసాగుతుందని వివరించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళా రైతు గ్రూపులు, రైతు సంఘాలు, ఎఫ్‌పీఓలకు వ్యవసాయ డ్రోన్లను సబ్సిడీపై అందజేయనున్నట్లు తెలిపారు. ఈ డ్రోన్ల ద్వారా పురుగుమందుల పిచికారీ, ఎరువుల చల్లడం వంటి పనులు తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో పూర్తి చేయవచ్చని చెప్పారు. పంట అవశేషాలను కాల్చివేయకుండా భూమిలో కలపడానికి ఉపయోగపడే ష్రెడర్లు సబ్సిడీపై అందజేస్తున్నామని, వాటిని వినియోగించడం ద్వారా భూసారం పెరుగుతుందని రైతులకు సూచించారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులు రైతులకు సోలార్ విద్యుత్ పంపు సెట్ల ప్రాధాన్యత, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీల గురించి వివరించారు. వ్యవసాయ విద్యుత్ లైన్ల వద్ద తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, ప్రమాదాల నివారణపై రైతులకు సూచనలు చేశారు. వ్యవసాయ అధికారి లావణ్య మాట్లాడుతూ జిప్సం వినియోగం వలన భూమిలో లవణీయత తగ్గి పంట దిగుబడి పెరుగుతుందని తెలిపారు. రైతులు భూసార పరీక్షల ఆధారంగా జిప్సంను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో రైతు వేదిక ప్రాంగణంలో వివిధ ఆధునిక వ్యవసాయ పరికరాలను ప్రదర్శనకు ఉంచారు. డ్రోన్లు, మల్చర్లు, ష్రెడర్లు, పవర్ వీడర్లు, తైవాన్ స్ప్రేయర్లు, సోలార్ పంపు సెట్లు వంటి పరికరాల పనితీరును రైతులకు ప్రత్యక్షంగా వివరించారు. రైతులు ఆసక్తిగా పరిశీలించి అధికారులను ప్రశ్నలు అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం జిప్సం కోసం డీడీలు చెల్లించిన రైతులకు జిప్సం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జహీరాబాద్ డివిజన్ పరిధిలోని మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు లావణ్య, వెంకటేశం, నవీన్ కుమార్, వినోద్ కుమార్, నారింజ ఎఫ్‌పీఓ ప్రతినిధులు, ఎఫ్ఎంసీ చైర్మన్ సత్యనారాయణ ముదిరాజ్, విద్యుత్ శాఖ ఏఈలు, వివిధ గ్రామాల రైతు సోదర సోదరీమణులు పాల్గొన్నారు. ఈ మొత్తం కార్యక్రమాన్ని వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) ప్రదీప్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు.

# సమ్మె విజయంతో PF, ESI బకాయిల జమ – సంబరాల్లో జహీరాబాద్ మున్సిపల్ కార్మికులు

- **నాలుగు రోజుల సీఐటీయూ ఉద్యమానికి ఫలితం...**
- **రూ.1.33 కోట్లకు పైగా బకాయిల చెల్లింపు....**
- **స్వీట్లు పంచుకుని విధుల్లో చేరిన కార్మికులు...**

జహీరాబాద్ వెలుతురు మే 07





సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు చేపట్టిన నాలుగు రోజుల సమ్మె విజయవంతమైంది. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, ఈఎస్ఐ బకాయిలను తక్షణమే జమ చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. కార్మికుల ఐక్య పోరాటానికి స్పందించిన మున్సిపల్ అధికారులు సుమారు రూ.1 కోటి 33 లక్షలకు పైగా పీఎఫ్, ఈఎస్ఐ బకాయిలను జమ చేయడంతో సమ్మెను విరమించిన కార్మికులు తిరిగి విధుల్లో చేరారు. సమ్మె విజయంతో గురువారం ఉదయం మున్సిపల్ అటెండెన్స్ పాయింట్ వద్ద కార్మికులు ఆనందోత్సాహాలతో సంబరాలు జరుపుకున్నారు. ఒకరికి ఒకరు స్వీట్లు పంచుకుని తమ విజయాన్ని సెలబ్రేట్ చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. మహిపాల్ మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటమే ప్రధాన ఆయుధమని పేర్కొన్నారు. కార్మికులు ఐక్యంగా పోరాడినప్పుడు మాత్రమే ప్రభుత్వాలు, అధికారులు స్పందిస్తారని అన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ వంటి కార్మిక హక్కులు ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయరాదని, భవిష్యత్తులో ఇలాంటి బకాయిలు పేరుకుపోకుండా వెంటనే చెల్లింపులు జరిపేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల ఆందోళనకు సానుకూలంగా స్పందించి బకాయిలను జమ చేసిన మున్సిపల్ కౌన్సిల్, అధికారులకు సీఐటీయూ తరపున ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే నాలుగు రోజుల పాటు ఐక్యంగా సమ్మెలో పాల్గొని పోరాడిన మున్సిపల్ కార్మికులను ప్రత్యేకంగా అభినందించారు. కార్మికుల హక్కుల సాధన కోసం భవిష్యత్తులో కూడా అవసరమైతే ఉద్యమాలు, ఆందోళనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్మికులందరూ ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సంజీవ్, మోహన్, యశోదమ్మ, సిద్దమ్మతో పాటు పెద్ద సంఖ్యలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

# హిందువుల మనోభావాలను దెబ్బతీసిన సురేఖ రాజీనామా చేయాలి

- **హిందువుల ఆరాధ్యదైవం శ్రీరాముడిపై అనుచిత వ్యాఖ్యలు సిగ్గుచేటు**
- **దేవాదాయ శాఖ మంత్రివై ఉండీ ఇంత విషం చిమ్ముతావా...**
- **సురేఖ బేషరతుగా క్షమాపణ చెప్పకుంటే ఎక్కడికక్కడే అడ్డుకుంటాం..**
- **వచ్చేజన్మలో ముస్లింనై పుడతా అన్న గత ముఖ్యమంత్రి కేసీఆర్ ను ఓటర్లు ఏ గతి పట్టించారో తెలుసుకో..**
- **మంత్రి పదవిని కాపాడుకోవడానికే ఇలాంటి వ్యాఖ్యలు.**
- **ఉమ్మడి జిల్లాకు ప్రధాని మోదీ ఇచ్చిన నిధులు కనిపించడం లేదా..**
- **మామునూరు ఎయిర్‌పోర్టు, స్మార్ట్ నిధులు, హృదయ్ నిధులు కనించడం లేదా..**
- **గిరిజన యూనివర్సిటీ, రైల్వే ఫ్యాక్టరీ ఎవరిచ్చారో చెప్పగలవా..**
- **మా మోదీ హిందీలో మాట్లాడితే.. మీ రాహుల్ గాంధీ తెలంగాణలో మాట్లాడిందేమిటీ...**
- **బీజేపీ ఓబీసీ రాష్ట్ర నాయకులు రాజు అడిచెర్ల ధ్వజం**

కరీంనగర్ వెలుతురు మే 07:




'శ్రీరాముడిని పూజిస్తే పైసలు రాలుతాయా..' అంటూ హిందువుల ఆరాధ్యదైవంపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడడం సిగ్గుచేటని బీజేపీ ఓబీసీ రాష్ట్ర నాయకులు రాజు అడిచెర్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి సురేఖ వ్యాఖ్యలపై మంగళవారం ఆయన స్పందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రి బేషరతుగా హిందు సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పి, వెంటనే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని, లేదంటే ఆమెను ఎక్కడికక్కడే అడ్డుకుంటామని హెచ్చరించారు. దేవాదాయ శాఖ మంత్రి అయి ఉండీ హిందూ దేవుళ్లను అవమానించడమే కాక, ఇంత విషం చిమ్ముతావా అంటూ రాజు అడిచెర్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఎమ్మెల్యే వచ్చే జన్మలో ముస్లింనై పుడతా అంటూ హిందువును అవహేలన చేయగా.. అతడికి ఓటర్లు తమ ఓటు తగిన బుద్ధిచెప్పిన విషయం గుర్తు తెచ్చుకో అంటూ మంత్రికి హితవు పలికారు. కాంగ్రెస్‌కు హిందువులంటే ఎంత చెలకనో మరోసారి తేటతెల్లమైందన్నారు. మంత్రి సురేఖ తన పదవిని కాపాడుకోవడానికే ఇలాంటి దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారని రాజు అడిచెర్ల పేర్కొన్నారు. కేంద్ర నిధులు కనిపంచడం లేదా మంత్రిగారు... రాష్ట్రంలో ఇద్దరు కేంద్రమంత్రులున్నా.. జిల్లాకు నిధులు తేవడం చేతకాదా అన్న వ్యాఖ్యలపై రాజు అడిచెర్ల ఘాటుగా స్పందించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్ర నిధులు కనించడం లేదా అంటూ ప్రశ్నించారు. మామునూరు ఎయిర్‌పోర్టు, స్మార్ట్ సిటీ నిధులు, హృదయ్ నిధులు, గిరిజన యూనివర్సిటీ, రైల్వే ఫ్యాక్టరీలు ఎవరిచ్చారో చెబుతావారా అంటూ సూటిగా ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు పాలించడం చేతకాక, మతాల చిచ్చుపెడుతున్నది కాంగ్రెస్సే నంటూ మండిపడ్డారు.

**మోదీ హిందీ మాట్లాడితే రాహుల్ మాట్లేది ఏమిటి...?**

ఇక్కడి బీజేపీ నాయకులు ప్రధాని మోదీని పిలిపిస్తారు.. నాలుగు ముక్కలు హిందీలో మాట్లాడించి పంపిస్తారు అంటూ మంత్రి సురేఖ వ్యాఖ్యపై సైతం రాజు అడిచెర్ల తనదైన శైలిలో నిలదీశారు. మరి మీ రాహుల్ గాంధీ తెలంగాణకు వచ్చినప్పుడు ఏ భాషలో మాట్లాడుతారో... వరంగల్ వచ్చినప్పుడు ఏ భాషలో మాట్లాడారో మరిచిపోయారా అంటూ ధ్వజమెత్తారు.

# నేను వేశ్యనైతే..?

"ఒక వేశ్య శరీరాన్ని అమ్మవచ్చు కానీ మనసును కాదు ఆమె ఎవరో కాదు ఆమె కూడా మనమే"

శరీరాన్ని తాకట్టు పెట్టి కన్నబిడ్డల కడుపులు నింపుకునే మహిళా మణులెందరో ఈ దేశంలో. వేశ్య వృత్తి అమ్మానాన్నల జోలె నుంచి కాదు ఆకలితో బతికే సత్యం నుంచి పుట్టింది.

నిందించాల్సింది ఆమెను కాదు ఆమెను అక్కడ ఆ నిలబెట్టిన పరిస్థితులను.

ఈ నాగరిక వ్యవస్థలో వేశ్య వృత్తి కొన్ని దేశాల్లో కొన్ని సమాజాల్లో సర్వసాధారణమైతే మరి కొన్ని దేశాల్లో ప్రాంతాల్లో ఇది అపవిత్రమైనది తక్కువగా పరిగణించబడుతుంది. వేశ్య అంటే డబ్బు లేదా ఇతర లాభాల కోసం శారీరక సంబంధాలు కలిగించే మహిళగా సామాజికంగా నిర్వచించబడుతోంది. ఇది ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఒక పురాతన వృత్తి. కొన్ని సమాజాల్లో ఇది గౌరవపూర్వకంగా చూసే వృత్తి కాగా, మరికొన్ని సమాజాల్లో తక్కువగా పరిగణించబడుతోంది. వేశ్య వ్యవస్థకి సంబంధించిన చరిత్ర, కారణాలు, పరిస్థితులు, సామాజిక దృష్టికోణం, సమస్యలు మరియు పరిష్కారాలను వివరంగా తెలుసుకోవడం అవసరం. వేశ్యావృత్తి అనేది మనుషుల నాగరికతకు తోడు వచ్చిన వృత్తిగా చరిత్రకారులు భావిస్తారు. మానవుల మధ్య లైంగిక ఆకాంక్షల వల్ల, కొన్ని సమాజాల్లో వేశ్యలు పూజారుల్లా గౌరవించబడే స్థితిలో ఉండేవారు. ప్రభుత్వం వారికి మానవ హక్కులు, జీవనోపాధి హక్కు, ఆరోగ్య హక్కు, విద్య హక్కు ఉండేలా ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి.



పోలీసుల వేధింపులకు, లైంగిక హింసకు గురికాకుండా ప్రత్యేక న్యాయ పరిరక్షణ (legal aid) అందించాలి.

వేశ్యల పిల్లల కోసం విద్యా బృందాలు, హాస్టళ్లు, స్కాలర్షిప్‌లు ఏర్పాటు చేయాలి. మానవ అక్రమ రవాణాను (Human Trafficking) పూర్తిగా అణచివేయడంలో అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా కొత్త చట్టాలు రూపొందించాలి. మద్యం ప్రదేశాల నిర్వహణ, బాలల వేశ్యావృత్తి లాంటి వాటికి శిక్షలు కఠినతరం చేయాలి. ట్రాఫికర్లు, మధ్యవర్తులకు కఠిన శిక్షలు అమలు చేయాలి.

**వేశ్య అవ్వడానికి ప్రధాన కారణాలు:**

1. పేదరికం: జీవనోపాధి లేక, కుటుంబాలను పోషించాలన్న బాధ్యతతో కొన్ని మహిళలు వేశ్యా వృత్తిని ఎంచుకుంటారు.
2. అనాథత్వం: చిన్నతనంలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు మానవ అక్రమ రవాణాకు గురై ఈ వృత్తిలోకి బలవంతంగా లాగబడతారు.
3. ఆశ్రమం మరియు ఉద్యోగావకాశాల లోపం: విద్యాభావం వల్ల ఏ వృత్తినైనా పొందలేక, చివరికి ఈ మార్గం వైపు మొగ్గుతారు.
4. బలవంతపు వ్యభిచారం: చాలా సార్లు మహిళలు అక్రమ మానవ రవాణా మాఫియాల వలలో పడతారు.
5. సామాజిక వివక్ష: నిరాదరణ పొందిన, వలసబద్ధ వర్గాల నుండి వచ్చిన మహిళలు వేశ్యావృత్తిలోకి వెళ్లే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

నేను వేశ్య నైతే.. ఒకవేశ్య అంతరాంగిక అంతర్మధన ఆవేదన..

నీ కామం అనే ఆకలికి నేను ఆహారం, నీ లైంగిక వాంఛను తీర్చే ఓ ముడి సరుకును, నీ శారీరక కోరికకు నన్ను నేను సమర్పించుకునే ఓ త్యాగిని. ఈ సమాజంలో నేను ఎదుర్కొన్న పరిస్థితులే, సమస్యలే నన్ను ఈ నాలుగు గోడల మధ్యన సింగారించిన నల్లరాతి లాగా వ్యభిచారిని అనే ఒక దోషి లాగా నీ కామ కోరికల ముందు ఒక కీలుబొమ్మలాగా నన్ను నిలబెట్టింది.

నేను ఎవరిని నిందించాలి..? నా అంతరాత్మనా నన్ను ఈ కూపంలోకి నెట్టిన ఈ పరిస్థితులనా లేక నన్ను పోషిస్తున్న ఈ పురుషాదిక్య సమాజాన్నా..? ఎవరిని నిందించినా కూడా దోషినైతే నేనే కదా..!

నా బిడ్డల ఎండిన డొక్కలు నన్ను ప్రశ్నిస్తున్నాయి నా కొంపలో ఖాళీ కుండలు నన్ను వెక్కిరిస్తున్నాయి అగ్నిసాక్షిగా నా మెడలో మంగళసూత్రం కట్టి తనలో కలుపుకున్న నా అర్ధభాగం (భర్త) గమ్యం తెలవని నన్ను రెండు కాళ్ల జంతువులు ఉండే ఈ నాగరిక అడవిలో వదిలి నా చేత శత్రువు తెలియని యుద్ధం చేయిస్తున్నాడు నా జనన మర్మాంగాలతో వ్యాపారం చేయిస్తున్నాడు వెలకట్టలేని గర్భాలయాన్ని తూకం వేస్తున్నాడు. నా శరీరం నాకు ఎముకల గూడు కానీ అతనికి మాత్రం పట్టు పాన్పు. నేను క్షతఘాతురాల్ని శారీరక రోగినే కాదు మానసిక రోగిని కూడా నా స్వేద రంధ్రాల గుండా స్రవించే స్వేదం, నా నేత్రాల నుండి ఉద్భవించే నా కన్నీరు, శరీరం నుంచి ఉట్టి పడే నెత్తుటి మరకలు వీటన్నింటి కలయికగా నన్ను నన్నుగా చూసేది నన్ను మోస్తున్న నేను నిలబడుతున్న ఈ భూమి మాత్రమే అనుకుంటా.

ఈ నిశ్శబ్ద సమాజంలో నేనో నిషాధిని.. శాంతి ప్రేమికులు, శాంత కాముకులు ఈ నిషాధికి నిలువ నీడనిద్దురా..? ఈ నిగూడ సమాజాన్ని నిశ్శబ్దం అనే చీకటి అలుముకున్నది. సమాజం ఈ నిశ్శబ్దాన్ని వీడేదెన్నడో..!

నా శరీరం మలినమైతదేమో కానీ నా మనసు ఎప్పటికీ పవిత్రమే..! నేను ఎవరినో కాదు నేను నువ్వే, నన్ను నిందిస్తే నిన్ను నువ్వు నిందించుకున్నట్టే.

స్థిరత్వం లేని జీవితం నాది నిలకడ లేని బ్రతుకు నాది. నేను గబ్బిలం లాంటి దాన్ని పగలంతా విశ్రాంతిలో ఉంటాను రాత్రిపూట పొట్టకూటి కోసం తిప్పలు పడతాను నా ఎదలో సేద తీరేందుకు అల్లాడిపోయే కాముకులు ఎందరో వారికి నా ఈ మాంసపు ముద్దతో పని తప్ప నా మనసుతో ఏం పని..?

నా జీవితానికి ముగింపు పలుకుదాం అంటే పలక లేని పరిస్థితులు పలకనివ్వని బాధ్యతలు నేను పరుగుపందెంలో పరుగెత్తే అశ్వమేధాన్ని నేను పరిగెత్తగలిగినంత వరకే ఈ పందెంలో పోటీ దారును నా మాంసపు ముద్ద కుషించుకు పోయిన నాడు నన్నేం చేస్తారో నేనేమైపోతానో నాకే తెలియదు. గాలిలోని దీపం లాంటిదాన్ని ఆ గాలి నాకు ఊపిరి ఆ గాలే నా పాలిట యమపాశం కూడ. మాకు ఆశయాలు ఆకాంక్షలు వంటివి ఏం ఉండవు కోరికలు వాంఛలు కూడా ఉండవు మాకు ఆస్తిపాస్తులు కూడా ఏమీ ఉండవు నా శరీరమే నా ఆస్తి, రక్త మాంసాలే పెట్టుబడి. మాకు ఉన్నదల్లా మేము కోరుకునేదల్ల ఒకటే మమ్మల్ని ఒక వింత ప్రాణిలా కాకుండా సాటి మనిషిగా చూస్తే చాలు. మా ఈ పోరాటానికి పిడికడు మెతుకులే సాక్ష్యం.

ఈద శేఖర్
70369 97589

# పిఠాపురం ఇన్ చార్జ్ వర్మపై టీడీపీ వేటు

- **నియోజకవర్గంలో వరుస వివాదాలపై అధిష్టానం ఫోకస్**
- **ఇన్‌ఛార్జి బాధ్యతల నుంచి ఎస్‌వీఎస్ఎన్ వర్మను తప్పించిన చంద్రబాబు**
- **పార్టీ వ్యవహారాల నిర్వహణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు దిశగా చర్యలు**
- **వీలైనంత త్వరగా కొత్త కమిటీని ప్రకటించేందుకు టీడీపీ కసరత్తు**

**పిఠాపురం వెలుతురు మే 07:**

పిఠాపురం నియోజకవర్గంలో ఇటీవల చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలు, వరుస వివాదాల నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ అధిష్టానం కీలక నిర్ణయం తీసుకుంది. నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్న మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మను ఆ బాధ్యతల నుంచి తప్పించింది. పార్టీ వ్యవహారాలను సమన్వయం చేయడానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని పార్టీ అధిష్టానం నిర్ణయించినట్లు సమాచారం.

ఈ మేరకు పార్టీ అంతర్గతంగా కసరత్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. పిఠాపురం నియోజకవర్గంలో పార్టీ వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు, నాయకుల మధ్య సమన్వయం పెంచేందుకు కమిటీ వ్యవస్థను తీసుకురావాలని టీడీపీ భావిస్తున్నట్లు సమాచారం. వీలైనంత త్వరగా ఈ కమిటీని ప్రకటించే అవకాశాలు ఉన్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.


పిఠాపురం రాజకీయాలు ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. ఎన్నికల అనంతరం అక్కడ టీడీపీ, జనసేన శ్రేణుల మధ్య వివిధ అంశాలపై విభేదాలు వెలుగులోకి వచ్చినట్లు ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో పార్టీ పరిస్థితిని సమీక్షించిన టీడీపీ అధిష్ఠానం తాజా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇక తనను ఇన్‌ఛార్జి బాధ్యతల నుంచి తప్పించిన అంశంపై ఎస్‌వీఎస్ఎన్ వర్మ స్పందించారు. పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా దానికి పూర్తిగా సహకరిస్తానని స్పష్టం చేశారు. తాను పార్టీకి కట్టుబడి ఉన్నానని, పార్టీ ప్రయోజనాలే తనకు ముఖ్యమని తెలిపారు. ''రకరకాల రాజకీయ సమీకరణాల నేపథ్యంలో మార్పులు సహజమే. చివరికి పార్టీ బాగుండాలి అన్నదే ముఖ్యం'' అని వర్మ పేర్కొన్నారు. మంత్రి నారా లోకేశ్‌తో మాట్లాడిన తర్వాతే పిఠాపురం టీడీపీలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గంలో పార్టీ నిర్వహణను స్థానిక నాయకులే ముందుకు తీసుకెళ్తారని ఆయన తెలిపారు. పార్టీ బలోపేతానికి అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అధిష్టానం తీసుకునే ప్రతి నిర్ణయానికి తాను సహకరిస్తానని మరోసారి స్పష్టం చేశారు. టీడీపీ అధిష్టానం తీసుకున్న ఈ నిర్ణయం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. పిఠాపురం నియోజకవర్గం ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేక దృష్టిని ఆకర్షిస్తున్న నేపథ్యంలో పార్టీ వ్యవస్థను మరింత పటిష్టం చేయడంపైనే టీడీపీ దృష్టి పెట్టినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రత్యేక కమిటీ ఏర్పాటుతో స్థానిక స్థాయిలో వివాదాలను తగ్గించి, పార్టీ కార్యకలాపాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని అధిష్టానం భావిస్తున్నట్లు సమాచారం. అలాగే అన్ని వర్గాల నాయకులకు ప్రాధాన్యం కల్పిస్తూ సమిష్టి నాయకత్వాన్ని ప్రోత్సహించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మొత్తంగా పిఠాపురం టీడీపీలో చోటుచేసుకున్న ఈ మార్పులు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. ప్రత్యేక కమిటీ రూపకల్పన, దాని బాధ్యతలు, భవిష్యత్ రాజకీయ వ్యూహాలపై ఇప్పుడు ఆసక్తి నెలకొంది.



# సంజీవయ్యా నీలాంటివాళ్ళు మాకెందరయ్యా!

రాజకీయాలంటే నేడు అర్థబలం, అంగబలం.. వెరసి అధికార దాహం. కానీ, విలువలే ఊపిరిగా, నిజాయితీయే ఆయుధంగా రాజకీయ శిఖరాగ్రాలను అధిరోహించిన నిఖార్సైన కాంగ్రెస్ నాయకుడు దామోదరం సంజీవయ్య. కుల వివక్ష కోరలు పతక స్థాయిలో ఉన్న కాలంలో, నిరుపేద కుటుంబం లో జన్మించి, దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రిగా ఎదిగిన ఆయన ప్రస్థానం స్ఫూర్తిదాయకం. 38 ఏళ్లకే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి, నేటి తరం నాయకులకు ఆదర్శ నేతగా నిలిచారు. పదవులు ఆయనను వెతుక్కుంటూ వచ్చాయే తప్ప, ఆయన ఎన్నడూ పదవుల కోసం పాకులాడలేదు. గత రెండు వారాల క్రితం ఆంధ్ర ప్రాంతానికి చెందిన మిత్రులు నేలకూడి స్టాలిన్ బాబు, హైదరాబాద్ లో కలిసిన సందర్భంగా తాజా రాజకీయ పరిణామాలపై కాసేపు చర్చ చేయడం జరిగింది. అదే సమయంలో మాజీ సీఎం దామోదరం సంజీవయ్య జీవిత చరిత్రపై ఆయన రాసిన పుస్తకం నాకు అందజేసారు. ఆ పుస్తకం తీసుకున్న తర్వాత... ఆ మహనీయుడి చరిత్ర పుస్తకం చదివి నిజంగా నేను చాలా స్ఫూర్తి పొందానంటే అతిశయోక్తి కాదు. అప్పుడైనా... ఇప్పుడైనా... రాజకీయాలే కాదు... ఏ వ్యవస్థలో అయినా .... గాడ్... గాడ్ ఫాదర్ లేకుండా ఉన్నత శిఖారాలకు పోవడమంటే... అంత సులువు కాదు. కానీ, సంజీవయ్య ఏకంగా ఉమ్మడి రాష్ట్రానికి తొలి దళిత సీఎం. అసలు దేశంలోనే ఒక దళిత నాయకుడు అంత చిన్న వయస్సులో సీఎం అవడం అప్పటికీ... ఇప్పటికీ చారిత్రాత్మకమే. అటువంటి మహనీయుడి వర్ధంతి సందర్భంగా ఆయన గురించి రాయాలని మొదలుపెట్టిన ఆర్టికల్.

దామోదరం సంజీవయ్య నిజాయితీ గురించి రాజకీయ వర్గాల్లో ఇప్పటికీ ఒక కథనం చెప్పుకుంటారు. ఆయన ముఖ్యమంత్రి కావాల్సిన తరుణంలో, గిట్టనివారు ఆయనపై అవినీతి ముద్ర వేయాలని ప్రయత్నించి అప్పటి ప్రధానమంత్రి నెహ్రూకు ఫిర్యాదు చేశారు. నెహ్రూ రహస్యంగా విచారణ జరిపించారు. విచారణాధికారి సంజీవయ్య స్వగ్రామమైన పెద్దపాడుకు వెళ్లి చూడగా.. రాష్ట్రానికి కాబోయే ముఖ్యమంత్రి తల్లి కట్టెలపొయ్యి మీద వంట చేస్తూ కనిపించారు. ఆ పేదరికం, ఆ నిష్కల్మషమైన బతుకు చూసి విస్తుపోయిన వ్యక్తి... సంజీవయ్య నిజాయితీని నెహ్రూకు వివరించారు. ఆ తర్వాత నెహ్రూ ఆయనను ఎన్నడూ శంకించలేదు సరికదా, 'సర్.. మీరే కుర్చీని అలంకరించండి' అని ఏఐసీసీ అధ్యక్షుడిగా సాదరంగా ఆహ్వానించారు.




## సంస్కరణల సృష్టికర్త... పేదల పక్షపాతి

ముఖ్యమంత్రిగా ఆయన హయాం తక్కువ కాలమే అయినా, ఆ ప్రభావం చిరస్థాయిగా నిలిచిపోయింది. నేడు మనం చూస్తున్న అనేక కీలక విభాగాలు, పథకాలకు ఆయనే ఆద్యుడు. ప్రతి రోజూ నిత్యం వార్తలో చూస్తాం. అధికారులు అవినీతిలో దొరికారని... కానీ, అసలు ప్రభుత్వంలో అప్పుడే అవినీతి ఏరిపారేయాలని గుర్తించిన మహనీయుడు సంజీవయ్య. అందుకే, అవినీతి నిరోధక శాఖ: ప్రభుత్వంలో పారదర్శకత కోసం ఏసీబీని ఏర్పాటు చేసిన దార్శనికుడు ఆయన. సంక్షేమ విప్లవానికి ఊపిరి పోసిన నాయకుడాయన. టీచర్లకు పెన్షన్ సౌకర్యం కల్పించడం, వృద్ధాప్య పింఛన్లను ప్రారంభించడం ఆయన మానవీయ కోణానికి నిదర్శనం. ఒకసారి తల్లికి వంద రూపాయలు ఇస్తుంటే, "నాకు ఇస్తున్నట్లే వృద్ధులందరికీ ఎవరు ఇస్తారు?" అని ఆమె అడిగిన ప్రశ్నే వృద్ధాప్య పింఛన్ పథకానికి బీజం వేసింది. ఉమ్మడి రాష్ట్రంలో పెద్ద ఎత్తున భూ సంస్కరణలు చేపట్టారు. దాదాపు 6 లక్షల ఎకరాల బంజరు భూములను పేదలకు పంపిణీ చేసి రికార్డు సృష్టించారు. ఆయనకు మాతృభాష అంటే ఎంతో అభిమానం. అందుకే, తెలుగును అధికార భాషగా ప్రోత్సహిస్తూ, ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే ఉండాలని ఆదేశించిన భాషాభిమాని.

## జాతీయ స్థాయిలో 'బోనస్ సంజీవయ్య'

ముఖ్యమంత్రిగా పదవీకాలం ముగిశాక, కేంద్ర మంత్రిగానూ ఆయన తనదైన ముద్ర వేశారు. కార్మిక శాఖ మంత్రిగా ఆయన తెచ్చిన 'బోనస్ చట్టం' దేశవ్యాప్త కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపింది. అందుకే ఆయనను ప్రజలు ప్రేమగా 'బోనస్ సంజీవయ్య' అని పిలుచుకునేవారు. జెనీవాలో జరిగిన అంతర్జాతీయ కార్మిక సదస్సులో ఆయన చేసిన ప్రసంగం అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంది. బిహెచ్ఇఎల్ (BHEL) వంటి భారీ పరిశ్రమలను హైదరాబాద్‌కు తీసుకురావడంలో ఆయన చేసిన కృషి అనన్యం.

## విలువలే ఆస్తిగా మిగిలిన జీవితం

51 ఏళ్ల పిన్న వయసులోనే 1972 మే 7న ఆయన మరణించే సమయానికి, ఆయన పేరిట ఒక్క సొంత ఇల్లు లేదు, కారు లేదు, కనీసం బ్యాంకు బ్యాలెన్స్ కూడా లేదు. రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవులు అనుభవించినా, నిరుపేదగానే కన్నుమూయడం ఆయన నైతిక విలువలకు పరాకాష్ట. నేడు రాజకీయాల్లో ఆస్తులు సంపాదించడమే లక్ష్యంగా మారుతున్న వేళ, సంజీవయ్య జీవితం ఒక పాఠం. ఆయన కేవలం ఒక కులానికో, ఒక వర్గానికో చెందిన నాయకుడు కాదు... యావత్ తెలుగు జాతి గర్వించదగ్గ రాజనీతిజ్ఞుడు. ఆయన నిజాయితీ, నిబద్ధత రాబోయే తరాలకు దిక్సూచిగా నిలుస్తాయి. విలువలతో కూడిన రాజకీయాలకు ఆయన నిలువెత్తు సాక్ష్యం.



సాగర్ వనపర్తి,
9100004402,
పొలిటికల్ అనలిస్టు.

# విపత్తుల వేళ స్థానిక బృందాలే వెన్నెముక



**వెలుతురు, మేడ్చల్ మే 07:** విపత్తులు, ప్రమాదాలు సంభవించిన సమయంలో స్థానిక ప్రజలు, ఆపద మిత్రులు, ఎన్‌సీసీ కాడెట్లు, ఎన్‌వైకేఎస్ వాలంటీర్లు, మాజీ సైనికులు, హోంగార్డులు NDRF, SDRF బృందాలు, ఆర్మీతో కలిసి వెన్నెముకలా నిలవాలని జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ (NDMA) మేజర్ జనరల్ సుధీర్ బెహల్ పిలుపునిచ్చారు. గురువారం భారత ప్రభుత్వ జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన నివారణ చర్యలు, ముందస్తు జాగ్రత్తలు, అత్యవసర ప్రతిస్పందనపై సమగ్రంగా చర్చించారు. విపత్తుల సమయంలో సిద్ధాంతాల కంటే క్షేత్రస్థాయిలో అమలు చేసే ప్రణాళికలు ఎంతో ముఖ్యమని సుధీర్ బెహల్ పేర్కొన్నారు. అటవీ మంటలు, వరదలు, పరిశ్రమలలో అగ్ని ప్రమాదాలు వంటి ఘటనలు సంభవించినప్పుడు వెంటనే స్పందించే విధంగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రమాదాల సమయంలో ప్రాణనష్టం తగ్గించేందుకు రెస్క్యూ టీమ్‌లతో పాటు డాక్టర్లు లేదా పారామెడిక్ సిబ్బందితో కూడిన అంబులెన్స్‌లు సిద్ధంగా ఉండాలని సూచించారు. అడవుల్లో మంటలు చెలరేగినప్పుడు ఫైర్ శాఖ ఎలా స్పందించాలి, వరదల సమయంలో ప్రజలను ఎలా సురక్షిత ప్రాంతాలకు తరలించాలి అనే అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. వరదలు సంభవించే అవకాశం ఉన్న గ్రామాలను ముందుగానే గుర్తించి, గ్రామ తరలింపు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ప్రజల్లో ముఖ్యంగా పాఠశాలలు, పరిశ్రమల పరిసర ప్రాంతాల్లో విపత్తులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ప్రతి కుటుంబం వద్ద అత్యవసర వస్తువులు, మందులు, ఆధార్ కార్డు వంటి ముఖ్య పత్రాలతో కూడిన ఎమర్జెన్సీ కిట్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఆర్మీ, సీఆర్పీఎఫ్ వంటి సంస్థల నుంచి అవసరమైన సహాయం ఎలా పొందాలి, వారికి కావలసిన వసతులు ఎలా కల్పించాలనే అంశాలపై కూడా చర్చించారు. డ్రోన్లు, హెలికాప్టర్లు, ఇతర ఆధునిక పరికరాల వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. విపత్తుల సమయంలో మొబైల్ నెట్‌వర్క్ పనిచేయకపోతే, శాటిలైట్ కమ్యూనికేషన్, ప్రత్యేక రేడియో నెట్‌వర్క్‌ల ద్వారా సమాచార మార్పిడి కొనసాగించాలని సూచించారు. ప్రణాళికలు ఎంతవరకు సమర్థవంతంగా పనిచేస్తున్నాయో తెలుసుకోవడానికి తరచూ మాక్ డ్రిల్స్ నిర్వహించాలని, అందులో NCC, ఇతర వాలంటీర్లను భాగస్వామ్యం చేయాలని తెలిపారు. విమానాశ్రయాలు, డ్యాములు, రైల్వేల భద్రతపై కూడా సమావేశంలో చర్చించారు. మే 15న ఉదయం 10 గంటలకు టేబుల్ టాప్ ఎక్సర్‌సైజ్ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. మెడికల్, సివిల్ సప్లై, ఫైర్, అటవీ, పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, సివిల్ సప్లై డీఎం సుగుణబాయి, తహసీల్దార్లు, పోలీస్, ఫైర్, పరిశ్రమలు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 'ఏపీకి ఎవరొస్తున్నారో ఊహించండి'

- రాయల్ ఎన్‌ఫీల్డ్ పెట్టుబడిపై లోకేశ్ వీడియో వైరల్
- రాష్ట్రానికి భారీ పరిశ్రమ రానుందంటూ లోకేశ్ ఎక్స్‌లో వీడియో పోస్టు
- బుల్లెట్ బైక్‌పై లోకేశ్ రైడ్ చేస్తూ ఆసక్తి రేపిన వీడియో
- తిరుపతిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ తయారీ యూనిట్ ఏర్పాటు కానున్నట్లు వెల్లడి
- రూ.2,508 కోట్ల పెట్టుబడితో పరిశ్రమ స్థాపనకు సంస్థ ముందుకు




విజయవాడ వెలుతురు మే 07: ఆంధ్రప్రదేశ్‌లో భారీ పెట్టుబడులను ఆకర్షించే దిశగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తున్న నేపథ్యంలో మంత్రి నారాలోకేశ్ చేసిన తాజా పోస్టు రాష్ట్ర రాజకీయ, పారిశ్రామిక వర్గాల్లో చర్చనీయాంశమైంది. ''ఏపీకి ఎవరొస్తున్నారో ఊహించండి'' అంటూ ఆయన సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో ఒక వీడియోను పోస్టు చేశారు. ఆ వీడియోలో లోకేశ్ స్వయంగా బుల్లెట్ బైక్‌ను రైడ్ చేస్తూ కనిపించడం ఆసక్తిని రేకెత్తించింది. ఈ వీడియో వెనుక ఉన్న అసలు విషయం కొద్దిసేపటికే బయటకు వచ్చింది. ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ రాయల్ ఎన్ ఫీల్డ్ ఆంధ్రప్రదేశ్‌లో భారీ పెట్టుబడితో పరిశ్రమను ఏర్పాటు చేయనుంది. తిరుపతిలో రూ.2,508 కోట్ల పెట్టుబడితో బుల్లెట్ మోటార్‌సైకిళ్ల తయారీ యూనిట్‌ను స్థాపించేందుకు సంస్థ ముందుకు వచ్చింది. ఈ ప్రతిపాదనకు రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్‌ఐపీబీ) బుధవారం ఆమోదం తెలిపింది. రాష్ట్రానికి ప్రముఖ పారిశ్రామిక సంస్థలను తీసుకురావడంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్న నేపథ్యంలో రాయల్ ఎన్‌ఫీల్డ్ పెట్టుబడి కీలకంగా మారింది. దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు కలిగిన బుల్లెట్ మోటార్‌సైకిళ్లు ఇకపై ఆంధ్రప్రదేశ్‌లో తయారుకానుండటం రాష్ట్ర పారిశ్రామిక రంగానికి పెద్ద ఊతమని అధికారులు భావిస్తున్నారు.

లోకేశ్ తన పోస్టులో ''ఇకపై రాయల్ ఎన్‌ఫీల్డ్ మేడిన్ ఆంధ్రప్రదేశ్ కాబోతోంది'' అని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్య ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రాష్ట్రంలో పరిశ్రమల విస్తరణ, పెట్టుబడుల ఆకర్షణలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఇది నిదర్శనమని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. తిరుపతిలో ఏర్పాటు కానున్న ఈ తయారీ యూనిట్ ద్వారా వేలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ముఖ్యంగా ఆటోమొబైల్ రంగానికి సంబంధించిన అనుబంధ పరిశ్రమలు కూడా రాష్ట్రానికి వచ్చే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. దీనివల్ల తిరుపతి ప్రాంతంలో పారిశ్రామిక అభివృద్ధి మరింత వేగం అందుకునే అవకాశం ఉంది. రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి ప్రముఖ బ్రాండ్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడం ద్వారా ఇతర కంపెనీలకు కూడా ఆంధ్రప్రదేశ్‌పై విశ్వాసం పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు. పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, వేగవంతమైన అనుమతులు, పెట్టుబడిదారులకు అనుకూల విధానాలు కారణంగానే సంస్థలు రాష్ట్రం వైపు ఆసక్తి చూపుతున్నాయని ప్రభుత్వం పేర్కొంటోంది.

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడుల ఆకర్షణ కోసం పలు ప్రత్యేక విధానాలను అమలు చేస్తోంది. ముఖ్యంగా గ్రీన్ ఎనర్జీ, డేటా సెంటర్లు, తయారీ రంగాల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులు తీసుకురావడంపై దృష్టి పెట్టింది. ఈ క్రమంలో రాయల్ ఎన్‌ఫీల్డ్ ప్రాజెక్టు మరో కీలక మైలురాయిగా మారింది. ఎస్‌ఐపీబీ ఆమోదం అనంతరం ప్రాజెక్టు అమలు ప్రక్రియ వేగవంతం కానుందని తెలుస్తోంది. భూమి కేటాయింపు, మౌలిక వసతుల కల్పన వంటి అంశాల్లో ప్రభుత్వం సహకారం అందించనుంది. త్వరలోనే శంకుస్థాపన కార్యక్రమం కూడా నిర్వహించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. రాష్ట్రంలో తయారీ రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని అధికారులు చెబుతున్నారు. పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తే యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కూడా బలం చేకూరుతుందని పేర్కొంటున్నారు. మొత్తంగా రాయల్ ఎన్‌ఫీల్డ్ పెట్టుబడి ప్రకటన ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ''మేడిన్ ఆంధ్రప్రదేశ్''గా బుల్లెట్ బైకులు తయారుకానుండటంతో రాష్ట్రానికి జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు వచ్చే అవకాశముందని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# తెలంగాణ సాంస్కృతిక సారథి ప్రగతి నివేదికను పుస్తకాన్నీ ఆవిష్కరించిన మంత్రి జూపల్లి



హైదరాబాద్ వెలుతురు మే 07: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా తెలంగాణ సాంస్కృతిక సారథి వార్షిక ప్రగతి నివేదిక పుస్తకాన్ని పర్యాటక, సాంస్కృతిక, అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవిష్కరించారు. గురువారం డా. బీఆర్. అంబేద్కర్ సచివాలయంలో సాంస్కృతిక సారథి చైర్ పర్సన్ డాక్టర్ జీవీ వెన్నెల గద్దర్ తో కలిసి విడుదల చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రజాపాలనలో సాంస్కృతిక సారథిని కూడా ప్రగతి వైపు నడిపించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పార. ఈ సందర్భంగా ఏడాది ప్రగతి నివేదికను ఒక పుస్తక రూపంలో తీసుకురావడం అభినందనీయమని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కళాకారులకు వేతనాలు పెంచడంతో గత దశాబ్ద కాలంగా పెండింగ్ లో ఉన్న బదిలీలను చేపట్టడమని వెల్లడించారు. కళాకారులకు డప్పు తో పాటు అనేక రకాలైన శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేసి వారిలో ఉన్న నైపుణ్యాన్ని వెలుగు లోకి తీసుకురావడానికి సారథి ఏర్పాట్లు చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యంగా కళాకారుల ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధ చూపడం వారికి అవసరమైన వైద్యం అందించడానికి చర్యలు చేపట్టామని తెలిపారు . అనంతరం తెలంగాణ పర్యటక ,సాంస్కృతిక శాఖ స్పెషల్ సీఎస్ ఎ.వాణి ప్రసాద్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా.ఏనుగు నరసింహ రెడ్డికి నివేదిక ప్రతులను అందజేశారు. ఈకార్యక్రమంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సలహా సంఘం సభ్యులు ముచ్చర్ల దినకర్ పాల్గొన్నారు.

# వీర్యదాతగా ఎలాన్ మస్క్

- ఓపెన్‌ఏఐ కేసులో సంచలన మలుపు
- కోర్టులో శివోన్ జిలిస్ కీలక వాంగ్మూలం



**హైదరాబాద్, మే 7 (వెలుతురు):** అమెరికాలో ఓపెన్ ఏఐ ను లాభాపేక్ష సంస్థగా మార్చడాన్ని సవాలు చేస్తూ టెక్ వ్యాపారవేత్త ఎలాన్ మస్క్ దాఖలు చేసిన కేసు విచారణలో సంచలన పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. కాలిఫోర్నియాలోని ఫెడరల్ కోర్టులో జరుగుతున్న ఈ విచారణలో మస్క్‌కు సన్నిహితురాలు శివోన్ జిలిస్ ఇచ్చిన వాంగ్మూలం కేసుకు కొత్త కోణాన్ని తీసుకువచ్చింది. విచారణ సందర్భంగా ఓపెన్‌ఏఐ న్యాయవాదులు జిలిస్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. సంస్థ బోర్డు డైరెక్టర్‌గా ఉన్న సమయంలో గోప్యమైన వివరాలను మస్క్‌కు చేరవేశారని పేర్కొన్నారు. అయితే ఈ ఆరోపణలను జిలిస్ ఖండిస్తూ, తాను ఎలాంటి సమాచారం లీక్ చేయలేదని స్పష్టం చేశారు.జిలిస్ తన వాంగ్మూలంలో 2016లో ఓపెన్‌ఏఐలో సలహాదారుగా చేరినట్లు తెలిపారు. అదే సమయంలో మస్క్‌తో పరిచయం ఏర్పడిందని, అనంతరం 2020 నుంచి 2023 వరకు డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించినట్లు చెప్పారు. దాదాపు పదేళ్ల క్రితం కొంతకాలం మస్క్‌తో వ్యక్తిగత సంబంధం ఉన్నట్లు అంగీకరించారు. ఇక తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలను కూడా కోర్టులో వెల్లడించిన జిలిస్, తాను తల్లిగా మారాలని నిర్ణయించుకున్న సమయంలో మస్క్ వీర్యదాతగా సహకరించినట్లు తెలిపారు. అప్పటికి తమ మధ్య ఎలాంటి రొమాంటిక్ సంబంధం లేదని, పరస్పర అంగీకారంతో ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. పిల్లల తండ్రి వివరాలను గోప్యంగా ఉంచేందుకు ఒప్పందం చేసుకున్నట్లు వెల్లడించారు.ప్రస్తుతం తమకు నలుగురు సంతానం ఉన్నారని, వారి జీవితాల్లో మస్క్ భాగస్వామిగా ఉంటున్నారని జిలిస్ తెలిపారు. ప్రతివారం పిల్లలతో మస్క్ సమయం గడుపుతారని పేర్కొన్నారు.ఈ వాంగ్మూలంతో కేసు కేవలం సంస్థ పరిపాలనపై మాత్రమే కాకుండా వ్యక్తిగత సంబంధాల దిశగా కూడా మలుపు తిరిగింది. విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని న్యాయ వర్గాలు భావిస్తున్నాయి.

# తమిళనాడు గవర్నర్ వైఖరిపై కాంగ్రెస్ ఆగ్రహం

- నేడే లోక్ భవన్ ముట్టడికి పిలుపు





**చెన్నై, వెలుతురు మే 7:** తమిళనాడులో ప్రభుత్వం ఏర్పాటు వ్యవహారం రాజకీయంగా వేడెక్కుతోంది. ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా నిలిచిన టీవీకే అధినేత విజయ్ను ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించడంలో గవర్నర్ ఆలస్యం చేస్తుండటంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ పరిణామం రాష్ట్రంలో రాజ్యాంగ సంక్షోభానికి దారితీస్తోందని ఆరోపించింది. గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ వైఖరిని నిరసిస్తూ,నేడు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టనున్నట్లు తమిళనాడు కాంగ్రెస్ కమిటీ ప్రకటించింది. ముఖ్యంగా చెన్నైలోని గవర్నర్ అధికారిక నివాసమైన లోక్ భవన్ను ముట్టడించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చింది. అంతేకాకుండా రాష్ట్రంలోని అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో భారీ ఎత్తున ధర్నాలు నిర్వహించాలని నిర్ణయించింది. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించకుండా గవర్నర్ వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ఈ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. టీవీకే పార్టీకి 108 స్థానాలు రావడంతో పాటు కాంగ్రెస్ మరియు వామపక్షాల మద్దతు లభిస్తే ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి తగిన సంఖ్యాబలం ఉంటుందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. అయినప్పటికీ గవర్నర్ ఆహ్వానం ఆలస్యం చేయడం వెనుక రాజకీయ కారణాలున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 'ప్రజలు మార్పు కోరుకున్నారు.. కానీ గవర్నర్ ఢిల్లీ సూచనల కోసం ఎదురుచూస్తున్నారు' అని కాంగ్రెస్ నేతలు వ్యాఖ్యానించారు. ఇప్పటికే టీవీకే కార్యకర్తలు ఆందోళనల్లో పాల్గొంటుండగా, కాంగ్రెస్ పిలుపుతో రాష్ట్రంలో పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారాయి. సీపీఎం, సీపీఐ వంటి వామపక్ష పార్టీలు కూడా ఈ నిరసనలకు మద్దతు ఇచ్చే అవకాశముంది. పరిస్థితుల దృష్ట్యా తమిళనాడులో భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రధాన పట్టణాల్లో భారీగా పోలీసులు మోహరించారు. టీవీకే అధినేత విజయ్‌ను వెంటనే ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించాలని కాంగ్రెస్, వామపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. రేపటి ఆందోళనలతో రాష్ట్ర రాజకీయాలు మరింత ఉద్రిక్తంగా మారే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఏఐ తో డెలివరీ బాయ్ ఘరానా మోసం

- ఫేక్ వీడియో లతో పలువురిని బురిడి.. యువకుడి అరెస్ట్

**హైదరాబాద్, మే 7 (వెలుతురు):** టెక్నాలజీ దుర్వినియోగం మరోసారి వెలుగులోకి వచ్చింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సహాయంతో పోలీస్ అధికారిగా నటిస్తూ ప్రజలను మోసం చేస్తున్న యువకుడిని రాజేంద్రనగర్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. మైలార్‌దేవపల్లికి చెందిన అబూబకర్ అలీ వృత్తిరీత్యా జొమాటో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. త్వరగా డబ్బు సంపాదించాలనే ఆశతో ఏఐ టెక్నాలజీని ఉపయోగించి పోలీస్ యూనిఫాంలో ఉన్నట్లు ఫోటోలు, వీడియోలు రూపొందించాడు. ఈ నకిలీ కంటెంట్‌ను తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్ట్ చేస్తూ, తాను ఉన్నత స్థాయి పోలీస్ అధికారినని ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశాడు. ఇంతటితో ఆగకుండా, ప్రభుత్వంలో తనకు ఉన్నత స్థాయి పరిచయాలు ఉన్నాయని, ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్‌లు కూడా ఇప్పించగలనంటూ పలువురిని మోసం చేయడానికి యత్నించినట్లు సమాచారం. సోషల్ మీడియాలో అతడి కార్యకలాపాలు అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు నిఘా పెట్టారు. రాజేంద్రనగర్ టాస్క్ ఫోర్స్ బృందం కొద్ది రోజుల పాటు అతడి కదలికలను గమనించి, అతడు నకిలీ పోలీస్ అని నిర్ధారించింది. వెంటనే అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం బయటపడింది.ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, అబూబకర్ అలీని రిమాండ్‌కు తరలించారు. టెక్నాలజీని దుర్వినియోగం చేస్తూ ప్రజలను మోసం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.



# ఆపరేషన్ 'సింధూర్' విజయానికి ఏడాది



హైదరాబాద్, మే 7 (వెలుతురు): పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేస్తూ భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్' విజయానికి ఏడాది పూర్తయిన సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. నాంపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ రిటైర్డ్ ఆర్మీ సెల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా ఉగ్రవాదుల చేతిలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు నివాళులర్పించారు.ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు మాట్లాడుతూ, పహల్గామ్ దాడికి ప్రతీకారంగా లష్కర్, జైష్ వంటి ఉగ్రవాద సంస్థల శిబిరాలపై భారత సైన్యం సమర్థంగా దాడులు చేసి వాటిని నేలమట్టం చేసిందన్నారు. ఈ ఆపరేషన్ దేశ భద్రత పట్ల కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కఠిన వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు.పహల్గాంలో సెలవుల కోసం వెళ్లిన అమాయక భారతీయ పర్యాటకులను మతం అడిగి కాల్చిచంపిన ఘటనను దేశం ఎన్నటికీ మరవదని ఆయన అన్నారు. 26 మంది భారతీయులను అత్యంత క్రూరంగా హతమార్చిన పాక్ ప్రేరిత ఉగ్రవాదులకు ఈ ఆపరేషన్ గట్టి సమాధానమని తెలిపారు. ఘటన జరిగిన కొద్ది రోజుల వ్యవధిలోనే మహిళా అధికారుల పర్యవేక్షణలో భారత సైన్యం అత్యంత ఖచ్చితత్వంతో కేవలం 22 నిమిషాల్లో ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసిందని వివరించారు. ఈ చర్యలో భారత వైపు ఒక్క ప్రాణ నష్టం కూడా జరగలేదని ఆయన స్పష్టం చేశారు .ఈ విజయంపై కాంగ్రెస్ పార్టీ నాయకుల స్పందన దురదృష్టకరమని విమర్శించిన ఆయన, రాహుల్ గాంధీ సహా కాంగ్రెస్ నేతలు పాకిస్తాన్, చైనా ప్రతినిధుల్లా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.ఇక కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా ఖండిస్తున్నదని తెలిపారు. వ్యక్తిగత పరువు నష్టం కలిగించేలా వ్యవహరిస్తే తగిన విధంగా స్పందించాల్సిన పరిస్థితులు వస్తాయని హెచ్చరించారు.

## ఢిల్లీకి నజరానా.. రైతులకు జరిమానా..!

హైదరాబాద్, మే 7 (వెలుతురు): ఢిల్లీకి నజరానా.. రైతులకు జరిమానా అన్న చందంగా రేవంత్ రెడ్డి పాలన ఉందని బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ధ్వజమెత్తారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. నెల రోజులైనా వడ్లు కొనడం లేదని, తరుగు పేరుతో దోపిడీ జరుగుతోందని రైతులు ఆయన వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. కల్లాల్లో తడిసిన వడ్ల కుప్పలను పరిశీలించిన హరీశ్ రావు రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అకాల వర్షాల భయంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా హరీశ్ రావు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, వడ్ల కుప్పల వద్దనే రైతులు ప్రాణాలు కోల్పోతున్నా సీఎం రేవంత్ రెడ్డి స్పందించడం లేదని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఇలాంటి పరిస్థితులు ఎప్పుడూ లేవన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు యూరియా, రైతుబంధు, సాగునీరు, కరెంటు, చివరకు పండిన పంట అమ్ముకునే విషయంలో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని విమర్శించారు. జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రెస్ మీట్‌లో వడ్ల కొనుగోళ్లు బాగున్నాయని చెప్పడం వాస్తవాలకు విరుద్ధమన్నారు. "నేను ఏసీ గదిలో కూర్చుని మాట్లాడటం లేదు.. రైతుల మధ్య నిలబడి మాట్లాడుతున్నా" అని వ్యాఖ్యానించారు. చౌటుప్పల్ మార్కెట్‌కు వడ్లు తీసుకొచ్చి 24 రోజులు అయినా ఇంకా కాంటా పెట్టలేదని రైతులు తనకు చెప్పారని హరీశ్ రావు తెలిపారు. 44 డిగ్రీల ఎండలో రైతులు నెల రోజులుగా నిరీక్షిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మాయిశ్చర్ పరీక్షకు పది రోజులు, సంచులివ్వడానికి వారం, కాంటాకు మరో వారం, మిల్లుకు తరలించడానికి ఇంకో వారం పడుతోందని విమర్శించారు.

## పదేళ్లలో గ్లోబల్ సిటీగా హైదరాబాద్

ముంబై, మే 7 (వెలుతురు):

అంతర్జాతీయ పెట్టుబడులను భారీగా ఆకర్షించేలా... పదేళ్లలో హైదరాబాద్ ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. మహా నగరాల అభివృద్ధిలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేలా... భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తోందని వివరించారు. గురువారం ముంబైలో నిర్వహించిన 'నాస్కామ్ జీసీసీ సమ్మిట్ 2026'లో 'బియాండ్ పాలసీ: డిజైన్డ్ టు విన్ ది గ్లోబల్ జీసీసీ రేస్' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలనే సంకల్పంతో 'తెలంగాణ రైజింగ్ విజన్ 2047'కు శ్రీకారం చుట్టామని వివరించారు. ప్రపంచంలోని అనేక నగరాలు అస్తవ్యస్త పట్టణీకరణ వల్ల 'అర్బన్ కొలాప్స్' కోరల్లో చిక్కుకున్నాయని, అలాంటి చారిత్రక తప్పిదాన్ని హైదరాబాద్ విషయంలో తాము చేయాలనుకోవడం లేదన్నారు. అందుకే... భవిష్యత్తు కోసం ఎదురు చూడకుండా, దాన్ని నిర్మించే బాధ్యతను తీసుకున్నామన్నారు. ఆ దిశగానే భారత్ ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, మెట్రో విస్తరణ, కొత్త విమానాశ్రయాల అభివృద్ధి, ఆర్ఆర్ఆర్, మూసీ ప్రక్షాళన, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఐకం ఇన్నోవేషన్ హబ్ తదితర కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టామన్నారు. కేవలం టెక్ కంపెనీలే కాకుండా... బ్యాంకింగ్, లైఫ్ సైన్సెస్, సెమీ కండక్టర్లు, రక్షణ రంగం, ఎఫ్ఎంసీజీ, స్పేస్ టెక్, ఆతిథ్యం తదితర బహుళ రంగాలకు చెందిన దిగ్గజ సంస్థలు జీసీసీల ఏర్పాటుకు హైదరాబాద్ ను తమ మొదటి ప్రాధాన్యంగా ఎంచుకుంటున్నాయన్నారు. గతేడాది 70కి పైగా జీసీసీలు ప్రారంభమయ్యాయని, దేశంలో ఇదే అత్యధికమని వివరించారు. ఈ ఏడాది కొత్తగా 100 జీసీసీలను ప్రారంభించి... వాటిల్లో కొత్తగా లక్ష మందికి ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. జీసీసీలను కేవలం బ్యాక్ ఆఫీస్ ఆపరేషన్లకే పరిమితం చేయకుండా... వాటిని 'గ్లోబల్ వాల్యూ సెంటర్లు'గా మార్చేలా ప్రత్యేక 'కాంప్రహెన్సివ్ రోడ్డు మ్యాప్'ను సిద్ధం చేస్తున్నామన్నారు. పారిశ్రామికాభివృద్ధికి అన్ని రకాలుగా అనుకూలంగా ఉన్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను మంత్రి శ్రీధర్ బాబు కోరారు. హైదరాబాద్‌లో ఉన్న 'సిలికాన్ డెన్సిటీ (విభిన్న రంగాల నిపుణుల లభ్యత)'ని అందిపుచ్చుకుని 'మేడిన్ తెలంగాణ' బ్రాండ్ ను విశ్వవ్యాప్తం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో నాస్కాం ఛైర్మన్ శ్రీకాంత్, ప్రెసిడెంట్ రాజేష్ నంబియార్ తదితరులు పాల్గొన్నారు.

## భౌతిక దాడులకు రాజకీయాల్లో స్థానం లేదు: మంత్రి పొన్నం ప్రభాకర్

(మొదటి పేజీ తరువాయి)

ఒక ప్రజా ప్రతినిధి ఇంటిపై మరో ప్రజా ప్రతినిధి కార్యకర్తలు దాడులకు దిగడం సరికాదని ఆయన అన్నారు. చౌకబారు ప్రచారం కోసం దిగజారుడు వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు. ఎవరి మనసైనా నొచ్చుకుంటే దానికి దీటుగా సమాధానం చెప్పాలే తప్ప భౌతిక దాడులకు దిగడం సరైన విధానం కాదన్నారు.అన్ని రాజకీయ పార్టీల నాయకులు తమ కార్యకర్తలను అదుపులో పెట్టుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. భౌతిక దాడులకు పాల్పడుతున్న కార్యకర్తలపై క్రమశిక్షణ చర్యలు తీసుకుని తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని పేర్కొన్నారు.

## మోదీ హైదరాబాద్ పర్యటన షెడ్యూల్ ఖరారు

హైదరాబాద్ వెలుతురు మే 07: ప్రధాని నరేంద్ర మోడీ ఈ నెల 10న హైదరాబాద్‌లో పర్యటించనున్నారు. ఈ పర్యటనకు సంబంధించిన పూర్తి షెడ్యూల్ ఖరారైనట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజాసభతో కూడిన ఈ పర్యటనకు నగరంలో విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నారు. అధికారిక షెడ్యూల్ ప్రకారం ప్రధాని మోదీ ఆ రోజు మధ్యాహ్నం 2.50 గంటలకు బెంగళూరు నుంచి ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకోనున్నారు. అక్కడి నుంచి నేరుగా హెచ్ఐసీసీకి వెళ్లనున్నారు. హెచ్ఐసీసీలో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు. అనంతరం హైటెక్ సిటీలో ఏర్పాటు చేసిన ఓ ఆస్పత్రిని ప్రధాని ప్రారంభించనున్నారు. వైద్య రంగానికి సంబంధించిన కీలక కార్యక్రమంలో కూడా ఆయన పాల్గొననున్నట్లు సమాచారం. సాయంత్రం 6.30 గంటల నుంచి 7.30 గంటల వరకు సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న బహిరంగ సభలో ప్రధాని మోదీ పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ సభకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉండటంతో భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేస్తున్నారు.సభ అనంతరం ప్రధాని మోదీ బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి గుజరాత్‌లోని జామ్ నగర్ కు పయనమవుతారు.



# విజయ్‌కు మళ్లీ నిరాశేనా?

చెన్నై వెలుతురు మే 07:

తమిళనాడులో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం ప్రభుత్వ ఏర్పాటుపై స్పష్టత లేకపోవడంతో రాష్ట్ర రాజకీయ వాతావరణం మరింత ఉత్కంఠగా మారింది. ఈ నేపథ్యంలో టీవీకే (తమిళగ వెట్రి కళగం) అధినేత, సినీ నటుడు విజయ్ గురువారం మరోసారి గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను కలవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇవ్వాలని, అసెంబ్లీలో మెజార్టీ నిరూపించుకునేందుకు అవకాశం కల్పించాలని విజయ్ గవర్నర్‌ను కోరినట్లు సమాచారం. గవర్నర్‌తో విజయ్ భేటీ అనంతరం లోక్‌భవన్ అధికారికంగా ఒక ప్రెస్ నోట్ విడుదల చేసింది. అందులో, విజయ్ గవర్నర్‌ను కలిసి ప్రభుత్వ ఏర్పాటుపై తన వాదనను వినిపించినట్లు పేర్కొంది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో స్పష్టమైన మెజార్టీ కనిపించడం లేదని గవర్నర్ అభిప్రాయపడినట్లు ఆ ప్రకటనలో స్పష్టం చేశారు. మెజార్టీ ఉన్నప్పుడే ప్రభుత్వ ఏర్పాటుకు ముందుకు రావాలని గవర్నర్ సూచించినట్లు సమాచారం.

ఇది విజయ్ గవర్నర్‌ను కలవడం రెండోసారి కావడం గమనార్హం. ఎన్నికల ఫలితాలు వెలువడిన రెండు రోజుల వ్యవధిలోనే ఆయన రెండుసార్లు రాజ్‌భవన్‌కు వెళ్లి చర్చలు జరపడం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసింది. మొదటి భేటీలోనూ ప్రభుత్వ ఏర్పాటుపై చర్చ జరిగినప్పటికీ, సంఖ్యాబలం విషయంలో గవర్నర్ సంతృప్తి వ్యక్తం చేయలేదని తెలుస్తోంది. కనీసం 118 మంది సభ్యుల మద్దతు (మెజార్టీ మార్క్) సాధించిన తర్వాతే ప్రభుత్వ ఏర్పాటు అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ఆయన సూచించినట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ మద్దతు టీవీకేకు లభించినట్లు వార్తలు వెలువడినా, స్పష్టమైన సంఖ్యాబలం ఇంకా పూర్తి స్థాయిలో నిర్ధారణ కాలేదని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెస్ మద్దతుతో పాటు వీసీకే (విడుదలై చిరుతైగల్ కచ్చి), సీపీఐ వంటి పార్టీలు సానుకూలంగా స్పందించినప్పటికీ, అధికారికంగా పూర్తి స్థాయి మద్దతు ప్రకటన వెలువడలేదని తెలుస్తోంది. ఈ కారణంగానే గవర్నర్ స్పష్టమైన మెజార్టీపై ప్రశ్నలు లేవనెత్తినట్లు సమాచారం.

ఇక వీసీకే పార్టీ గవర్నర్‌ను కలిసి విజయ్‌కు ప్రభుత్వ ఏర్పాటు అవకాశం ఇవ్వాలని కోరినట్లు తెలుస్తోంది. అలాగే సీపీఐ కూడా సానుకూలంగా స్పందించినప్పటికీ అధికారికంగా నిర్ణయం ప్రకటించాల్సి ఉంది. మరోవైపు ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న డీఎంకే కూడా టీవీకేకు తొలి అవకాశం ఇవ్వాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ పరిణామాలు తమిళనాడు రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీస్తున్నాయి. ఇండియా కూటమి లోపలే ఈ అంశం కొత్త చర్చలకు కారణమవుతోంది. విజయ్‌కు మద్దతు ఇవ్వాలా లేదా అన్న అంశంపై కూటమి పార్టీల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నట్లు సమాచారం.

ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు ప్రక్రియ మరింత సంక్లిష్టంగా మారుతోంది. ఈ రాజకీయ ఉత్కంఠ మధ్య విజయ్ తీసుకున్న మరో నిర్ణయం కూడా చర్చనీయాంశమైంది. ముఖ్యమంత్రి హోదాకు అనుగుణంగా సాధారణంగా అందించే పోలీసు కాన్వాయ్‌ను ఆయన తిరస్కరించినట్లు టీవీకే వర్గాలు వెల్లడించాయి. ప్రమాణస్వీకారం జరిగే వరకు అలాంటి ప్రోటోకాల్ అవసరం లేదని ఆయన అభిప్రాయపడినట్లు సమాచారం. ఈ నిర్ణయం రాజకీయ వర్గాల్లో భిన్న వ్యాఖ్యలకు దారితీసింది. అయితే పోలీసు శాఖ మాత్రం భిన్న వివరణ ఇచ్చింది. ఎన్నికల ఫలితాల అనంతరం ప్రోటోకాల్ ప్రకారం విజయ్‌కు నాలుగు కాన్వాయ్ వాహనాలు అందించినట్లు అధికారులు తెలిపారు. అయితే వాటిని తిరిగి స్వచ్ఛందంగా సమర్పించారని, తాము వాటిని ఉపసంహరించలేదని స్పష్టం చేశారు. అలాగే ఆయన భద్రతను పెంచినట్లు కూడా పోలీసు అధికారులు వెల్లడించారు. ఆయన నివాసం వద్ద అదనపు భద్రతా ఏర్పాట్లు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. గవర్నర్‌ను కలిసే సమయంలో విజయ్ ప్రభుత్వ వాహనాన్ని ఉపయోగించలేదని పార్టీ వర్గాలు వెల్లడించాయి. వ్యక్తిగత నిర్ణయంగా ఆయన ప్రోటోకాల్ వాహనాలను ఉపయోగించకుండా స్వతంత్రంగా వెళ్లినట్లు చెబుతున్నారు.మొత్తం పరిస్థితిని పరిశీలిస్తే తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటుపై ఇంకా స్పష్టత రాలేదు. ఒకవైపు గవర్నర్ మెజార్టీపై స్పష్టమైన అభిప్రాయం వ్యక్తం చేస్తుండగా, మరోవైపు మిత్రపక్షాల మద్దతు ప్రక్రియ పూర్తిగా ఖరారు కాకపోవడం గందరగోళానికి దారితీస్తోంది. టీవీకే నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడే అవకాశంపై ఆశలు ఉన్నప్పటికీ, సంఖ్యాబలం నిర్ధారణే ప్రధాన అడ్డంకిగా మారింది. ప్రస్తుతం రాజకీయ వర్గాల దృష్టి తదుపరి పరిణామాలపై కేంద్రీకృతమైంది. విజయ్ మరోసారి గవర్నర్‌ను కలుస్తారా, లేదా మిత్రపక్షాల మద్దతు స్పష్టత వచ్చే వరకు వేచి చూస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది. తమిళనాడు రాజకీయాల్లో ఈ పరిణామాలు రాబోయే రోజుల్లో మరిన్ని మార్పులకు దారితీసే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఉగ్రమూకలకు బుద్ధి చెప్పాం

- 'ఆపరేషన్ సిందూర్' భారత సైనిక శౌర్యానికి నిదర్శనం
- 'దేశ భద్రతా నిబద్ధతకు ప్రతీక అని ప్రధాని మోదీ వ్యాఖ్య
- ఉగ్రవాదంపై భారత్ కఠిన వైఖరిని ప్రపంచానికి చాటిందని వ్యాఖ్య
- పహల్గాం దాడికి గట్టి ప్రతిస్పందనగా ఆపరేషన్ సిందూర్ అమలు

న్యూఢిల్లీ వెలుతురు మే 07:

ఉగ్రవాదంపై భారత్ అనుసరిస్తున్న కఠిన వైఖరిని, దేశ భద్రతను కాపాడడంలో భారత సాయుధ దళాల నిబద్ధతను ప్రతిబింబించే కీలక ఘట్టంగా 'ఆపరేషన్ సిందూర్' నిలిచిందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. ఈ ఆపరేషన్‌కు ఏడాది పూర్తైన సందర్భంగా ఆయన సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో ప్రత్యేక సందేశాన్ని పోస్ట్ చేశారు. ప్రధాని తన సందేశంలో, ఉగ్రవాదాన్ని ఏ రూపంలోనూ సహించబోమని భారత్ స్థిరమైన వైఖరిని మరోసారి స్పష్టం చేశారు. దేశ భద్రతను కాపాడేందుకు భారత సైన్యం చూపిన ధైర్యం, సంకల్పం, కచ్చితమైన వ్యూహం దేశానికి గర్వకారణమని ఆయన అభివర్ణించారు. ఉగ్రవాద దాడులకు తగిన సమాధానం ఇవ్వడంలో 'ఆపరేషన్ సిందూర్' ఒక మైలురాయిగా నిలిచిందని ఆయన వ్యాఖ్యానించారు.సరిగ్గా ఏడాది క్రితం భారత సాయుధ దళాలు అత్యంత వ్యూహాత్మకంగా, సమన్వయంతో ఈ ఆపరేషన్‌ను చేపట్టాయని ప్రధాని గుర్తు చేశారు. పహల్గాం ప్రాంతంలో అమాయక ప్రజల ప్రాణాలను తీసిన ఉగ్రవాద దాడికి ఇది ప్రత్యక్ష ప్రతిస్పందనగా జరిగింది. ఆ దాడికి బాధ్యులైన ఉగ్రవాద గుంపులకు గట్టి సందేశం ఇచ్చేలా భారత సైన్యం చర్యలు తీసుకుందని ఆయన తెలిపారు. ఆపరేషన్ సమయంలో సైన్యం చూపిన కచ్చితత్వం, సమయస్ఫూర్తి, వ్యూహాత్మక ప్రణాళిక ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైందని ప్రధాని అన్నారు. లక్ష్యాలను ఖచ్చితంగా గుర్తించి, ఉగ్రవాద మౌలిక వసతులపై దాడులు చేయడం ద్వారా భారత సాయుధ దళాలు తమ సామర్థ్యాన్ని నిరూపించాయని ఆయన పేర్కొన్నారు. ఈ చర్యలు దేశ భద్రతను మరింత బలోపేతం చేశాయని అన్నారు. భారత సైన్యం శౌర్యం, పరాక్రమం, అంకితభావం పట్ల దేశవ్యాప్తంగా ప్రజలు గర్విస్తున్నారని ప్రధాని తన సందేశంలో తెలిపారు. సరిహద్దు భద్రతను కాపాడడంలో సైనికులు చూపుతున్న నిరంతర అప్రమత్తత దేశానికి బలమైన రక్షణ కవచంగా నిలుస్తోందని ఆయన ప్రశంసించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాటంలో భారత్ వెనుకడుగు వేయదని ఆయన పునరుద్ఘాటించారు. రక్షణ రంగంలో భారత్ స్వావలంబన దిశగా వేగంగా ముందుకు సాగుతోందని ప్రధాని పేర్కొన్నారు. దేశీయంగా అభివృద్ధి చేసిన సాంకేతికత, ఆయుధ వ్యవస్థలు, వ్యూహాత్మక సామర్థ్యం 'ఆపరేషన్ సిందూర్' సమయంలో స్పష్టంగా కనిపించాయని ఆయన తెలిపారు. ఇది దేశ భద్రతా వ్యవస్థకు అదనపు బలాన్ని చేకూర్చిందని ఆయన అభిప్రాయపడ్డారు.ఉగ్రవాదాన్ని మరియు దానికి మద్దతు ఇచ్చే శక్తులను పూర్తిగా అణచివేయడమే భారత్ లక్ష్యమని ప్రధాని స్పష్టం చేశారు. భవిష్యత్తులోనూ దేశ భద్రతకు ముప్పు కలిగించే ఏ శక్తినైనా కఠినంగా ఎదుర్కొంటామని ఆయన హెచ్చరించారు. భారత సాయుధ దళాలు ఎప్పుడూ సిద్ధంగా ఉన్నాయని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం 'ఆపరేషన్ సిందూర్' విజయానికి గుర్తుగా కొత్త లోగోను విడుదల చేసింది. గతంలో ఆపరేషన్ సమయంలో ఉపయోగించిన లోగోకు అదనంగా భారత జాతీయ పతాకాన్ని జోడిస్తూ కొత్త రూపకల్పన చేశారు. ఈ లోగోలో జాతీయ పతాకం గర్వంగా రెపరెపలాడుతున్న విధంగా చూపించారు. ఈ కొత్త లోగోను ప్రధాని సహా పలువురు కేంద్ర మంత్రులు, రాజకీయ నేతలు తమ సోషల్ మీడియా ప్రొఫైల్ చిత్రాలుగా ఉపయోగించారు. ఇది ఆపరేషన్ విజయానికి, సైనికుల త్యాగానికి గౌరవ సూచకంగా భావిస్తున్నారు. రక్షణ రంగ నిపుణుల అభిప్రాయం ప్రకారం, 'ఆపరేషన్ సిందూర్' భారత వ్యూహాత్మక సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన కీలక ఉదాహరణగా నిలిచింది. ఉగ్రవాదంపై భారత్ అనుసరిస్తున్న జీరో టాలరెన్స్ విధానం ఈ ఆపరేషన్ ద్వారా మరింత బలంగా ప్రతిఫలించిందని వారు విశ్లేషిస్తున్నారు. మొత్తంగా, ఏడాది పూర్తయిన 'ఆపరేషన్ సిందూర్' భారత్ భద్రతా విధానంలో ఒక కీలక మైలురాయిగా నిలిచిందని స్పష్టమవుతోంది. దేశ రక్షణలో సైనిక దళాల పాత్రను మరింత బలంగా గుర్తుచేసే ఈ ఆపరేషన్, భవిష్యత్తులోనూ భారత్ వ్యూహాత్మక స్థిరత్వానికి ప్రతీకగా నిలుస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## బూతులు తిడితే ఊరుకుంటమా?

హైదరాబాద్ వెలుతురు మే 07:

ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై జరిగిన దాడి ఘటనపై బీజేపీ ఎమ్మెల్సీ, బీజేఎల్పీ డిప్యూటీ లీడర్ పాయల్ శంకర్ స్పందించారు. భౌతిక దాడులను బీజేపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఎప్పుడూ ప్రోత్సహించబోరని స్పష్టం చేశారు. అయితే బూతులు, వ్యక్తిత్వ హననంతో కార్యకర్తలను రెచ్చగొడితే వారు చూస్తూ ఊరుకోరని అన్నారు. అయినప్పటికీ బీజేపీ కార్యకర్తలు సంయమనంతో ఉండాలని పార్టీ ఎప్పుడూ చెబుతోందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి గతంలో మహిళా గవర్నర్‌ను కించపర్చారని, అధికారులపై కూడా నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని పాయల్ శంకర్ ఆరోపించారు. నోటి దురుసు ఫలితంగానే ఈ ఘటన జరిగిందని వ్యాఖ్యానించారు. గెలిచిన తర్వాత అందరినీ బ్లాక్‌మెయిల్ చేస్తూ మాట్లాడితే ప్రజలు సహించరని అన్నారు.అలాగే కేటీఆర్ కాందిశీకుల భూముల అంశంపై చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్ విసిరిన సవాల్‌ను స్వీకరించి ఆధారాలతో నిరూపించాలని అన్నారు. బండి సంజయ్‌కు తంబాకు, డ్రగ్స్ అలవాట్లు లేవని నిరూపించేందుకు తాము కుటుంబ సభ్యులతో కలిసి దేవాలయంలో ప్రమాణం చేసేందుకు సిద్ధమని తెలిపారు. అదే విధంగా కేటీఆర్ కూడా డ్రగ్స్ తీసుకోలేదని దేవుడి సాక్షిగా ప్రమాణం చేసే దమ్ముందా? అని ప్రశ్నించారు.రాజకీయాల్లో శ్రుతి మించి ఆరోపణలు చేస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని, కౌశిక్ రెడ్డిపై దాడి ఘటన ఇందుకు నిదర్శనమని పాయల్ శంకర్ వ్యాఖ్యానించారు.

# ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు

హైదరాబాద్ వెలుతురు మే 07:

ప్రతి పేదవాడికి సొంత ఇల్లును సమకూర్చడం, భూ యాజమానులకు తమ భూమి పై స్పష్టమైన హక్కులను కల్పించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం పేదల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోందన్నారు. ఇల్లు, భూమి ప్రతి కుటుంబానికి ఆత్మగౌరవానికి ప్రతీకని పేదవాడికి భద్రమైన భవిష్యత్తు కల్పించడమే ప్రభుత్వ సంకల్పం అని మంత్రి పేర్కొన్నారు. పేదల జీవితాల్లో గౌరవప్రదమైన మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వం లోని ప్రజాప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు అనే మహత్తర కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు.

ఈ పథకం కింద పేద కుటుంబాలకు వారి సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణం కోసం ఒక్కొక్క ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. దాదాపు 4 లక్షల ఇళ్లను మంజూరు చేసి, రాష్ట్రవ్యాప్తంగా గృహ విప్లవానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. హౌసింగ్, రెవెన్యూ అంశాలపై జిల్లాల వారీగా ప్రజా ప్రతినిధులతో జరుపుతున్న సమీక్షలో భాగంగా గురువారం నాడు హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లాలకు చెందిన ఇన్‌ఛార్జి మంత్రులు, మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు అధికారాలతో మంత్రి గారు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాల్లో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, నల్గొండ ఇన్‌ఛార్జి మంత్రి ఎస్సీ ,ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్, వాకాటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్ జి. చిన్నా రెడ్డి,ప్రభుత్వ సలహాదారులు జితేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో క్షేత్ర స్థాయిలోని పరిస్థితులపై స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయంతో వ్యవహరించాలని, జిల్లా స్థాయిలో అధికారయంత్రాగమంతా సమన్వయంతో పనిచేస్తే అక్కడికక్కడే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా కలెక్టర్లు పనిచేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలులో అత్యధిక శాతం అధికారాలను కలెక్టర్లకే దఖలు పరిచామన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఒకసారి ప్రొసీడింగ్స్ ఇచ్చి, మొదటి బిల్లు వారి ఖాతాల్లో జమ అయిన లబ్ధిదారులందరికీ తదుపరి విడతల బిల్లులన్నిటిని సకాలంలోనే విడుదలయ్యేలా చూడాలని మంత్రిగారు కలెక్టర్లను ఆదేశించారు. అలాగే ఇందిరమ్మ ఇండ్ల విషయంలో ఎటువంటి అక్రమాలకు తావివ్వకుండా, పూర్తి పారదర్శకంగా జవాబుదారీ తనంతో పనిచేస్తూ అర్హులైన వారికే ఫలాలు దక్కేలా చూడాలని ఈ విషయంలో ఎక్కడ పొరపాటు జరిగినా ఉపేక్షించేది లేదన్నారు. గతంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం సేకరించి పూర్తి స్థాయిలో వినియోగించకుండా మిగిలి ఉన్న భూముల్లో అర్హులైన వారికి ఇండ్ల పట్టాలు ఇచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు ఆదేశాలిచ్చారు. గతంలో ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇల్లు మంజురైనా వివిధ కారాణలతో నిర్మాణాలను పూర్తి చేయని వారికి కూడా వెసులుబాటు కల్పించే యోచనలో ఉన్నామని తెలిపారు. ముఖ్యంగా జిల్లాల్లో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరక్టర్లు పూర్తి బాధ్యతాయుతంగా విధులను నిర్వహించాలని, లబ్ధిదారులు, ఉన్నతాధికారుల మధ్య సమన్వయకర్తలుగా వ్యవహరిస్తూ సమస్యల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని , ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.అలాగే డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణపు పనులు ఏ స్థాయిలో ఉన్నా, ఈ నెల 20 వ తేదీలోగా లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేయాలని, ఈ విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులు కూడా చొరవ చూపాలని మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారు సూచించారు. అర్హులైన పేదలనే లబ్ధిదారులుగా ఎంపిక చేయాలన్నారు.

**అదనపు ఎమ్మార్వోల నియామకం**

రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు నూతన భవనాలను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఈ కార్యాలయాలన్నిటిని ప్రజలకు అందుబాటులో ఉండే ప్రదేశాల్లో నెలకొల్పేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. అలాగే లక్షకు పైగా జనాభా ఉన్న మండలాల్లో, అవసరానికి అనుగుణంగా , అదనంగా మరో తహశీల్దార్ ను నియమించనున్నామని మంత్రి తెలిపారు. ఇందుకు సంబంధించిన జిల్లా కలెక్టర్లు ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. రెవెన్యూ, అటవీ తదితర శాఖల మధ్య ఉన్నభూ వివాదాల సమస్య కు శాశ్వత పరిష్కారం కోసం ఆయా విభాగాలు ఉమ్మడిగా సర్వే చేయడమే మార్గమన్నారు. ఈ దిశలో మరింత వేగవంతమైన చర్యలు తీసుకోవాలని అటవీ, రెవెన్యూ అధికారులకు మంత్రి స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేనట్లుగా రెవెన్యూ విభాగంలో అనేక సంస్కరణలు తీసుకుని వచ్చి ఆర్డీవోలకు విస్తృతమైన అధికారాలు కల్పించామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కాకుండా, ఇతర ప్రయోజనాలకు వీటిని వినియోగిస్తే అత్యంత కఠినంగా వ్యవహరిస్తామని పేర్కొన్నారు రాష్ట్రంలో భూ పరిపాలనను బలోపేతం చేయడంలో భాగంగా సర్వే, సెటిల్మెంట్స్ మరియు భూ రికార్డుల శాఖ ద్వారా సమగ్ర సంస్కరణలు అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. భూ రికార్డుల్లో పారదర్శకత, ఖచ్చితత్వం తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. పేదలకు న్యాయం జరిగేలా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని అన్నారు.

# నూతన ఫెడరేషన్ చైర్మన్లతో హర్కార వేణుగోపాల్ రావు భేటీ

- ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపిన చైర్మన్లు, వైస్ చైర్మన్లు
- వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తామని హామీ ఇచ్చిన ప్రతినిధులు
- సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన నూతన బాధ్యులు
- సంక్షేమ పథకాల అమలులో కీలక పాత్ర పోషించాలని సూచన
- అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమన్న హర్కార వేణుగోపాల్ రావు
- ప్రజలకు చేరువగా పనిచేయాలని చైర్మన్లకు సూచించిన ప్రభుత్వ సలహాదారు
- సమాజ సేవకు అవకాశంగా బాధ్యతలను స్వీకరిస్తామన్న నేతలు
- ప్రభుత్వ విశ్వాసాన్ని నిలబెట్టుకుంటామని స్పష్టం చేసిన ప్రతినిధులు
- తెలంగాణ అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతామని వెల్లడించిన ఫెడరేషన్ సభ్యులు




**హైదరాబాద్ వెలుతురు మే 07:**
తెలంగాణ ప్రభుత్వం ఇటీవల నియమించిన వివిధ కుల ఫెడరేషన్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు గురువారం సచివాలయంలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు (ప్రోటోకాల్ అండ్ పబ్లిక్ రిలేషన్స్) శ్రీ హర్కార వేణుగోపాల్ రావును మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. తమపై విశ్వాసం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ప్రభుత్వానికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా చైర్మన్లు, వైస్ చైర్మన్లు మాట్లాడుతూ.. తమ తమ వర్గాల అభ్యున్నతి, సామాజిక సంక్షేమం, యువత అభివృద్ధి కోసం సమర్థవంతంగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసే దిశగా కృషి చేస్తామని పేర్కొన్నారు. సమాజంలోని వెనుకబడిన వర్గాలకు మరింత మేలు జరిగేలా ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని తెలిపారు. శ్రీ హర్కార వేణుగోపాల్ రావు నూతనంగా నియమితులైన చైర్మన్లు, వైస్ చైర్మన్లకు అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించాలని సూచించారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకుని ప్రభుత్వానికి నివేదిస్తూ, ఆయా వర్గాల అభివృద్ధికి అంకితభావంతో పని చేయాలని కోరారు. అలాగే, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు సమర్థవంతంగా ప్రజలకు చేరేలా ఫెడరేషన్ ప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని ఆయన పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి వర్గం అభివృద్ధి చెందితేనే రాష్ట్రం సమగ్రాభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా సేవాభావంతో పనిచేయాలని హితవు పలికారు.

## రిసార్టు రాజకీయాలతో మళ్లీ వేడెక్కిన తమిళనాడు

చెన్నై, మే 7 (వెలుతురు):
తమిళనాడు రాజకీయాలు మరోసారి ఉత్కంఠభరిత దశలోకి ప్రవేశించాయి. ప్రభుత్వం ఏర్పాటు చుట్టూ నెలకొన్న అనిశ్చితి నేపథ్యంలో "రిసార్టు రాజకీయాలు" మళ్లీ తెరపైకి రావడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అధికార పోరాటం క్షణక్షణం ఉత్కంఠ రేపుతున్న వేళ, అన్నాడిఎంకే ప్రభుత్వం ఏర్పాటు దిశగా కీలక అడుగులు వేస్తున్నట్లు సంకేతాలు ఇస్తోంది. పార్టీ సీనియర్ నాయకుడు కే . ఏ . సెంగోతట్టైయాన్ అంబలగన్ మీడియాతో మాట్లాడుతూ, "ప్రస్తుతం మాకు 118 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉంది. రాజ్యాంగబద్ధంగా, ప్రజాస్వామ్యబద్ధంగా మేమే ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం. త్వరలోనే మరికొన్ని పక్షాల మద్దతు కూడా లభించబోతోంది" అని ధీమా వ్యక్తం చేశారు. ఆయన చేసిన "అద్భుతం జరగబోతోంది" అన్న వ్యాఖ్య రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది. ప్రభుత్వ ఏర్పాటు ప్రయత్నాల్లో భాగంగా అన్నా డిఎంకే తమ ఎమ్మెల్యేలను కాపాడుకునేందుకు క్యాంప్ రాజకీయాలకు తెరలేపింది. సమాచారం ప్రకారం, సుమారు 27 మంది ఎమ్మెల్యేలను పుదుచ్చేరిలోని ఓ ప్రైవేట్ రిసార్టుకు తరలించారు. మిగతా ఎమ్మెల్యేలను సివి షణ్ముగాం నేతృత్వంలో ఇతర రహస్య ప్రాంతాలకు పంపినట్లు తెలుస్తోంది. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేకుండా ఎమ్మెల్యేలను ఒకేచోట ఉంచేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇక ఈ పరిణామాలపై సినీ నటుడు ప్రకాష్ రాజ్ స్పందిస్తూ, "ప్రజాస్వామ్యబద్ధంగా గెలిచిన వారికి ముందుగా అవకాశం ఇవ్వాలి" అని సోషల్ మీడియాలో అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో అందరి దృష్టి గవర్నర్ నిర్ణయంపై నిలిచింది. అసెంబ్లీలో మెజార్టీ నిరూపించగల పార్టీకి ఆహ్వానం లభిస్తుందా? లేక రాజకీయ సమీకరణాలు మరో మలుపు తిప్పుతాయా? అన్నది ఆసక్తికరంగా మారింది. మొత్తానికి, ఎమ్మెల్యేల మద్దతు గణాంకాలు, రిసార్టు రాజకీయాలు, గవర్నర్ నిర్ణయం. ఈ మూడు అంశాలు కలిసి తమిళనాడు రాజకీయాలను మరింత ఉత్కంఠభరితంగా మార్చుతున్నాయి. రాబోయే రోజుల్లో ఈ రాజకీయ నాటకానికి కీలక మలుపు తిరిగే అవకాశముంది.



## దీది కి షాక్.. బెంగాల్ అసెంబ్లీ రద్దు..!



Kolkata Gazette

Extraordinary
Published by Authority

Notification No.: 275-P.A./1L-03/2026 Date: 06.05.2026

PART I—Orders and Notifications by the Governor of West Bengal, the High Court, Government Treasury, etc.

GOVERNMENT OF WEST BENGAL
Department of Parliamentary Affairs
Writers' Buildings, G-Block, 1st Floor, Kolkata-700 001

No. 275-P.A./1L-03/2026 Dated, the 6th May, 2026

NOTIFICATION

The following order of the Governor of West Bengal is hereby published for general information :-

"Order

In exercise of the power conferred on me by sub-clause (b) of Clause (2) of Article 174 of the Constitution of Ind[ia] I hereby dissolve the Legislative Assembly of West Bengal with effect from 07th of May, 2026.

Sd/- R. N. Ravi
Governor of West Bengal

By order of the Governor,



- సంచలన నిర్ణయం తీసుకున్న గవర్నర్
- కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సుగమం

**కోల్‌కతా, మే 07 (వెలుతురు):**

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కీలక మలుపు తిరిగింది. రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్. రవి గురువారం అసెంబ్లీని రద్దు చేస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పదవికి రాజీనామా చేయకపోవడం ఈ నిర్ణయానికి ప్రధాన కారణమైంది. అసెంబ్లీ కాలపరిమితి ముగియడంతో పాటు, ప్రభుత్వం కొనసాగించేందుకు రాజ్యాంగపరమైన పరిస్థితులు లేకపోవడంతో గవర్నర్ ఈ చర్య చేపట్టినట్లు సమాచారం. దీంతో మమతా బెనర్జీ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారికంగా బర్తరఫ్ అయినట్లైంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 294 స్థానాలకు రెండు విడతలుగా పోలింగ్ జరగగా, మే 4న వెలువడిన ఫలితాల్లో భారతీయ జనతా పార్టీ స్పష్టమైన మెజార్టీ సాధించింది. ప్రజలు బీజేపీకి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే స్థాయిలో మద్దతు ఇచ్చారు. దీంతో రాష్ట్రంలో అధికార మార్పిడి అనివార్యమైంది. ఈ నేపథ్యంలో శుక్రవారం బీజేపీ శాసనసభాపక్ష సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు తమ నాయకుడిని ఎన్నుకోనున్నారు. ముఖ్యమంత్రి అభ్యర్థిగా పలువురి పేర్లు వినిపిస్తున్నప్పటికీ, తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీపై ఘన విజయం సాధించిన సువేందు అధికారి పేరు బలంగా వినిపిస్తోంది. ఇదిలా ఉండగా, మే 9న ఉదయం 10 గంటలకు కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్ వద్ద కొత్త ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ స్థాయి నేతలు హాజరుకానున్నట్లు సమాచారం. మరోవైపు ఎన్నికల్లో ఓటమి చెందిన మమతా బెనర్జీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల నిర్వహణపై ఆమె తీవ్ర ఆరోపణలు చేస్తూ, ఎన్నికల సంఘం పై విమర్శలు గుప్పించారు. "అసలు విలన్ ఈసీ" అంటూ మండిపడిన ఆమె, తాను రాజీనామా చేయబోనని స్పష్టం చేశారు. అయితే రాజ్యాంగ ప్రక్రియల నేపథ్యంలో గవర్నర్ తీసుకున్న నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త దశకు నాంది పలికింది. కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో బెంగాల్‌లో పాలన ఎలా మారనుందన్నది ఆసక్తికరంగా మారింది.




Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7231/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com